## పర్యావరణ సంక్షోభం..
# ఆ దేశాలకు మరణశిక్షే
ఐరాస చీఫ్ ఆందోళన 2




f /manamnews
www.manamnews.com

# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ | గురువారం • 16-2-2023 • సంపుటి:7 • సంచిక:17 • పేజీలు:12 • వెల:రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


మాఘమాసం, గురువారం, తిథి: ఏకాదశి, ఉ.5.33 నుంచి రేపు ఉ.2.49 వరకు, నక్షత్రం: మూల, ఉ.12.46 నుంచి రా.10.52 వరకు, వర్జ్యం: ఉ.7.31-8.57 వరకు, దుర్ముహూర్తం: మ.12.07 నుంచి 12.53 వరకు, రాహుకాలం: మ.1.56-3.22 వరకు

## త్రిపురలో పోలింగ్‌కు 2
# సర్వం సిద్ధం



## రాష్ట్రాలు అంగీకరిస్తే జీఎస్టీ కిందకు పెట్రోల్
కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమేనని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాష్ట్రాలు అంగీకరిస్తే వెంటనే వాటిని జీఎస్టీ కిందకు తీసుకొస్తామన్నారు. బుధవారం ఆమె పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సభ్యులతో బడ్జెట్ అనంతర చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వస్తు, సేవల పన్ను పరిధిలోకి పెట్రోలియం ఉత్పత్తులను తీసుకొచ్చే అంశంపై అడిగిన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. ''రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరితేనే అది సాధ్యమవుతుంది'' అని తెలిపారు.ఈ సందర్భంగా ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గురించి నిర్మలమ్మ మాట్లాడుతూ.. ..మిగతా 2లో

# కొండగట్టుకు మళ్లీ వస్తా

అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా మారుస్తాం

ఆలయ అభివృద్ధికి మరో రూ.500 కోట్లు

86 ఎకరాలలో సువిశాల పార్కింగ్

750-850 ఎకరాలలో ఆలయ అభివృద్ధి, విస్తరణ

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (మనం బ్యూరో):** ప్రపంచాన్ని ఆకర్షించే అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా కొండగట్టును తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. దేశంలోనే అతి పెద్ద హనుమాన్ క్షేత్రంగా కొండగట్టును రూపొందించి అన్ని హంగులతో యాదాద్రి తరహాలో అభివృద్ధి పరచనున్నట్లు హామీనిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకొన్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై అధికారులతో రెండు గంటలకుపైగా సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ యాదాద్రి మాదిరిగా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధిని ఒక బృహత్తర ప్రాజెక్టుగా చేపట్టి భక్తులకు సకల ..మిగతా 2లో

### కొండగట్టులో కేసీఆర్ ఫ్యామిలీ.. పాత ఫోటోలు వైరల్



జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని కొండగట్టులో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఆయన గతంలో కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు వెళ్లిన పాత ఫోటోలు బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీఎం సతీమణి శోభారాణితో పాట కుమార్తె కవిత, కుమారుడు కేటీఆర్ చిన్న పిల్లలుగా ఆడుకుంటున్న ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కేసీఆర్ దాదాపు 25 ఏళ్ళ క్రితం కొండగట్టుకు కుటుంబంతో కలిసి వచ్చారు. చివరిసారిగా ఆయన 1998లో కొండగట్టు ఆలయానికి వచ్చారు. అప్పటికి ఇంకా ఉద్యమ ప్రస్థానం మొదలుపెట్టలేదు. ఈ తర్వాత ఉద్యమ సమయంలో, ఎన్నికల సమయాల్లో పలుమార్లు జగిత్యాలకు వచ్చినా.. కొండగట్టు ఆలయానికి రావడం మాత్రం ఇదే తొలిసారి.

# తగ్గనున్న చమురు ధరలు
మరోసారి పన్ను తగ్గించే అవకాశం?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఇప్పటికే ఆకాశాన్ని తాకిన పెట్రోల్, డీజిల్ ధరల నుంచి వాహనదారులకు మరోసారి ఊరట లభించనుందా? చమురుపై విధిస్తున్న పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించనుందా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. ద్రవ్యోల్బణం కట్టడికి చమురు సహా కొన్నింటిపై పన్నులు తగ్గించే అవకాశం ఉందని 'రాయిటర్స్' పేర్కొంది. విశ్వసనీయ వర్గాల నుంచి వచ్చిన సమాచారాన్ని ఉటంకించింది. అయితే, ఫిబ్రవరి ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా వెలువడ్డాక ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.దేశంలో ద్రవ్యోల్బణం కట్టడికి కొన్నాళ్లుగా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ కృషి చేస్తున్నాయి. గతేడాది మే నెలలో పెట్రోల్‌పై 8 రూపాయలు, డీజిల్‌పై 6 రూపాయలు చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. కొన్ని రాష్ట్రాలు సైతం వ్యాట్‌ను తగ్గించాయి. మరోవైపు ఆర్బీఐ రెపో రేటును పెంచుతూ వస్తోంది. దీంతో కొన్నాళ్లుగా ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. అయితే, జనవరి నెలకు తాజాగా వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు ఆలోచనలో పడేశాయి. డిసెంబర్ నెలలో 5.72 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం ..మిగతా 2లో

## మూడు రాష్ట్రాల్లో 60 చోట్ల ఎన్ఐఏ తనిఖీలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రెండు పేలుళ్ల కేసులకు సంబం ధించి ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) ఏకకాలంలో 60 చోట్ల తనిఖీలు చేపట్టింది. కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు బుధవారం తెల్లవారుజామున ఎన్ఐఏ అధికారులు చేరుకొన్నారు. గతేడాది అక్టోబర్‌లో తమిళనాడులోని కోయంబ త్తూరు, నవంబర్‌లో కర్ణాటకలోని మంగళూ రులో జరిగిన బాంబు పేలుళ్లకు ..మిగతా 2లో

# అనంతసాగర్‌లో నిలువెత్తు కాంస్య విగ్రహం

నర్సింహశర్మ మృతి అవధానానికి తీరని లోటు 2

- అవధాన శిరోమణిగా పేరుగాంచిన శర్మ

- ఆయన సేవలను కొనసాగిస్తాం: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు



# గిరిజన రిజర్వేషన్లు అమలుచేయండి

కేంద్రం అడ్డుకుంటే నేను చూసుకుంటా..

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రను కోమటిరెడ్డి బయటపెట్టారు

రెండు పార్టీలూ డ్రామాలాడుతున్నాయి

బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):** గిరిజన రిజర్వేషన్లు అమలుచేయాలని సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. రిజర్వేషన్లు కేంద్రం అడ్డుకుంటే నేను చూసుకుంటా.. అని సంచలన వ్యాఖ్యలు చేశారు. గిరిజన బంధు ఏమైంది? అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో ఏపీలో గిరిజన కార్పోరేషన్ ఏర్పాటు చేసిన గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. లిపి లేని సమాజానికి దిశానిర్దేశం చేసిన వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా చేసి గిరిజన జాతి గౌరవాన్ని ప్రధాని మోదీ నిలబెట్టారని గుర్తుచేశారు. గిరిజన ద్రోహి కేసీఆర్ అని.. సీఎం కేసీఆర్ అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు హాజరుకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం నిర్వహించడం లేదని మండిపడ్డారు. బంజారాహిల్స్‌లో సేవాలాల్ గుడిని అభివృద్ధి చేస్తామన్నారు. కొండగట్టు, వేములవాడకు ఇస్తానని చెప్పిన నిధులు ఎక్కడ? అని ప్రశ్నించారు. కొండగట్టు ప్రమాదంపై సీఎం కేసీఆర్ కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండగట్టు ప్రమాద బాధితులకు కనీస సహాయం చేయడం లేదని విమర్శలు గుప్పించారు. ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇక కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన ..మిగతా 2లో

## అగ్నివీరుల నియామక పరీక్ష నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** త్రివిధ దళాల్లో సైనిక నియామకాల కోసం కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'అగ్నిపథ్' స్కీమ్ కింద నిర్వహించే అగ్నివీరుల నియామక పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 15 వరకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జోన్ల వారీగా నోటిఫికేషన్లను వేర్వేరుగా విడుదల చేశారు. రెండు దశల్లో చేపట్టే ఈ ఎంపిక ప్రక్రియలో తొలుత ఆన్‌లైన్ కంప్యూటర్ ..మిగతా 2లో

# పొత్తులు ఉండవు

ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తాం

ఎంపీ కోమటిరెడ్డి పార్టీ లైన్‌లోనే ఉన్నారు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):** వచ్చే ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని, అప్పుడు కాంగ్రెస్‌తో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటారని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాజాగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావు థాక్రే స్పందించారు. తన వ్యాఖ్యలను వెంకటరెడ్డి ఉపసంహరించుకున్నారని, పార్టీ లైన్‌లోనే ఉన్నారని స్పష్టం చేశారు. ఎవ్వరితోనూ కాంగ్రెస్ పొత్తు పెట్టుకోదని, అసలు పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కి లేదని ..మిగతా 2లో

# ఏసీ గదుల్లో కూర్చొని ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దు



కార్యకర్తల మనోభావాలు దెబ్బతీయొద్దు

బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు 2

ఎర్రబెల్లి ఏబీసీడీలు రాస్తే.. నేను రాజీనామా చేస్తా

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

## పట్టాలు తప్పిన గోదావరి ఎక్స్‌ప్రెస్
తప్పిన పెనుముప్పు



**బీబీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):** విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727)కు పెను ముప్పు తప్పింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని అంకుషాపూర్ సమీపంలో ఈ రైలు పట్టాలు తప్పింది. నాలుగు బోగీలు పట్టాల నుంచి పక్కకు జరిగాయి. దీంతో అందులోని ప్రయాణికులు ..మిగతా 2లో


మంచిమాట

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. సమస్యలు లేని జీవితమంటూ ఉండదు.

శుభోదయం


# ఇప్పటికైనా స్పందించండి
విమానాశ్రయాల ఏర్పాటుపై కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):** తెలంగాణలో పలు ప్రాంతాల్లో విమానా శ్రయాల ఏర్పాటుపై సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటు ద్వారా వాయు మార్గ అనుసంధానత కోసం అవసరమైన డెవలప్‌మెంట్ చేసివ్వాలని కేంద్రం ప్రభుత్వం కోరుతోందని, అయితే దీనిపై తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగ పరుచుకుంటూ. ..మిగతా 2లో

# స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):** తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వేర్వేరు విభాగాల్లో 5,204 స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ వైద్య ఆరోగ్య సేవల నియామక సంస్థ (టీఎంహెచ్ఎస్ఆర్బీ) ఇటీవల నియామక ప్రకటనను విడుదల చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పణకు ..మిగతా 2లో

# తెలంగాణలో హంగు, బొంగు ఏమీ రాదు
మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ 2



# పర్యావరణ సంక్షోభం.. ఆ దేశాలకు మరణశిక్షే

యూఎన్, ఫిబ్రవరి 15: వాతావరణ సంక్షోభం కొన్ని దేశాలకు మరణశిక్షగా పరిణమిస్తోందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం కారణంగా సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయని, ఇది సామూహిక వలసలకు దారితీసే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ఐరాస భద్రతా మండలిలో జరిగిన చర్చ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన గుటెరస్.. వాతావరణ సంక్షోభాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.''వాతావరణ సంక్షోభ పరిస్థితులతో సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. లండన్ నుంచి లాస్ ఏంజిల్స్ వరకు.. బ్యాంకాక్ నుంచి బ్యూనస్ ఎయిర్స్ వరకు ఈ పరిణామాలు దాదాపు వంద కోట్ల మందికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతుండటం.. సామూహిక వలసలకు దారితీసే ప్రమాదముంది. ఇప్పటికే కొన్ని దేశాల తీరప్రాంతాల్లో సముద్రమట్టాల పెరుగుదల సగటు రేటు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంది. ఇదిలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు శాశ్వతంగా కనుమరుగయ్యే అవకాశముంది'' అని గుటెరస్ హెచ్చరించారు.''ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలు పెరిగితే.. సముద్ర మట్టాల పెరుగుదల రెట్టింపు ఉండే అవకాశముంది. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే బంగ్లాదేశ్, చైనా, భారత్, నెదర్లాండ్స్ వంటి దేశాలు ప్రమాదంలో పడినట్లే. ప్రతి ఖండంలోని ప్రధాన నగరాలు తీవ్ర పరిణామాలను చవిచూడాల్సి వస్తుంది'' అని గుటెరస్ హెచ్చరించారు. ఈ పరిస్థితులకు మూలకారణమైన పర్యావరణ సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని లేదంటే ముప్పు పొంచి ఉన్న దేశాలకు అది మరణ శిక్షలా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది ఐరాస ప్రపంచ పర్యావరణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత ఎనిమిదేళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 1993తో పోలిస్తే సముద్ర మట్టాల పెరుగుదల రేటు రెట్టింపైందని ఆ నివేదిక వెల్లడించింది.

## త్రిపురలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

అగర్తలా, ఫిబ్రవరి 15: ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 60 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుండగా ఏర్పాట్లన్నీ పూర్తిచేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కిరణ్‌కుమార్ దినకర్రో వెల్లడించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ నేడు ఉదయం 7గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28.13లక్షల మంది ఓటర్లు ఉండగా.. 3,337 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిలో 1,100 కేంద్రాలను సున్నితమైనవిగా.. 28 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు తెలిపారు.త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా-ఐపీఎఫ్‌టీతో కలిసి పోటీ చేస్తుండగా.. సీపీఎం-కాంగ్రెస్‌తో జట్టుకట్టి బరిలో నిలిచింది. ఇకపోతే, తిప్రా మోతా పార్టీ సొంతంగానే ఎన్నికల రంగంలోకి దూకింది. ఈ ఎన్నికల కోసం 31వేల మంది పోలింగ్ సిబ్బంది, 25వేల మంది కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించగా, ఇవి ఫిబ్రవరి 17న సాయంత్రం 6గంటలవరకు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు. ఆటంకాలు కలిగించే వ్యక్తులు ప్రవేశించకుండా అంతర్జాతీయ, అంతర్ రాష్ట్ర సరిహద్దులను మూసివేశారు. మొత్తం 28.13 లక్షల మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 13.53లక్షల మంది మహిళా ఓటర్లే. ఈ ఎన్నికల బరిలో మొత్తం అన్ని పార్టీల నుంచి కలిపి 259మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 20మంది మహిళా అభ్యర్థులే ఉన్నారు. భాజపా నేత, ముఖ్యమంత్రి మాణిక్ సాహా టౌన్ బర్దోవలి నుంచి బరిలో నిలవగా.. కేంద్రమంత్రి ప్రతిమా భౌమిక్ ధన్పూర్ నుంచి భాజపా తరఫున పోటీలో ఉన్నారు. ఇకపోతే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌధురి.. సబ్రూమ్ అసెంబ్లీ సీటు నుంచి పోటీ చేస్తున్నారు. తిప్రా మోతా అధినేత ప్రద్యోత్ దెబ్బర్మా ఎన్నికల బరిలో లేరు. 60 సీట్లకు గాను భాజపా 55 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. ఆ పార్టీ మిత్రపక్షం ఐపీటీఎఫ్ మిగతా చోట్ల బరిలో ఉంది. ఇదిలా ఉండగా, సీపీఎం 47 చోట్ల పోటీ చేస్తుండగా.. మిత్రపక్షం కాంగ్రెస్ 13 చోట్ల బరిలో ఉంది. తిప్రా మోతా పార్టీ 42 చోట్ల పోటీ చేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 28 మందిని పోటీలో నిలపగా.. 58మంది స్వతంత్ర అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీజేపీ అత్యధికంగా 12మంది మహిళల్ని బరిలో నిలిపింది. అధికారం నిలుపుకోవాలని భాజపా తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా.. పూర్వ వైభవాన్ని సాధించేందుకు సీపీఎం తీవ్రంగా శ్రమిస్తోంది. ఆ దిశగానే అధికార, విపక్ష పార్టీలు ప్రచార హోరు కొనసాగించాయి. భాజపా తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు అనేకమంది ప్రముఖ నేతలు త్రిపురలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు మార్చి 2న జరగనుంది.

## రాష్ట్రాలు అంగీకరిస్తే.. జీఎస్టీ కిందకు పెట్రోల్

(మొదటిపేజీ తరువాయి)

''దేశవృద్ధి కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. తాజా బడ్జెట్లోనూ మూలధన వ్యయాన్ని 33 శాతం పెంచి రూ.10లక్షల కోట్లకు చేర్చాం'' అని ఆమె తెలిపారు. ఇక, కేంద్ర విద్యుత్ సహా పలు రంగాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను రాష్ట్రాలు కూడా అమలు చేసేలా ఒత్తిడి తీసుకొస్తున్నామన్నారు. దేశంలో గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉంటున్నప్పటికీ.. చాలా రాష్ట్రాల్లో వాటి ధరలు రూ.100 దరిదాపుల్లో, కొన్ని చోట్ల వంద పైనే ఉన్నాయి. ఇలా రికార్డు స్థాయిలో ఇంధన ధరలు పెరిగిపోవడంతో వీటిని జీఎస్టీ పరిధిలోకి తెచ్చి నియంత్రించాలనే కొంతకాలంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇందుకు కేంద్రం కూడా సుముఖత వ్యక్తం చేసినప్పటికీ.. ఇప్పటివరకు జీఎస్టీ మండలిలో దీనిపై ఎలాంటి ప్రతిపాదనలు చర్చకు రాలేదు. మరోవైపు పెట్రోల్‌ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే అంశంపై రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిపోతుందనే ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

## తగ్గనున్న చమురు ధరలు

(మొదటిపేజీ తరువాయి)

6.52 శాతానికి చేరింది. దీంతో ఆర్బీఐ మరోసారి పెంపు నిర్ణయం తీసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆర్బీఐ సిఫార్సులకు అనుగుణంగా కేంద్రం సైతం కొన్నింటిపై పన్నులు తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. పాలు, కూరగాయలు, మొక్కజొన్నలు, సోయాబీన్ ఆయిల్ వంటి ఆహార పదార్థాల ధరల రెక్కలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కజొన్నపై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని తగ్గించాలని యోచిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై ప్రస్తుతం 60 శాతం బేసిక్ డ్యూటీ వర్తిస్తోంది. అలాగే చమురుపైనా మరోసారి ఊరట ఇచ్చే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని పేర్కొన్నాయి. దీనిపై అటు ఆర్థికమంత్రిత్వ శాఖ గానీ, ఆర్బీఐ గానీ స్పందించలేదు. అయితే, ఆర్బీఐ వైపు నుంచి ఎప్పటిలానే సిఫార్సులు అందాయని, మరో నెల (ఫిబ్రవరి) ద్రవ్యోల్బణం లెక్కలు కూడా వచ్చాక దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## ఎన్టీఆర్ పేరిట రూ.100 వెండి నాణెం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరానని ఈ సందర్భంగా పురందేశ్వరి చెప్పారు. నిర్మలా సీతారామన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకున్న నేపథ్యంలో మింట్ నుంచి ఆమోదం వచ్చిందని.. సంబంధిత అధికారులు 3 ఫొటోలను పరిశీలించారని తెలిపారు. నాణెం రూపకల్పన ప్రొసీజర్‌కు నెలరోజుల సమయం పడుతుందని.. ఆ తర్వాతే విడుదల చేస్తారని ఆమె వివరించారు. తన తండ్రి ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందని.. దీన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు పురందేశ్వరి చెప్పారు.

# కొండగట్టుకు మళ్లీ వస్తా

(మొదటిపేజీ తరువాయి)

వసతులు, అన్ని హంగులతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఆలయానికి చేరుకునే ఘాట్ రోడ్డులను అభివృద్ధి చేయాలని సూచించారు. తాను ప్రకటించిన వంద కోట్ల నిధులే కాకుండా మరో ఐదు వందల కోట్ల రూపాయల నిధులు కూడా అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. హనుమాన్ జయంతి ఉత్సవాన్ని దేశంలోనే అత్యంత వైభవంగా ఈ పుణ్యక్షేత్రంలో జరపుకునేందుకు వీలుగా అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. హనుమాన్ దీక్ష స్వీకరణ, విరమణ కార్యక్రమాలు దివ్యంగా ఎలాంటి ఆటంకాలు కలుగకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సుమారు 750 నుంచి 850 ఎకరాల్లో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేయాలని, పెద్ద గోడ, పార్కింగ్, పుష్కరిణి, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, కోనేరును అభివృద్ధిపర్చాలని సీఎం తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి మరో రూ.500 కోట్ల నిధులను కేటాయించనున్నట్లు సీఎం ప్రకటించారు. ఇటీవల రూ.100 కోట్ల నిధులు ప్రకటించిన సీఎం ఇప్పుడు మరో రూ.500 కోట్లు ప్రకటించడంతో మొత్తం నిధులు రూ.600 కోట్లకు చేరాయి. ఆలయం పరిసరాల్లో 86 ఎకరాల స్థలంలో సువిశాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వసతులు గొప్పగా ఉంటే దర్శనానికి వచ్చే భక్తులు పెరుగుతారని, వారికి తగినట్లుగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. తాను మళ్ళీ కొండగట్టుకు వస్తానని, ఆలయ అభివృద్ధి, విస్తరణపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ప్రభుత్వ విప్ భాను ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ రమణ, శాసనసభ్యులు సుంకె రవిశంకర్, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సిఎంఓ కార్యదర్శి



స్మితా సబర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాష, అదనపు కలెక్టర్‌లు మందా మకరంద్, బిఎస్.లత, ఆలయ ఈఓ వేంకటేశం, ఆర్కిటెక్టర్ ఆనంద సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం

హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు సమీపంలోని నాచుపల్లి జేఎన్టీయూకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌లు సీఎంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గంలో సీఎం కేసీఆర్ అంజన్న క్షేత్రానికి చేరుకున్నారు.

# ఇప్పటికైనా స్పందించండి

(మొదటిపేజీ తరువాయి)

. సాంకేతిక, భూపరీక్షల ఆమోదాన్ని పొందిన ఆదిలాబాద్, జక్రాన్ పల్లి నిజామాబాద్, వరంగల్ విమానాశ్రయాల నిర్మాణానికి ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రిని కోరారు. సామాన్యుడికి కూడా విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు 2016లో కేంద్ర ప్రభుత్వం 'ఉడాన్' పథకం తీసుకొచ్చిందని.. దానికి అనుగుణంగా తెలంగాణలోనూ అన్ని రకాల అనుమతులున్న ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, వరంగల్ విమానాశ్రయాల నిర్మాణం జరిగితే చిన్న, ప్రైవేటు విమానాలు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.
విమానాశ్రయాల నిర్మాణం అంశాలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీతో పాటు పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా లేఖలు రాసినా.. కేసీఆర్ నుంచి స్పందన రాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. తాను కూడా గతేడాది జులై 30న కేసీఆర్‌కు లేఖ రాశానని, దానికి సీఎం కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం జక్రాన్ పల్లి, పాల్వంచ, దేవకరద్ర, మమ్నూరు, బసంత్ నగర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల కోసం ప్రతిపాదనలు పంపిందని.. అయితే సర్వే, సాయిల్ టెస్టింగ్, టెక్నో-ఎకనమిక్ ఫీజిబిలిటీ స్టడీ చేసిన తర్వాత ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, వరంగల్ విమానాశ్రయాల ఏర్పాటుకు ఆమోదముద్ర వేసిందని గుర్తు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోగా.. ఆ పార్టీ ఎంపీలు మాత్రం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందంటూ ప్రశ్నలు అడగటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. 2014లో 74గా ఉన్న విమానాశ్రయాల సంఖ్య.. ప్రస్తుతం 140 దాటిందని, 2026 నాటికి ఈ సంఖ్యను 220కి పెంచే లక్ష్యంతో కేంద్రం ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారిస్తే బాగుంటుందని సూచించారు.

## పొత్తులు ఉండవు

(మొదటిపేజీ తరువాయి)

తేల్చి చెప్పారు. తెలంగాణలో ఒంటరిగా అధికారంలోకి వచ్చేంత బలం కాంగ్రెస్‌కి ఉందని పేర్కొన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీజేపీ లాంటి శక్తులు పొత్తుల పేరిట తమను వీక్ చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. తాము ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తామని మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలందరూ ఐక్యంగా ఉన్నారని, త్వరలోనే నాయకులంతా పాదయాత్రలు చేస్తారని వెల్లడించారు. అంతకు ముందు.. పీసీసీ ఉపాధ్యక్షులతో సమావేశమైన థాక్రే, వారికి క్లాస్ పీకారు. మొత్తం 84 మంది ఉపాధ్యక్షులు ఉండగానే.. కేవలం 30 మందే సమావేశానికి రావడంపై సీరియస్ అయ్యారు. ఉపాధ్యక్షులకు కేటాయించిన జిల్లాలకు వెళ్లకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేటాయించిన జిల్లాలకు వెళ్లకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. పార్టీ సమావేశాలకు ఖచ్చితంగా హాజరుకావాల్సిందేనని నొక్కి చెప్పారు. ఇదే సమయంలో.. తెలంగాణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నేతలకు పలు లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు హాత్ సే హాత్ జోడో యాత్రలో ఖచ్చితంగా పాల్గొనాలని ఆదేశించారు.

## గిరిజన రిజర్వేషన్లు అమలుచేయండి

(మొదటిపేజీ తరువాయి)

బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రను కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి బయట పెట్టారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల తరవాత అధికారం పంచుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ డిసైడ్ అయ్యాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీ లు కలిసి పోటీ చేస్తాయని కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తుపై మాట్లాడిన కోమటి రెడ్డిపై ఆ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని ప్రశ్నించారు. రెండు పార్టీలు ఒక్కటే డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. అధికారం పంచుకోవాలని అనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలి? అని మండిపడ్డారు. బీఆర్ఎస్‌తో పొత్తు అంటే సస్పెండ్ చేస్తా? అని రాహుల్ గతంలో అన్నాడు.. మరి కోమటి రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే ఆ రెండు పార్టీలు ఒకటేనని స్పష్టం అవుతుందని ఆరోపణలు గుప్పించారు.

## తెలంగాణలో హంగు, బొంగు ఏమీ రాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): తెలంగాణలో హంగు, బొంగు ఏమీ రాదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణలో పొత్తు ఉండదని, వచ్చే ఎన్నికల్లో తాము పూర్తి మెజార్టీతో గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయినా.. తాము పోయి పోయి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటమా? అయిన మాకు పొత్తు పెట్టుకునే అవసరం ఏముంది? అని తిరిగి ప్రశ్నించారు. తమతో పోటీ పడే వాళ్ళు తెలంగాణలో లేరని తేల్చి చెప్పారు. వామపక్షాలతో పొత్తుపై కేసీఆర్ మాట్లాడతారని అన్నారు. బీఆర్ఎస్ బండి ఫుల్ లోడ్ అయి ఉందన్నారు. సికింద్రాబాద్, అంబర్పేట్ పార్లమెంట్ నియోజకవర్గాలకు కిషన్ రెడ్డి ఏ నిధులు తీసుకొచ్చారో చెప్పాలని నిలదీశారు. అంబర్పేటలో అభివృద్ధి గురించి కిషన్రెడ్డితో చర్చించడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కారు వెంకటేశ్ సిద్ధంగా ఉంటారన్నారు. ఇక ఈటల బీఆర్ఎస్‌లోకి రావడంపై తానేం చెప్పలేనని, బీఆర్ఎస్‌లోకి ఎప్పుడొస్తారో ఈటలనే అడగండని అన్నారు.కడపలో స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు ఈసీ అనుమతి ఇచ్చిందని.. కానీ తెలంగాణ నూతన సచివాలయం ప్రారంభానికి అనుమతి ఇవ్వలేదని తలసాని మండిపడ్డారు. వ్యవస్థలు ఎటు పోతున్నాయని ప్రశ్నించారు. ఇదే సమయంలో ఇటీవల సచివాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై వివరణ ఇచ్చారు. కార్మికులు చలి కాచుకునే సమయంలో ఆ ప్రమాదం చోటు చేసుకుందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారని.. ఈ వేడుకల్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తారని తలసాని స్పష్టం చేశారు.

## అగ్నివీరుల నియామక పరీక్ష నోటిఫికేషన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

బేస్డ్ రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత రిక్రూట్మెంట్ ర్యాలీ చేపట్టి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఏప్రిల్ 17నుంచి అగ్నివీర్ ప్రాథమిక అర్హత పరీక్ష జరగనుంది. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు అగ్నివీరులుగా ఎంపిక చేయనున్నారు. అగ్నివీరులుగా చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని.. ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే దళారుల్ని నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# మూడు రాష్ట్రాల్లో 60 చోట్ల ఎన్ఐఏ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. వీటిల్లో కొండుంగయూర్ (తమిళనాడు), మన్నాడి (కేరళ) కూడా ఉన్నాయి.గతేడాది అక్టోబర్ 23వ తేదీన కోయంబత్తూరులోని కట్టాయ్ ఈశ్వరన్ దేవాలయం వద్ద కారు బాంబు పేలింది. ఈ ఘటనపై అదే నెల 27న ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఇప్పటికే ఈ కేసులో 11 మంది నిందితులను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. కారు బాంబు పేలిన సమయంలో జమేష ముబీన్ అనే నిందితుడు మరణించాడు. ఇతడు ఐసిస్‌కు విధేయతను ప్రకటించన తర్వాతే కారుబాంబు పేలుడుకు పాల్పడినట్లు ఎన్ఐఏ ప్రకటించింది. ఈ కేసులో అరెస్టైన నిందితులు నేర పూరిత కుట్రలో భాగంగానే అసనూరు, కదంబూరులోని సత్యమంగళం అడవుల్లో భేటీ అయ్యారని. దీనిలో ఉమర్ ఫరూక్, జమేష ముబీన్, మహమ్మద్ అజరుద్దీన్, షేక్ హిదాయతుల్లా సోన్ఫర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఉగ్రకార్యకలాపాలకు పాల్పడాలని నిర్ణయించినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. గతేడాది నవంబర్‌లో మంగళూరులోని ఓ ఆటోరిక్షాలో కుక్కర్ బాంబు పేలింది. దీనిపై డిసెంబర్‌లో ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. మహమ్మద్ సారిక్ అనే వ్యక్తి బాంబును తీసుకెళుతున్నట్లు గుర్తించారు. మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి ఈ బాంబును తీసుకెళుతున్నట్లు భావిస్తున్నారు. అతడికి ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. అతడు సయ్యద్ యాసిన్, మునీర్ అహ్మద్ అనే వ్యక్తులను కూడా ఐసిస్‌లో చేర్పించినట్టు సమాచారం.

## అనంతసాగర్‌లో నిలువెత్తు కాంస్య విగ్రహం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 15, మనం న్యూస్: అష్టావధాని, ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు సాహిత్యవేత్త అష్టకాల నర్సింహరామ శర్మ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని అనంతసాగర్ విద్యాక్షేత్రం వద్ద ఏర్పాటు చేస్తామని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన అనంతసాగర్ సరస్వతి ఆలయ వ్యవస్థాపకులు నర్సింహరామ శర్మ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అవధానానికి, ఆధ్యాత్మిక సాహిత్య రంగాలకు ఆయన మృతి తీరని లోటని, భావి తరానికి అష్టకాల జీవిత చరిత్ర మార్గదర్శకం కావాలని, సరస్వతి పుత్రునిగా పండిత, సాహితీవేత్తగా పేరుగాంచిన ఆయన గుర్తుగా సిద్దిపేటలో ఏదైనా భవనానికి పేరు పెడుతామన్నారు. ముఖ్యమంత్రికి, తనకు అత్యంత ఆత్మీయుడని, తమ మధ్య ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. అవధాన శిరోమణిగా పేరుప్రఖ్యాతలు సంపాదించిన శర్మ అవధానం ప్రపంచ తెలుగు మహాసభలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు. 500లకు పైగా యజ్ఞయాగాలు నిర్వహించి అమ్మఒడి మహత్యాన్ని సమాజానికి చాటిచెప్పిన ఘనత ఆయనదన్నారు. ఎన్నో ఆలయాలను ప్రతిష్టించారని, సలహాలు, సూచనలు, ఎన్నో ధర్మ సందేహాలను నివృత్తి చేశారని కొనియాడారు. సామాజిక, ఆధ్యాత్మికసేవకు మారుపేరుగా నిలిచిన శర్మ సేవలు కొనసాగిస్తామన్నారు. వైదికాన్ని ఆపోసన పట్టి వేలాది మంది శిష్యులను తయారు చేసిన గొప్ప అవధాని అన్నారు. మంత్రి వెంట బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

తుది గడువును తొలుత ఫిబ్రవరి 15న సాయంత్రం 5 గంటలుగా ప్రకటించారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు టీఎంహెచ్ఎస్ఆర్బీ ఈ గడువును ఫిబ్రవరి 21 వరకు పొడిగించింది. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎటువంటి మార్పులు చేర్పులు చేసుకోవడానికి అవకాశాల్లేవని టీఎంహెచ్ఎస్ఆర్బీ వెల్లడించింది. రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పరీక్షలో అన్నీ బహుళ ఐచ్ఛిక (మల్టీపుల్ ఛాయిస్) ప్రశ్నలే ఉంటాయి. ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే ఒప్పంద, పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న అభ్యర్థులకు వెయిటేజీ ఇవ్వనున్నారు. వీరికి వేతనం స్కేలు రూ.36,750-1,06,990గా పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లు అన్నీ కూడా వర్తిస్తాయి. స్థానిక అభ్యర్థులకు 95% రిజర్వేషన్ ఉంటుంది.

## సరకు రవాణాలో దక్షిణమధ్య రైల్వే రికార్డు ప్రశంసించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: సరకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. సరకు రవాణాలో సరికొత్త రికార్డును సాధించిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే చేసిన ట్వీట్‌పై ఆయన స్పందించారు. ఈ రికార్డు సాధించడం మంచి పరిణామమని కొనియాడారు. ఆర్థికాభివృద్ధికి ఇది శుభసూచకమని పేర్కొన్నారు. ''సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే మరో రికార్డును సొంతం చేసుకుంది. ఈనెల 10 నాటికి రూ.11,000 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ ఘనత సాధించింది'' అని దక్షిణ మధ్య రైల్వే ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేస్తూ ఇది శుభపరిణామమని ప్రశంసించారు.

# ఏసీ గదుల్లో కూర్చొని ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): కార్యకర్తల మనోభావాలు దెబ్బతీస్తూ, పార్టీకి నష్టం కలిగించే విధంగా ఎవరూ మాట్లాడొద్దని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సూచించారు. 9 ఏళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న భారత్ రాష్ట్ర సమితితో ఎట్టిపరిస్థితుల్లో పొత్తు పెట్టుకునేది లేదని రేవంత్ తేల్చి చెప్పారు. కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉన్నప్పుడు పొత్తులపై చర్చ అనవసరమన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా జనగామ జిల్లాలో పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.
''అనేక దుర్మార్గాలు, అక్రమాలు చేసి అనేక మంది కార్యకర్తలను జైళ్లకు పంపించారు. కొన్ని గ్రామాల్లో హత్యలు చేశారు ఈ బీఆర్ఎస్ నేతలు. అలాంటి పార్టీతో కలవాలనే ఆలోచన రావడం కూడా నేరమే అవుతుంది. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది.. అధికారంలోకి రావడానికి అన్నీ అవకాశాలున్నాయి. అలాంటప్పుడు పొత్తులపై చర్చ ఎందుకు? సర్వేలపై నాకు ఎలాంటి సమాచారం లేదు. నేను ప్రజాక్షేత్రంలో ఉన్నాను. ప్రజల సమస్యలు తెలుసుకునే పనిలోనే నిమగ్నమైయ్యాను. కొంత మంది నాయకులు వారి విలాసవంతమైన, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఏసీ గదుల్లో కూర్చొని ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దు.
అభ్యర్థులు ఎవరు? ముందస్తు ఎన్నికలు వస్తాయా? లేదా? అనే విషయాలు ఎవరికీ తెలియదు. ఒక అస్పష్టమైన వాతావరణం రాష్ట్రంలో ఉన్నప్పుడు.. ఏ సర్వే ఏజెన్సీ కూడా స్పష్టంగా ఏమీ చెప్పలేదు. అలా ఎవరైనా చెబితే అది కేవలం వారి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే అవుతుంది. ఇలాంటి చర్చలతో మాకు ఎలాంటి ప్రయోజనం లేదు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఓట్ల శాతం 33 శాతానికి పడిపోగా.. కాంగ్రెస్ 28 నుంచి 30 శాతానికి పెరిగింది. బీజేపీది 7 నుంచి 11 శాతంగా ఉంది. ఓట్ల శాతం.. ప్రజలు ఎవరివైపు ఉన్నారు అనే అంశాలపై కొన్ని అంచనాలు వచ్చాయే తప్ప.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. పార్టీ అధిష్ఠానం అన్ని అంశాలను గమనిస్తుంది. ప్రతి విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది'' అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**దయాకర్ ఏబీసీడీలు రాస్తే.. నేను రాజీనామా చేస్తా**

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తాజాగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఓనమాలు, ఏబీసీడీలు కూడా రాయని ఎర్రబెల్లి మంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ఎర్రబెల్లి ఓనమాలు, ఏబీసీడీలు రాస్తే.. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, ఈ పాలకుర్తి గడ్డ మీద సవాల్ చేస్తున్నానని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉండి, బీఆర్ఎస్‌తో కోవర్ట్ అయ్యి.. ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. తెలంగాణ గడ్డ మీద టీడీపీ లేకుండా చేశాడని విమర్శించారు. ఎర్రబెల్లి పచ్చిమోసగాడని, రాజకీయ భిక్ష పెట్టిన టీడీపీని కోవర్ట్ ఆపరేషన్ చేసి నాశనం చేశాడన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని, ఎర్రబెల్లి భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. పాలకుర్తికి గొప్ప చరిత్ర ఉందన్న రేవంత్ రెడ్డి.. ఈ గడ్డ భాగవతం రాసిన పోతనది, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మది, దొడ్డి కొమురయ్యలది అని పేర్కొన్నారు. పాలకుర్తిలో రాజీవ్ విగ్రహాన్ని తీయాలని కుట్ర జరుగుతుంది, రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని మాటిచ్చారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు ఇస్తామని, రూ.500 వందలకే సిలిండర్ ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని హామీలిచ్చారు.

రూ.5 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ కూడా చెల్లిస్తామని, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షలకు పెంచుతామని అన్నారు. పాలకుర్తిలో కాంగ్రెస్ గెలవాలని, ఈ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. తెలంగాణ తెచ్చిన వాళ్లకు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, మరి ఇచ్చినవారికి ఓ అవకాశం ఇవ్వాలని ప్రజల్ని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ను 100 సీట్లతో గెలిపించాలన్నారు.

## సంత్ సేవాలాల్ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకరం

**- జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్**



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అయ్యప్ప కొండపై ఉన్న సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వద్ద నిర్వహించిన సంత్ సేవాలాల్ 284 జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు.ఈసందర్భంగాజిల్లా కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సంత్ సేవాలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబాడా గిరిజన మహిళలు లంబాడా నృత్యంతో అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, ఉద్యోగుల కార్యదర్శి చంద్రనా యక్,ఉప కార్యనిర్వాహకసమాచారఇంజనీర్ ఇస్రనాయక్, తదితరులు హాజరయ్యారు.

## మన ఊరు మనబడి మనలను పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ మను చౌదరి**



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: మన ఊరు-మన బడి కార్యక్రమం కింద మొదటి విడతలో భాగంగా జిల్లాలో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని, మోడల్ స్కూల్ పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపడుతున్న పనులపై సాయంత్రం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో చేపడుతున్న మన ఊరు-మన బడి పనులు పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేయాలని, చేపట్టిన పనుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 40 మోడల్ స్కూళ్ల కు గానూ 6 పాఠశాలల పనులు పూర్తి కాగా మిగతా పనులు వెంటనే పూర్తి చేయాల న్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం మోడల్ స్కూల్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనులపై ప్రత్యేక చర్యలు చేపడుతూ రానున్న 15 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. అవసరమైన సిమెంట్ను సమకూర్చు కోవాలని, పాఠశాలల పెయింట్కు సంబంధించిన వివరాలు రికార్డు చేయాలని పేర్కొన్నారు. మన ఊరు-మన బడి కింద చేపడుతున్న టెండర్, ఇతర పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని అన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు గాను 10 కొట్ల 40 లక్షల రూపాయలకు బిల్లులు ఆన్లైన్లో సబ్మిట్ చేయగా 9 కోట్ల 55 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. రానున్న ఒకటి రెండు రోజుల్లో మిగిలిన ఒక కోటి రూపాయలను విడుదల చేస్తామని తెలిపారు. పనులను వెంటనే పూర్తి చేసి బిల్లులను సబ్మిట్ చేసిన వారికి నిధులు విడుదల అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ఈ డబ్ల్యూ డి సి డిఈ ప్రతాప్, ఆర్ అండ్ బి డిఈ కల్వకుర్తి నాగలక్ష్మి, ఆర్ అండ్ బి డిఈ అచ్చంపేట జలంధర్, సెక్టోరల్ అధికారి వెంకటయ్య, మండల విద్యాధికారులు మండల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి భవిష్యత్తుకు పదవ తరగతి మార్కులే నాంది

**- జిల్లా కలెక్టర్ కే. శశాంక**



తొర్రూరు, ఫిబ్రవరి 15 (మనం న్యూస్) : అధ్యాపక వేత్తల్లో ఒకరైన తత్వ గురువు, మహర్షి, గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ వందేమాతరం ఫౌండేషన్ తొర్రూర్ వారి ఆధ్వర్యంలో ఎస్ ఎస్ సి టాలెంట్ టెస్ట్ 2023కు గాను వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలలో టాలెంట్ టెస్ట్ ను నిర్వహించగా సుమారుగా 1270 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని అత్యంత ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధించిన 350 విద్యార్థిని విద్యార్థులకు 50 రోజులపాటు ఉచిత భోజన వసతి, అకామినేషన్, నైపుణ్యత గల ఉపాధ్యాయుల బోధన తోపాటు రివిజన్ టెస్టులు, మెయిన్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందన్నని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ కే శశాంక మాట్లాడుతూ విద్యార్థికి విజయం వరించిందంటే పరంపరంగా ముందుకు తీసుకెళుతుందని, పదవ తరగతి భవిష్యత్తుకు పునాది లాంటిదని, శిబిరం మనకు అద్దం లాగా చూపిస్తుందని, వాటిని అధిగమిస్తూ ఈ శిబిరం ద్వారా సక్సెస్ అవటమే ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ అన్నారు.ఈ దేశానికి గొప్ప పౌరులను అందించాలన్న సంకల్పంతో పనిచేస్తున వందేమాతరం ఫౌండేషన్ వారిని అభినందిస్తున్నానని, మీరు అనుకున్న విధంగా బలమైన కోరికలను నెరవేర్చుకునే దిశగా లక్ష్యాన్ని చేరుకొనుటకు విశిష్ట కృషి చేయాలని, పది సంవత్సరాల కష్టం జీవితాన్ని నిర్దేశిస్తుందని, ఓరియంటేషన్ ఎగ్జామ్ పద్ధతిలో సాధన చేయాలని ప్రణాళిక బద్దంగా ఉపాధ్యాయుల సూచన మేరకు ఎలా చదవాలనేది గ్రహించాలని వత్తిళ్లకు గురికాకూడదని, తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఒకరికి ఉపాధి కల్పించే విధంగా భవిష్యత్తులో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ అన్నారు.అనంతరం విద్యార్థులకు పెన్నులను అందజేస్తూ 10/10 ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఎల్ రమేష్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటేనే కేసీఆర్

**- నామాను మళ్ళీ గెలిపించుకోవాలి**
**- నామ సేవలు సమాజానికి మరింతగా కావాలి**
**- ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి**
**- ఎంపీ నామ క్యాంప్ కార్యాలయంలో 62 మందికి రూ.24.42 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కూరాకుల, నల్లమల**



ఖమ్మం, ఫిబ్రవరి 15 (మనం బ్యూరో) : రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ను మళ్ళీ మూడోసారి సీఎంగా గెలిపించుకోవడం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలను అద్భుతంగా అమలు చేసుకోగలుగుతామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం, కొత్తగూడెం, మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా,కామేపల్లి తదితర మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.24.42 లక్షల విలువైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఆయా మండలాల నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూరాకుల, నల్లమల మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం దేశంలోనే ఆదర్శవంతమై నదన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి వారం ఎంపీ నామ క్యాంప్ కార్యాలయంలో పేదలకు పెద్ద ఎత్తున చెక్కులు పంపిణీ చేయడం అభినంద నీయమన్నారు. నామ లాంటి నాయకుడు మనందరికీ కావాలని, రానున్న ఎన్నికల్లో మళ్ళీ నామను గెలిపించుకోవడం ద్వారా మరింత అభివృద్ధిని సాధించగలుగుతామని చెప్పారు. నామ నాయకత్వంలో పేదలకు నిత్యం ఏదో రూపంలో లబ్ధి చేకూరుతూనే ఉందన్నారు. నిత్యం పేదల గురించి ఆలోచించే నామ లాంటి నాయకులు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. కేసీఆర్ మళ్ళీ మూడోసారి సీఎం అయితేనే మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ రాకముందు ఖమ్మం ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉందో ప్రతి ఒక్కరం ఆలోచించాలి... ఇంత అభివృద్ధి జరిగిందంటే దానికి కారణం అభివృద్ధికారకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పేదలు గురించి నిత్యం ఆలోచించే నామాను రానున్న ఎన్నికల్లో మళ్ళీ గెలిపించి, పట్టం కట్టి ఆశీర్వదించి, అండగా నిలవాలన్నారు. ఇంతటి సంక్షేమ కార్యక్రమాలు గడిచిన కాలంలో ఎన్నడూ చూడలేదని, మళ్ళీ కేసీఆర్ ను, నామను గెలిపించుకుంటేనే రాష్ట్రం, జిల్లా మరింత పురోగతిని సాధిస్తుందన్నారు. నిత్యం, ప్రతి వారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పేదలకు పంపిణీ చేస్తున్నారని, ఇలా ప్రతి నెలా రెండు కోట్ల విలువైన చెక్కుల పంపిణీ జరుగుతుందని నల్లమల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం నగర మాజీ మేయర్ డాక్టర్ పాపాలాల్ , పార్టీ వైరా, తిరుమలాయపాలెం మండలాల అధ్యక్షులు బాణాలు వెంకటేశ్వర్లు, బాశబోయిన వీరన్న, ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, కొణిజర్ల సొసైటీ ఛైర్మన్ చెరుకుమల్లి రవి, ఎంపీ క్యాంప్ కార్యాలయం ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, పార్టీ నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్, ఎర్రుపాలెం సొసైటీ ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు మంకెన రమేశ్, రావినూతల సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, చింతకాని మండలం కోమట్లగూడెం మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి బాబురెడ్డి, పార్టీ నాగులవంచ గ్రామ శాఖ అధ్యక్షులు శిలివేరు సైదులు, పెద్దబీరవల్లి గ్రామ శాఖ కార్యదర్శి రెడ్డిబోయిన ఉద్దండు, రఘునాధపాలెం మండల నాయకులు ప్రొద్దుటూరు కోటిరెడ్డి, సోషల్ మీడియా మధిర నియోజకవర్గ ఇన్చార్జి తాళ్ళూరి హరీశ్, నామ సేవా సమితి నాయకులు రేగళ్ల కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా మొదలైన సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**- వరంగల్ తూర్పులో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు**
**- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ చేతుల మీదుగా వేడుకలు ప్రారంభం**
**- ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించిన మంత్రి,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ ఇతర ప్రజాప్రతినిధులు**







వరంగల్, ఫిబ్రవరి 15, మనం బ్యూరో : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్బంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అజంజాహి మిల్స్ గ్రౌండ్ లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలను మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలు, కేసీఆర్ ఉద్యమం నాటి నుండి నేటి వరకు జరిగిన పరిణామాలను ఫోటో ఎగ్జిబిషన్ రూపంలో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుతో పాటు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు వీక్షించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఉద్యమనేత ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించే వరకు కొట్లాడిన నేత, తెలంగాణను అన్ని రంగాల్లో అభివద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఇంత గొప్పగా నిర్వహించడం పట్ల నన్నపునేని నరేందర్ ను అభినందించారు. పోయిన ఏడాది కూడా నరేందర్ ఆహ్వానం మేరకు వేడుకలకు హాజరయ్యానని అన్నారు''ఈ తూర్పు నియోజకవర్గంలో నరేందర్ గెలుపు ఖాయమైందని, అన్ని సర్వేలు నరేందర్ వైపే ఉన్నాయని నరేందర్ గెలుపును ఎవ్వరు ఆపలేరన్నారు'' నన్నపునేని నరేందర్ కు తన ఆశీస్సులు ఎప్పటికి ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జిల్లా పరిషత్ చేర్మెన్ గండ్ర జ్యోతి, మేయర్ గుండు సుధారాణి ఇతర ముఖ్యనాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంత పెద్ద ఎత్తున వేడుకలు నిరవహించడం అలాగే ఉద్యమ నాటి నుండి నేటి వరకు కేసీఆర్ చరిత్ర చేసిన అభివద్ధి సంక్షేమ పథకాల ఎగ్జిబిషన్ అద్భుతంగా ఏర్పాటు చేసిన నరేందర్ ను అభినందించారు. ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణా దిశ, దశను సీఎం కేసీఆర్ మార్చారన్నారు. రాదనుకున్న తెలంగాణాను సాదించారని, తెలంగాణా జాతిని ఏకతాటిపైకి తీసుకువచ్చి తెలంగాణా సాదించారన్నారు. సాధించుకున్న తెలంగాణాలో అభివద్ధి ఫలాలను ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేస్తున్నారన్నారు ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివద్ధిలో తెలంగాణాను దేశంలోనే నంబర్ వన్ గా నిలిపారన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచామని 3700 కోట్లతో ఈ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నామన్నారు కేసీఆర్ లాంటి నాయకుడు దొరకడం తెలంగాణా అదష్టమన్నారు నేడు టిఆర్ఎస్ బిఆర్ఎస్ గా మారి కేసీఆర్ నాయకత్వంలో దేశాన్ని అభివద్ధి చేసేందుకు బాటలు వేద్దామన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఎల్లవేళలా మాకు అందుబాటులో ఉంటూ తగు సలహాలు సూచలు చేస్తున్నారని, గతంలో సైతం నా ఎదుగుదలకు, నా గెలుపుకు కషి చేస్తా అన్నందుకు ఎమ్మెల్యే కతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ మీద మాకున్న ప్రేమతో ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట చరిత్ర అందరికి తెలిసేలా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**- జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్**
**10/10 సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తో పాటు విహారయాత్రలకు అవకాశం కల్పిస్తాం**
**- 100 శాతం ఫలితాలపై దృష్టి సారించాలి**
**- పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితానికి ఓ మైలు రాయి**



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలంటే స్వయం ప్రణాళిక పాఠ్యాంశ పునశ్చరణతోపాటు పాటు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించడం తేలికని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుఖ జీవన్ రెడ్డి గార్డెన్‌లో జిల్లాలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల వసతి గృహాల 893 మంది పదో విద్యార్థులకు జిల్లా వెనుకబడిన తరగతుల, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో రానున్న పదవ తరగతి పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలనే అంశంపై ప్రేరణ తరగతులు, భవిష్యత్ మార్గదర్శక తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ హాజరై జ్యోతిబాపూలే అంబేద్కర్ ల చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రేరణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు కేవలం 41 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలంటే స్వీయ ప్రణాళికతోపాటు పాఠ్యాంశ పునశ్చరణ కీలకమని కలెక్టర్ సూచించారు. సమయం ఇంకా 41 రోజులు మాత్రమే ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పరీక్ష రాసి 'పదికి పది' గ్రేడ్ పాయింట్లు సాధించి, సత్తా చాటిన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ నుండి గోల్ మెడల్‌తో జిల్లా కలెక్టర్‌గా తాను కూడా విద్యార్థులకు ఏదో ఒక మంచి ప్రదేశానికి విహారయాత్రకు వెళిగడిపేలా అవకాశం కల్పిస్తానన్నారు. ఈ ఏడాది పది పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల గడిచిన ఐదు సంవత్సరాల ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా చూడాలన్నారు. వాటి ద్వారా పరీక్షల్లో విద్యార్థులు తేలికగా ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వార్డెన్‌లనుఆదేశించారు.వసతి గృహాల్లో 100% ఫలితాలు సాధించేలా చేయాలని ఆదేశించారు. హాస్టల్లో సబ్జెక్టు ట్యూటర్లను నియ మించుకోవాలని, అందుకు నిధుల కొరత ఏమీ లేదనన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఏ అసౌ కర్యం లేకుండా అన్ని వసతులు కల్పించాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా వచ్చి తన దృష్టికి తీసుకురావచ్చు అని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్య జీవితానికి అత్యంత కీలకమని మహనీయులు అంబేద్కర్, పూలే ఆశయాల కనుగుణంగా విద్యార్థులు ముందుగా తమ లక్ష్య సాధనకు మార్గదర్శకులైన మహనీయులను ఆద ర్శంగా తీసుకొని ముందుకు సాగడంతో పాటు అందుకు అనుగుణంగా శ్రమించాలన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే విద్యను ప్రతి విద్యార్థి సాధించాలని కోరారు. 10వ తరగతి ప్రతి విద్యార్థి జీవితానికి ఓ మైల్ స్టోన్ లాంటిదని కలెక్టర్ అన్నారు. కష్టపడితేనే అనుకున్న బంగారు భవిష్యత్ ముందుంటుందన్నారు. బీసీ మరియు ఎస్సీ వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో రాణించేలా కృషి చేయాలన్నారు. ప్రేరణ తరగ తులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో కోరారు. అనం తరంఎస్సీ, బీసీ వసతి గృహాలవిద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ లక్ష్మణ్ ప్రేరణ తరగతు లను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపారు.అన్నిసబ్జెక్టుల నిష్ణాతులైనఉపాధ్యా యులచే ఆయా సబ్జెక్టుల్లో ఉన్న విద్యా ర్థుల సందేహాలను నివృత్తి చేశారు.జిల్లావెనుకబడినతరగతుల సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా సాంఘీ క సంక్షేమ శాఖ అధికారి రామ్ లాల్, బిసి సహా య సంక్షేమ అధికారి శ్రీధర్ జి, ఎస్సీ సహాయ సంక్షేమ అధికారి కే సుదర్శన్, బీసీ, ఎస్సీ వసతి గృహాల వార్డెన్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

**- సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలన్న లక్ష్యంతో, పట్టుదలతో కృషి చేయాలి**
**- గ్రూప్ పోటీ పరీక్షల అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ జి .రవి నాయక్ పిలుపు**



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: గ్రూప్ పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు సమాజంలో ఒక ఉన్నత స్థానాన్ని సంపాదించాలన్న కసి, పట్టుదలతో చదివి దానిని సాధించాలని జిల్లా కలెక్టర్ జి .రవి నాయక్ అన్నారు. బుధవారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్ లో గ్రూప్ 2,3,4 అభ్యర్థుల కు ఉద్దేశించి ఏర్పాటుచేసిన 3 నెలల స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనార్టీ శాఖల ద్వారా పేద పేద అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భాగంగా మహబూబ్ నగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2015 నుండి ఇప్పటివరకు వివిధ రకాల ఉచిత కోచింగ్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కోచింగ్ కేంద్రాలకు పేద, మధ్య తరగతి విద్యార్థులు మాత్రమే వస్తారని, అయినప్పటికీ ప్రైవేటు కోచింగ్ సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ కోచింగ్ కేంద్రాలు ఎంతో నాణ్యతతో, మెరుగైన ఫ్యాకల్టీతో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఇటీవల కాలంలో అభివృద్ధి చెందిన సాంకేతిక విజ్ఞానాన్ని జోడించి అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా కోచింగ్ కేంద్రాలకు రావడం వల్ల అభ్యర్థులు ఏమి చదవాలో? ఏమి చదవకూడదో తెలుసుకుంటారని అన్నారు. అందుబాటులో ఉన్న మెటీరియల్‌ను సరిగా చదివితే సరిపోతుందని ,మనల్ని మనం అంచనా వేసుకొని ఎలాంటి జాబు సంపాదించేందుకు అవకాశాలున్నాయో దృష్టి సారించాలని అప్పుడే సక్సెస్ రేట్ ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. కోచింగ్ కేంద్రం వల్ల ఏది ముఖ్యమో ఏది కాదో కూడా తెలుస్తుందని, అందువల్ల వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు కష్టపడి చదివి మంచి స్థానాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకు గాను ఎక్కువగా ప్రాక్టీస్ టెస్టులు చేయించాలని, స్టడీ సర్కిల్ వారు కూడా వారానికి ఒకరోజు మోడల్ టెస్టులు నిర్వహించాలని అన్నారు.తరగతి లో బోధిస్తున్న అంశాలపై అభ్యర్థులు ఎక్కువగా దృష్టి సారించాలని ,వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## సైన్స్ పరిశోధనలే దేశాభివృద్ధికి కీలకం

**- దేశంలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు ఉత్తమ పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి**
**- తెలంగాణ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్.ఆర్. రాజేందర్‌సింగ్**



ఖమ్మం, ఫిబ్రవరి 15 (మనం బ్యూరో) : ఇరవై ఒకటో శతాబ్ధిలో సైన్స్,టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలే దేశాభివృద్ధికి కీలకమైన భూమికను పోషిస్తాయని తెలంగాణ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్.ఆర్. రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ సైన్సడే సెలబ్రేషన్స్ – 2023 పేరిట ''గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్ '' అనే థీమ్‌తో నేషనల్ కౌన్సిల్ ఫర్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనిషేక్ (ఐఎన్‌సీఎస్‌టీసీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి సహకారంతో '' ఇన్‌స్పిరేషనల్ సైన్స్ లెక్చర్ సిరీస్ – 2023'' లో భాగంగా తొలి రోజు ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమీషనరేట్ విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథనాన్ని పెంచేందుకు గత ఆరు సంవత్సరాల నుంచి జిజ్ఞాస విద్యార్థి కేంద్రక పరిశోధక ప్రాజెక్టుకు పోటీలను నిర్వహిస్తూ ప్రోత్సాహక బహుమతులను రాష్ట్ర స్థాయిలో అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు ఉత్తమ పరిశోధనల వైపు



విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని వెల్లడించారు. అనంతరం తొలిరోజు ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ లెక్చర్ ను హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డి ఇవ్వగా రెండవ లెక్చర్‌ను సర్ సి.సి.రే. స్మారక ప్రసంగాన్ని హైదరాబాద్ నైపర్, కెమిస్ట్రీ అసోసియేషన్ ప్రొఫెసర్ పి. శంకరయ్య ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ బి.వి.రెడ్డి, కె.ఎస్.ఎస్. రత్నప్రసాద్, కెమిస్ట్రీ శాఖాధిపతి డాక్టర్ పి. రమేష్, అధ్యాపకులు డాక్టర్ ఎం. సుబ్రమణ్యం, డాక్టర్ శాంతికుమార్, శ్రీనివాస్, మహేష్, బాలకృష్ణ, భద్రునాయక్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సత్యవతి, వివిధ విభాగాల అధ్యాపకులు, యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

### దాగాకోరు దయాకర్ రావుపై

# పోరు చేద్దాం.. పాలకుర్తి అసెంబ్లీని రక్షించుకుందాం

- బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు తోడుదొంగ పార్టీలు
- మంత్రి కమిషన్లతో ఆగిన ప్రాజెక్టు పనులు
- బందిపోట్ల రాక్షస సమితి (బీఆర్ఎస్) భ్రష్ట జూమ్లా పార్టీ (బిజేపి)
- బీజేపీ బీఆర్ఎస్ లపై కాంగ్రెస్ చార్జిషీట్
- జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి

జనగామ, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి : చెన్నూరు రిజర్వాయర్ ని పూర్తి చేసేందుకు కాంగ్రెస్ రూ 360 కోట్లు కేటాయిస్తే మంత్రి ఎర్రబెల్లి రూ 700 కోట్లకు పెంచి రూ 250 కోట్ల కమీషన్ కొట్టేసాడని, కమీషన్లు అడుగుతుండటంతో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడానికే జంకుతున్నారని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగా రాఘవ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల రాజయ్య, పొన్నం ప్రభాకర్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లకవత్ దన్‌వంతి లక్ష్మీనారాయణ నాయక్ లతో కలిసి విమర్శించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా దేవరప్పుల నుండి పలు గ్రామాల మీదుగా పాదయాత్ర నిర్వహించిన అనంతరం విన్నూరులో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జంగా రాఘవ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో సర్వే నెం.76 ని 56 గా మార్చి గిరిజనులు 50 ఎకరాల భూమి కాజేసాడని ఇలా ప్రతి మండలంలో 100 ఎకరాలు కూడబెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలకు నిధులివ్వాలని సర్పంచులు వేడుకోగా మందు బాటిళ్లు అమ్ముకోండని మంత్రి అహంకారం చూపిస్తుండని మంత్రి కమీషన్ల కారణంగా తొర్రూర్ మండలంలో తాగునీటి ప్రాజెక్టుల పనులు అగిపోయి ప్రజలు తాగునీటి కోసం కటకటలాడుతున్నారని అన్నారు. అర్హులకు కాకుండా 30 శాతం కమీషన్ తో తన అనుచరులకే దళిత బంధు ఇచ్చిన దుర్మార్గపు చర్యని, పాలకుర్తి మండలంలో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తనని మోసం చేసి డిగ్రీ కళాశాల కట్టించకుండా దగా చేస్తున్నాడని దుయ్యపట్టారు. రాయపర్తి మండలంలోని మంత్రి అతని తమ్ముడి కోళ్ల ఫామ్ కారణంగా చెరువులు కలుషితమై మత్స్యకారులు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని మంత్రి దౌర్జన్యాలను ప్రశ్నిస్తే పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని అధికారమధంతో ప్రజలను భయభ్రాంతులకు గురి



చేస్తున్నాడని అన్నారు. 2018 లో డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన చేసి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని, మంచుప్పులలో దళితులకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లు అధ్వానంగా ఉన్నాయని కొడకండ్ల మండలంలో టెక్స్టైల్ పార్క్ ఇప్పిస్తానని చెప్పి నిండా ముంచాడని పార్కు నిర్మిస్తనని సంఘం సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని అన్నారు. దందాల దయాకర్రైపై పోరు చేద్దాం, పాలకుర్తి అసెంబ్లీని పరిరక్షించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరిసిల్ల రాజయ్య పొన్నం ప్రభాకర్ మల్లు రవి డాక్టర్ రాజమౌళి, డాక్టర్ లక్ష్మీనారాయణ, ముహూర్తాల ప్రభాకర్ ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమకారిని బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



వరంగల్ (ములుగు రోడ్), ఫిబ్రవరి 15, మనం న్యూస్: హనుమకొండ అరేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్ లతో కలిసి పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు గ్రామీణ ప్రజలకు ఈ హస్పత్రి దగ్గరగా ఉండటంతో ఎంతో దోహదపడుతుందని, వైద్యం కోసం పట్టణాలకు వెళ్ళే గ్రామీణ ప్రజలు ఈ హాస్పిటల్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, భారాస నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాచకులకు అన్నదానం

స్టేషన్ ఘన్పూర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : ఘనపూర్ మండల కేంద్రములో తెలంగాణ తొలి టిపిసిసి అధ్యక్షులు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొలిపాక సతీష్ అధ్వర్యంలో యాచకులకు అన్నదానంతో పాటు మంచినీళ్ల బాటిల్ పంచడం జరిగింది ముఖ్యంగా ఘనపూర్ నియోజక వర్గంలో, రాష్ట్రంలో రిజర్వాయర్ కట్టిన ఘనత పొన్నాల లక్ష్మయ్య కి దక్కుతుందని ప్రజలకు తాగు సాగు నీరు రాష్ట్రంలో ఐటీ కంపెనీలు రావడంలో ప్రతేక కషి చేశారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లేష్, కోల శ్రీనివాస్ గౌడ్, కోరుకొప్పుల మధు, భూక్యా అరుణ్, నక్క పాపయ్య, రాజేష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి



నర్మెట్ట, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : నర్మెట్ట మండల కేంద్రం చౌరస్తాలో బుధవారం బిజెపి మండల శాఖ అధ్యక్షుడు ధారావత్ ఆధ్వ ర్యంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకోటి, పార్లమెంట్ కన్వీనర్ శీను, మండల శాఖ కార్యదర్శి వినోద్, మండల కార్యదర్శి పిన్నింటి శ్రీని వాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, నరేష్, కిషోర్, భీమ్లా నాయక్, సేవాలాల్ సద్గురు మహారాజ్ అభిమానులు పాల్గొన్నారు.

## రామస్వామి మృతి తీరని లోటు



రాయపర్తి, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : రాయపర్తి మండలం కొండూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుండె రామస్వామి దశ-దిన కార్యక్రమంలో జనగామ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి (కెఎస్ఆర్) బుదవారం పాల్గొని వారి చిత్రపటానికి నివాళులు అర్పించినారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి మనిషిని కొండూరు గ్రామం కోల్పోయింది అన్నారు ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని ఆయన ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య, బిజెపి సీనియర్ నాయకులు రంగు రాము, బొచ్చు సురేష్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియాలి



బచ్చన్నపేట, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి తెలుపాలని జనగామ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప అన్నారు. బుధవారం బచన్నపేట మండలం చిన్న రామచర్ల గ్రామంలో శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ లో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు బేజాడి బీరప్ప. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, బూత్ అధ్యక్షులు మంత్రి కరుణాకర్, పాతూరి కరుణాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఈర్ల నవీన్ కుమార్, జనగామ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు అఫ్జల్, బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శి గద్ద రాజు, మండల ఉప అధ్యక్షుడు పోతుల వెంకటేష్, గుడికందుల యాదగిరి, జలెందర్, రమేష్, ఉమేష్, మహిపాల్ ఇతర నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది.

## ప్రారంభమయిన రెండవ విడత దేహదారుఢ్య పరీక్షలు



వరంగల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : పోలీస్ కానిస్టేబుల్ సబ్ ఇన్స్పెక్టర్ల నియామకంలో భాగంగా బుధవారం నుండి పురుష అభ్యర్థులకు రెండవ విడత దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయినాయి. మొదటి రోజు పోలీస్ నియామక మండలి నిర్ధేశించిన అభ్యర్థులు బుధవారం ఉదయం ఐదు గంటలకే కాకతీయ విశ్వవిద్యాలయము మైదానంలో నిర్వహిస్తున్న దేహదారఢ్య పరీక్షలకు హాజరయినారు. అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన, బెయోమెట్రిక్ అనంతరం అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు నిర్వహించారు. ఈ పరుగులో అర్హత సాధించిన అభ్యర్థులకు మాత్రమే ఎత్తు, లాంగ్ జంప్, షాట్ పుట్ పరీక్షలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన పరీక్షల్లో 601 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా ఇందులో 447 అభ్యర్థులు హాజర్ కాగా ఇందులో 115 మంది అభ్యర్థులు తుది వ్రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ దేహ దారుఢ్య పరీక్షలను పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించడంతో పాటు, అభ్యర్థులకు కల్పించిన మంచినీటి సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ పరీక్షల్లో క్రైమ్స్ డీసీపీ మురళీధర్, అదనపు డిసిపి లు సంజీవ్, సురేష్ కుమార్ తో పాటు ఏసిపి లు, ఆర్ఐ లు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, ఎస్ఐ లు, పరిపాలన విభాగం, కమ్యూనికేషన్, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా బండా ప్రకాష్ ముదిరాజ్‌కి ఘన సన్మానం



స్టేషన్ ఘన్పూర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ కు భారీఎత్తున స్వాగతం పలికి ఘన సన్మానం చేసిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ జనగాం జిల్లా అధ్యక్షులు నీల గట్టయ్య ముదిరాజ్, స్టేషన్ ఘనపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నీల గట్టయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభా లో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ లను గుర్తించి బడుగు బలహీనర్గాల ఆశాజ్యోతి, ముదిరాజ్ ముద్దు బిడ్డ, ముది రాజ్ జాతి రత్నం అయిన డా బండా ప్రకాష్ ముదిరాజ్ ను శాసన మండలి వైస్ చైర్మన్ గా ఎన్నిక చేసి మా ముదిరాజ్ లను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెరియజేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ నీల రాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి చిక్కుడు రాములు ముదిరాజ, పాలకుర్తి ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు మాచర్ల ఎల్లయ్య, రాష్ట్ర యువజన నాయకులు గోరంట్ల యాదగిరి ముదిరాజ్, ఘనపూర్ ముదిరాజ్ సంఘ నాయకులు గౌనెల ఉపేందర్, పెసరు సారయ్య, మునిగేల వెంకటేశ్వర్లు, నీల రాజు, ముదిరాజ్ ముద్దు బిడ్డలు తదితరులు భారీఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా పొన్నాల జన్మదిన వేడుకలు



బచ్చన్నపేట, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : మాజీ టిపిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య పుట్టినరోజు వేడుకలు మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధ వారం బచ్చన్నపేట మండల్ అధ్యక్షులు వంచ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్య క్షేత్రం కొడువటూర్ సిద్ధేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చన చేసినట్లు తెలిపారు. అనం తరం కొడువటూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లం శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ కాంగ్రె స్ అధ్యక్షుడు నిమ్మ కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దండగుల లక్ష్మయ్య, అధ్యక్షతన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంచ వెంకట్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ స్టేట్ నిడిగొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అల్వల ఎల్లయ్య, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివద్ది చేసిన ఘనత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఎల్లపుడు సంపూర్ణ ఆయురా రోగ్యాలతో ఉండాలని కాంక్షించారు. ఈ కార్య క్రమంలో మండల కోశాధికారి దేవరకొండ రమేష్ నియోజకవర్గ కిసాన్ కాంగ్రెస్ కో ఆర్డి నేటర్ జంగిటి నరేశ్ మండల కార్యదర్శిలు అరు కల శ్రీనివాస్, బోధసు స్వామి, అవధూత శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, అబ్బసని కుమార్, మండల మహిళ అధ్యక్షురాలు బొమ్మెర్ల వేణు వందన, బోనకొల్లూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు, చిక్కుడు కష్ణ, తమ్మడపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సానిక నల్ల మహేందర్, జిల్లా నాయకులు లింగాల శ్యామ్ సుందర్ రెడ్డి, రాజు, రాజేష్ కన్నా, అంజి గౌడ్, శివారెడ్డి, మల్లం అజయ్ కుమార్, నీల మల్లేష్, బొమ్మెన రాజయ్య, కూరకుల రవి, తదితరులున్నారు.

## బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్





- ఎమ్మెల్యే ఆరూరి రమేష్
- గిరిజనులతో కలిసి సాంప్రదాయ నత్యం చేసిన ఎమ్మెల్యే అరూరి

పర్వతగిరి, ఫిబ్రవరి 15, మనం న్యూస్: బంజారా సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి జీవితాన్ని త్యాగం చేసి దేశం కోసం, ధర్మం పట్ల అంకితభావంతో విశిష్ట సేవలందించి చిరస్మరణీయులుగా శ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచిపోయారని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని జేఆర్ఆర్ గార్డెన్స్ లో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ అజ్మీరా కోమి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ఉత్సవాలలో ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని భోగ్ బండరో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో సమైక్య పాలనలో బంజార తండాలను కోయగూడాన్ని ఏ ప్రభుత్వము ఏ పాలకులు ఏ మేరకు పట్టించుకున్నారో, ఏమి ఆలోచన చేశారో ఒక్కసారి నెమరు వేసుకోవాల్సిన అవసరం బంజార బిడ్డలకు ఉందన్నారు. 75 సంవత్సరాల భారత స్వాతంత్ర్యంలో ఆదివాసులు గిరిజనులు దళితులు బీసీలు అణగారిన వర్గాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు, ప్రత్యేకంగా ఆర్థికంగా బంజారా బిడ్డలను ఎదిగించాలని గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను ఇంగ్లీష్ మీడియంలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లలో బంజారా బిడ్డలకు తక్కువ రిజర్వేషన్ వుందని తెలంగాణ ప్రభుత్వం మొదటి అసెంబ్లీ లోనే తీర్మానం చేసి రిజర్వేషన్ పెంపు కోసం కేంద్రానికి పంపిస్తే కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని గిరిజన యువకులు ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యమంత్రి సహకారంతో గిరిజన తండాల్లో మన మండల ముద్దుబిడ్డ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో ప్రతి తండాలో అంతర్గత రోడ్లు వేసినారు అని గర్వంగా తెలియజేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివద్ధికి, సంస్కతి, సాంప్రదాయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు అధికారికంగా తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలో ఇంకెక్కడా జరపడం లేదంటే ఇది మన రాష్ట్ర గొప్పతనమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 కోట్ల రూపాయలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా గిరిజనుల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా సేవాలాల్ బంజారా భవనాన్ని సీఎం కేసీఆర్ నిర్మించారాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లునవత్ కమల పంతులు, జడ్పిటిసి భానోత్ సింగ్ లాల్, జడ్పి కోఆప్షన్ మహమ్మద్ సర్వర్, స్థానిక సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్ రావు, కల్లెడ పిఎసిఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఎంపిపిలు, జడ్పిటీసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంజారా కుల పెద్దలు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా

## వాహనపన్నులు సకాలంలో చెల్లించాలి

- తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవు
- జిల్లా రవాణా శాఖ అధికారి పి.వేణు



భూపాల్ పల్లి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని వాహనదారులు ఆయా వాహనాలకు సంబంధించిన పన్నులు సకాలంలో చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి పెరంబు దూర్ వేణు తెలిపారు. బకాయి పన్నులు చెల్లించకుండా తప్పించుకు తిరిగే వాహన దారులు తనిఖీల్లో పట్టుబడితే శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు జిల్లాలలో గ్రామపంచాయతీ వాహనాలు, దళిత బంధు పథకం ద్వారా పొందిన వాహనాలతో పాటు సుమారు 3000పైగా చిన్న నుండి పెద్ద తరహా సరకు రవాణా వాహనాలకు సంబందించి రూ.4కోట్లు పన్నుల బకాయిలు ఉన్నాయని, తక్షణమే ఆయా వాహనాలకు సంబంధించి యజమానులు బకాయిలు చెల్లించాలని తెలిపారు. లేని పక్షంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుబడిన వాహనాలపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటూ 100%కు 200% జరిమానా వేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## బీఆర్ఎస్ కుటుంబసభ్యులకు 'బీమా' భరోసా

- పార్టీకోసం కష్టపడి ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకొంటా
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



వరంగల్, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి : రాష్ట్రంలో బిఆర్ఎస్ కార్యకర్తలు కుటుంబాలకు పార్టీ భరోసాగా నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన భారాస నాయకులు నల్ల బిక్షపతి ఇటీవల ప్రమాదవశాత్తు మతి చెందగా పార్టీ సమూహ ప్రమాద బీమా నుంచి మంజూరైన రూ 2 లక్షల చెక్కును ఎమ్మెల్యే హనుమకొండలోని వారి నివాసంలో బిక్షపతి కుటుంబ సబ్యులకు అందించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడి కుటుంబానికి నేనున్నా నంటూ సీఎం కేసీఆర్ భరోసాగా నిలిచి వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు దీనివల్ల కార్యకర్తల కుటుంబాలకు ఎంతో కొంత పార్టీ ద్వారా ఆర్థికసాయం అందుతుందన్నారు. అదేవిధంగా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తుంద న్నారు. ప్రతి పథకాన్నీ రాష్ట్రంలో ప్రజల ముంగిటకు తీసుకెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని అన్నారు. అలాగే పార్టీకోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్య క్రమంలో మండల ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారులకు జరిమానా

- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి 3 రోజుల జైలు శిక్ష



మట్టెవాడ, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ అయిదుగురు వాహన దారులకు కోర్టులో గుర్రపు వీరస్వామి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వరంగల్ 12,200/- రూపాయలు జారిమాన విధించినారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జన్ను వినోద్, జాటోతు రాహుల్ లకు 03 రోజులు జైలు శిక్ష విధించి, మహబూబాబాద్ సబ్ జైల్ కు పంపగా మరో 07 మందికి 10,600/- రూపాయలు జారిమాన విధించారని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ జి బాబులాల్ తెలిపారు.

## బంజారా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు





నర్మెట్ట, ఫిబ్రవరి 15, మనం న్యూస్ : నర్మెట్ట మండలం మల్కాపేట గ్రామంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతిని బంజారా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తేజవత్ గోవర్ధన్, జెడ్పిటిసి మాలోతు శ్రీనివాస్, సర్పంచ్, బంజారా నాయకులు, సేవాలాల్ సద్గురు మహారాజ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### ఆటో నగర్ వద్ద నూతనంగా నిర్మించే

# బస్ టెర్మినల్ నిర్మాణానికి వన్యప్రాణి మండలి ఆమోదం: ఎమ్మెల్యే

ఎల్బీనగర్ ఫిబ్రవరి 15(మనం న్యూస్) ఈ రోజు రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి .ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో అరణ్య భవన్ నందు వన్యప్రాణి మండలి(వైల్ లైఫ్ బోర్డు) సమావేశం నిర్వహించారు.ఆటో నగర్ వద్ద బస్ టెర్మినల్ నిర్మాణానికి వైల్ లైఫ్ బోర్డు ఆమోదం తెలిపింది అని సుధీర్ రెడ్డి తెలిపారు.హరిణ వనస్థలికి చెందిన 1,354 హెక్టార్ల ఆటవిభూమి మళ్లింపులకు అనుమతించారు అని తెలిపారు.జాతీయ రహదారిపై విపరీతంగా పెరిగిన రద్దీ,ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ బస్ టెర్మినల్ నిర్మాణం కానున్నది అని తెలిపారు.దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఇట్టి బస్ టెర్మినల్ నిర్మాణ ప్రక్రియ మొదలు కావాల్సింది.కానీ కాంగ్రెస్,బీజేపీ వారు అత్యంత అధునాతనమైన ఇట్టి బస్ టెర్మినల్ రాకుండా అడ్డుకోవడం జరిగింది.అయితే సుధీర్ రెడ్డి పట్టు వదలని విక్రమార్కుడిలా దాదాపు102 సార్లు అరణ్య భవన్ నందు అటవీశాఖ అధికారులచే రెండు సంవత్సరాలుగా పలు సమావేశాలు ఏర్పాటు చేశారు.చివరకు విజయం సాధించారు.అభివృద్ధిని కొన్ని రోజులు మాత్రమే అడ్డుకోగలరు కానీ శాశ్వతంగా కాదని తెలిపారు.ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలోనే తొలి ఏసీ శాటిలైట్ బస్ టెర్మినల్ నిర్మాణం ఎల్బీనగర్ లోని ఆటోనగర్ ప్రాంతంలో రూపుదిద్దుకోనుంది.దానిలో భాగంగా దాదాపు18 కోట్ల రూపాయల వ్యయంతో 24 బస్ బేల నిర్మాణం చేపట్టడడం జరుగుతుంది అని తెలిపారు.కొన్ని రోజుల్లోనే దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆధునిక హంగులతో నిర్మించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతాయని తెలిపారు.ఎల్బీనగర్ మార్గం మీదుగా ఏపీలో గుంటూరు,విజయవాడతో పాటు తెలంగాణలోని ఖమ్మం,భద్రాచలం,నల్లగొండ,సూర్యాపేటకు నిత్యం సుమారు 20 వేల నుంచి 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు.వీరికి మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో సుమారు 680 మీటర్ల వరకు అధునాతన బస్ బేలను నిర్మించడం జరుగుతుంది అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు.రోజువారీగా ఆర్టీసీ,ప్రైవేటు బస్సులు 500-600 వరకు వెళ్తుంటాయి.రద్దీకనుగుణంగా బస్సు స్టాండ్లు లేకపోవడంతో చింతలకుంట నందు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.ట్రాఫిక్ సమస్య సైతం వేధిస్తోంది.దీంతో ఇక్కడి బస్సు స్టాండ్లను తొలగించి ఆటోనగర్ సమీపంలోని క్రీడా వద్ద ఏర్పాటు చేయనున్నారు.ఇందులో 60% విద్యుత్ ను సోలార్ ప్లాంట్ ద్వారా సేకరించడం జరుగుతుంది.అలాగే మూత్రశాలల నందు వాడిన నీరును ట్రీట్మెంట్ చేసి అట్టి నీరు ఫ్లెష్ ట్యాంక్ లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.బస్ బే నిర్మాణంతో ఇక్కడి నుంచి ఒకేసారి వంద బస్సులు ఇలా వచ్చి అలా వెళ్తాయి.దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనున్నాయి.దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఒక మార్గం,సిటీ ప్రయాణికులకు మరో మార్గం



ఉంటుంది.ఏసీ,నాన్ఏసీ నిరీక్షణ గదులు ఉంటాయి.నిరంతర విద్యుత్ కోసం 490 కిలోవాట్స్ సౌరవిద్యుత్ ప్లాంట్,నిరంతరం వైఫై సౌకర్యం,నీటిశుద్ధి కేంద్రం,పార్కింగ్ వసతులు,ఏటీఎం కేంద్రాలు,ఫుడ్ కోర్టులు,బుక్ షాపు,ఆరోగ్య కేంద్రం,తమవారు క్షేమంగా బస్ ఎక్కరో లేదో అని బెంగలేకుండా తాపీగా ఫోన్లో చూసుకునే సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాకేశ్ మోహన్ దొబ్రియల్(ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి) సభ్యులు కోవ లక్ష్మీ,రాఘవ, బానోతు రవికుమార్, అనిల్ కుమార్, అధికారులు పర్గెయిన్, ప్రశాంతి, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

● **ఆదర్శప్రాయుడు సంత్ సేవాలాల్- ఎమ్మెల్యే పట్నం**

కోడంగల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: సంత్ సేవాలాల్ జయంతిని కొడంగల్ నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా కోడంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలలో కోడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా యువతులు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే బంజారా సాంప్రదాయ పూజలు చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని అన్నారు. గిరిజనులకు దశ-దిశను చూపి,హైందవ ధర్మం గొప్పతనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రకారులు చెబుతారని పేర్కొన్నారు.బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని వెల్లడించారు. దీంతో శ్రీ సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుకోవాలని, గిరిజనుల అభివృద్ధికి, సంస్కృతి, సాంప్రదాయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు అధికారికంగా తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలో ఇంకెక్కడా జరపడం లేదంటే ఇది మన రాష్ట్ర గొప్పతనమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 కోట్ల రూపాయలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా గిరిజనుల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా సేవాలాల్ బంజారా భవనాన్ని సీఎం కేసీఆర్ నిర్మించారని గుర్తుచేశారు.తెలంగాణలో అన్ని కులాలు, మతాలు, సమానంగా గౌరవిస్తూ సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతున్నారని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే



దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంజారా కుల పెద్దలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నావంద్గీ సొసైటీలో శనిగల కొనుగోల్ తూకంలో రైతులను మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్




బషీరాబాద్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: బషీరాబాద్ మండల కేంద్రంలో నావంద్గి సొసైటీలో శనిగలు కొనుగోలు కేంద్రంలో తూకంలో అవకతవకలు జరిగాయని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది ఇట్టి విషయంపై బషీరాబాద్ ఎస్సై విద్యా చరణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం 13వ తారీఖున శనిగలు కొనుగోలు తూకంలో హమాలీలు అవకతవకలు చేశారని ఇద్దరు, రవీందర్, దీపక్ కుమారులను, అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగింది కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్ కు తరలించడం అయినది ఇట్టి కేసులో తదుపరి విచారణ జరిపి ఇందులో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులపై చెట్టరీత్యా చర్యలు తీసుకోబడును రైతులను ప్రజలను మోసం చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోబడునని ఎస్సై తెలిపారు.

## శభాష్, కంగ్రాట్యులేషన్స్.. శ్రీనివాస్‌ను అభినందించిన ఎమ్మెల్యే



బషీరాబాద్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: బషీరాబాద్ మండలంలో మారుమూల ప్రాంతంలో మట్టిలో మాణిక్యం ఏక్మాయి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గోవాలో జరిగిన టీ-10 జాతీయ క్రికెట్ టోర్నమెంట్లో ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచిన శ్రీను నీ సోమవారం రోజు హైదరాబాదులో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసం నందు శభాష్ కంగ్రాట్యులేషన్స్ శీను అని అభినందించడం జరిగింది ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ త్వరలో నేపాల్ లో అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్ కు ఎంపికైనందుకు సంతోషిస్తున్నాం మరియు ఆ టోర్నమెంట్లో మంచిగా రాణించాలని అలాగే రాబోయే రోజుల్లో దేశావళీ క్రికెట్ లో ఆడాలని మన రాష్ట్రం పేరు మన మండల పేరు నిలబెట్టాలని మనస్ఫూర్తిగా అభినందించాడు

## ప్రిన్సిపల్ నరేష్ రాజ్‌కు డాక్టరేట్ అవార్డు



కోడంగల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: డివి. నరేష్ రాజ్ ప్రిన్సిపాల్ ఆఫ్ నవీన్ ఆదర్శ హైస్కూల్ కొడంగల్ వాసికి ప్రపంచ మానవుల హక్కుల కమిషన్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ యునైటెడ్ నేషన్ ఆఫ్ అమెరికా ద్వారా జాతీయ మెంబర్ గా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే గవర్నమెంట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికా, న్యూయార్క్ స్టేట్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ద్వారా డాక్టరేట్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు పొందినట్లు ఆయన తెలిపారు. డాక్టరేట్ ఇన్ ఎడ్యు కేషన్ అవార్డు దుబాయిలో 22 డిసెంబర్ 2022లో,ఆన్లైన్ ద్వారా ఎంపిక జరిగిందని, బుధవారం రోజు కొరియర్ ద్వారా మొమెంటో, డాక్టరేట్ సరి ్టిఫికెట్, తనకు అందినట్లు డివి నరేష్ రాజు తెలిపారు. అలాగే నవీన ఆదర్శ ప్లే హై స్కూల్ ఫౌండర్ వెంకటయ్య వైస్ ప్రిన్సిపాల్ సంతోష ఉపా ధ్యాయులు విద్యార్థులు డాక్టర్ డివి నరేష్ రాజ్ గారిని అభినందించారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



● **ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి**

తాండూర్ టౌన్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను తాండూరులో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆల్ ఇండియా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి భూకైలాస్ వ్యవస్థాపకులు వాసు పవర్ నాయక్ మరియు పెద్దేముల్ జడ్పిటిసి దారాసింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విట్టల్ నాయక్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోమ్ సమీపంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా తాండూర్ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ తాండాలను పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తున్నారని, అంతేకాకుండా ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాలకు ఎంతో తోడ్పాటునందిస్తున్నారని కావున గిరిజనులు సేవాలాల్ మహారాజ్ ఆశయాలను అనుగుణంగా ముందుకు సాగాలని, తెలంగాణ రాష్ట్ర సిద్ధించాక ఇంత పెద్ద ఎత్తున సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జరుపుకొనుచున్నారని ఆయన కొనియాడారు. అలాగే అంతారం సమీపంలో కోటి రూపాయలతో బంజారా భవన్ నిర్మించడం జరిగిందని అంతేకాకుండా గిరిజనులను అన్ని రంగాల్లో ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే సేవాలాల్ మహారాజ్ దీవెనలు అందరిపై ఉండాలని రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విట్టల్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నయీమ్ అప్పు, పెద్దేముల్ జడ్పిటిసి దారా సింగ్, భూకైలాస్ వ్యవస్థాపకులు వాసు పవర్, శ్రీనివాస్ చారి, గిరిజన సంఘ నాయకులు తదితరులు కలిసి సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు

● **ప్రత్యేక పూజలు నిర్వహించిన గిరిజనులు నేతలు**

తాండూర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: గిరిజనుల ఆరోగ్యంగా కొలిచే శ్రీ సంత్ సేవాలాల్ 284వ జయంతి ఉత్సవాలను తాండూరు నియోజకవర్గానికి చెందిన అనేకమంది గిరిజనులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ ఉత్సవాలకు తాండూర్ నియోజకవర్గంలోని గిరిజన నేతలు యువకులు పట్టణంలోని శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ వద్ద గల సంత్ సేవాలాల్ విగ్రహం వద్దకు భారీ ఎత్తున తరలివచ్చారు. గిరిజనుల కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన అనేక త్యాగాలను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టి పి సి సి ప్రధాన కార్యదర్శి దారాసింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విట్టల్ నాయక్, భూకైలాస్ జ్యోతిర్లింగాల దేవస్థానం వ్యవస్థాపకులు వాసు పవర్ నాయక్,పట్నం పట్నం రినీష్ రెడ్డిలు సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలు వేసి నివళులర్పించారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ బంజారా సమాజాం అభివృద్ధికి ,చైతన్యానికి ఎనలేని కృషి చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు మనందరి మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని గుర్తు చేశారు. అదేవిదంగా బంజారా కుటుంబ సభ్యులు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మరికొందరు యువకులు జెండాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మణపురం రాము, తాండూర్ జడ్పీటిసి గౌడి మంజుల వెంకటేషం,



నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, హరిశ్వర్ రెడ్డి, మాజీ యూత్ ప్రెసిడెంట్ తాండ్ర రాకేష్, శ్రీకాంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కోట్ల రాజ్ కుమార్ రెడ్డి, సాయి ప్రసాద్, ఇర్ఫాన్, రహెల్ మీర్జా, సల్మాన్, అజీజ్, రమేష్, భాను పవర్, మాడి విక్రమ్ రెడ్డి, మోహన్, సురేష్, కిరణ్, సాయి తేజ, భారీ ఎత్తున బంజారా మహిళలు, యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సగం సగం పనుల సాగదీతపై కలెక్టర్ ఆగ్రహం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): సమీకృత మార్కెట్లు నిర్మాణం సగం పనులు కాదు నూరు శాతం పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి మినీ సమావేశపు హాలులో పట్టణ ప్రగతి కార్యక్రమాలపై మున్సిపల్ ఛైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య ఇంజనీరింగ్ అధికారులు, డిఈలు, ఏఈలు,శానిటరీ ఇన్స్ పెక్టర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడు తూ పనులు ఎందుకుజరగడం లేదని, భయం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి ఎందుకు తాత్సారం చేస్తున్నారని పబ్లిక్ హెల్త్ డిఈ శ్రీనివాస్ ను ప్రశ్నించారు. కాంట్రాక్టరుతో ఏం సమస్య ఉంది. ఎందుకు పనులు జరగడం లేదు, ఆసక్తి ఎందుకు తగ్గిందని, ఎందుకు చలనం లేకుండా పోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాం ట్రా క్టర్లుతో పనులు చేపించుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కమిష నర్లదని, ఎందుకు చేపించుకోలేకపోతున్నారని, ఎన్ని రోజులు పనులు సాగదీస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల నుండి పనులు జరగడం లేదని కారణాలు చెప్పొద్దని పనులు జరగాలని చెప్పారు. సమస్యలుంటే తన దృష్టికి తెచ్చి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. సమీకృత మార్కెట్లునిర్మాణం ఇచ్చిన షెడ్యూలు ప్రకారం పూర్తి చేయాలని చెప్పారు. మున్సిపాల్టీలలో సమీకృత మార్కెట్లు నిర్మాణం అత్యంత ప్రధానమని చెప్పారు. వైకుంఠధామాలకు రహదారి, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలుండాలని చెప్పారు.వైకుంఠధామాలు నిర్వహణను నిరంతర పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మార్చి 5వ తేదీ నాటికి ఇల్లందు మున్సిపాల్టీలోఎఫ్ఎపి (ఫ్రీకల్ స్లెడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంటు)లో గ్రీనరీ, మిషనరీ ఏర్పాటు కావాలని చెప్పారు. మణుగూరు, కొత్త గూడెంలలోఎఫ్ఎస్ఎపి పనులు ప్రారంభించాలని చెప్పారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మున్సిపాల్టీలలో చేపట్టినపనులను



త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని చెప్పారు. కొత్తగూడెం, ఇల్లందులలో బస్తీదవాఖాన పనులనుపూర్తి చేసి ఈ నెలాఖరు వరకు ప్రారంభించాలని చెప్పారు. కొత్త గూడెంలో 15, ఇల్లందులో 10, మణుగూరులో 10, పాల్వంచలో 5 తెలం గాణకు క్రీడా ప్రాంగణాలుఏర్పాటు చేయాల్సి ఉందని, రానున్న 15 రోజుల్లో పూర్తి చేయాలని, గుర్తించినవి కూడా ఎందుకు పూర్తి చేయ లేకపోతున్నారని ప్రశ్నించారు. స్పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆదాయం సమకూరాలని, నిర్వహణకు ఏజన్సీలను ఎంపిక చేసేందుకుటెండర్ ప్రక్రియ నిర్వహించాలని కొత్తగూడెం మున్సిపల్ డిఈకి సూచించారు. ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ప్రక్రియనుసమీక్షించిన కలెక్టర్ నూరుశాతం జరగాలని, తక్కువ జరుగుతున్న వార్డుల్లో డస్ట్ బిన్లు పంపిణీ చేయాలని చెప్పారు.వ్యర్థాలు విక్రయాలు ద్వారా కొత్తగూడెం మున్సిపాల్టీ 2.80 లక్షలు, పాల్వంచ 3.32 లక్షలు, మణుగూరు 93 వేలు,ఇల్లందు 1.63 లక్షలు ఆదాయం సమకూరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ సీతాలక్ష్మి, పాల్వంచ ప్రత్యేక అధికారి డాక్టర్ పురందర్,పాల్వంచ, ఇల్లందు మున్సిపల్ కమిషనర్లు శ్రీకాంత్, అంకుష్వలి, పబ్లిక్వాల్త్ డిఈ శ్రీనివాస్, కొత్తగూడెం తహసీలార్ రామక్రిష్ణ, మున్సిపల్ డిఈలు, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

**మేడ్చల్ | రంగారెడ్డి వికారాబాద్**

## ఆర్కే పురంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర



ఎల్బీనగర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): ఏఐసీసీ పిలుపు మేరకు టిపిసిసి అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కే పురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర లో బాగంగా మొదటి రోజు పాదయాత్ర నిర్వహించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అల్కాపురి కాలనీ చౌరస్తా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కి పూలమాలతో నివాళులర్పించి హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర ప్రారంభించి గడప గడపకు తిరిగి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు తెలియజేశామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ మున్సిపల్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి , రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి,దేపసురేఖ, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత,, బండి మధుసూదన్ రావు, ధనరాజ్ గౌడ్ ,మున్సిపల్ కార్పొరేషన్ , డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ జానకి రెడ్డి



ఎల్బీనగర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): రాచకొండ కమిషనరేట్ పరిధిలో సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ కు నూతన ఇన్స్పెక్టర్ గా ఎస్ జానకి రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న జానకి రెడ్డి బదిలీపై సరూర్నగర్ వచ్చారు . సరూర్నగర్ సిఐ గా ఉన్న సీతారాం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ బదిలీ పై వెళ్ళారు.

## బీజేపీ జిహెచ్ఎంసి అధికార ప్రతినిధిగా ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): జిహెచ్ఎంసి బిజెపి అధికార ప్రతినిధిగా సరూర్నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవానీ అంజన్ నియామకము అయ్యారు. ఈ మేరకు బుధవారము పార్టీ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్బంగా ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ నాపై నమ్మకంతో బిజెపి జిహెచ్ఎంసి అధికార ప్రతినిధిగా నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ,రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ , పార్టీ సీనియర్ నాయకులకు, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తానన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలి

● **అధ్యక్షుడు పెండ్యాల నగేష్**



ఎల్బీనగర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడాలని ఆర్కే పురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ నల్గొండ గ్రేటర్ ఆధ్వర్యంలో ఈ- వేస్ట్ కార్యక్రమం చిత్రా లేఔట్ కాలనీ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెండ్యాల నగేష్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే కోట్లాది మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపడుతుందన్నారు. భావితరాల వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు ఇవ్వకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిద్దామని అన్నారు.కాలనీ వాసులు తమ పాత లాప్టాప్స్, ఫోన్ లు, కంప్యూటర్ లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అందచేశారు. వీటిని రీసైక్లింగ్ యూనిట్ కి పంపించి పర్యావరణ హిత వస్తువుల తయారికి ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ తీగల మోహన్ రావు, క్లబ్ అధ్యక్షులు చేరుపల్లి నర్సింహ,దుబ్బాక వెంకట్ రెడ్డి, సాగర్ రెడ్డి,రవీందర్ రావు,సుధాకర్ రెడ్డి, అంజల్ రావు,నాగార్జున రెడ్డి,చక్రా రెడ్డి, ఆనంద్,భాస్కర్ రెడ్డి, సురేష్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళుర్పించిన ఎమ్మెల్యే పట్నం



కోడంగల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: దౌల్తాబాద్ మండల కో ఆప్షన్ నెంబర్ జాకీర్ వారి అన్నయ్య మరణించిన వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి జాకీర్ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించినారు. అనంతరం జాకీర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్యపడవద్దనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోట్ల మైపాల్, కొడంగల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్, కొడంగల్ మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం గౌసన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ
## సూర్యాపేట-యాదాద్రి

## ధర్మభిక్షం స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శం

వలిగొండ, ఫిబ్రవరి 15(మనం న్యూస్): మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ 101వ జయంతి కార్యక్రమాన్ని కేజీకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్బంగా మండలంలోని వివిధ గ్రామాల గౌడసంఘం సభ్యులు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్యగౌడ్ మాట్లాడుతూ ధర్మబిక్షం కల్లుగీత కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి గీతా కార్మికుల హక్కులకై పోరాటం నిర్వహించాడని అన్నారు. వారి స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పల్సం స్వామిగౌడ్, మండల కమిటీ అధ్యక్షులు పబ్బతి మల్లేషం, బందారపు ధనుంజయగౌడ్, మద్దెల మారయ్యగౌడ్, తొలుపునూరి శంకరయ్యగౌడ్, మారగోని సత్తయ్యగౌడ్, నెలపట్ల యాదయ్య, సుదగాని మత్స్యగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్(ఎం), ఫిబ్రవరి 15(మనం న్యూస్): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నిరుపేద శివమల్లయ్య కుటుంబానికి బిజెపి రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన శివ మల్లయ్య అనే నిరుపేద వారంరోజుల క్రితం చనిపోవడంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి చూసి చలించిన ఆయన వారి కుటుంబానికి 5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గసభ్యులు, శక్తి కేంద్రం ఇంచార్జీ గజరాజు కాశీనాధ్, బూత్ అధ్యక్షులు మజ్జిగ నరేష్, మత్స్యగిరి ప్రశాంత్, బండారు సత్యనారాయణ, టౌన్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, బబ్బూరి లింగం, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులకు వస్త్రాల అందజేత

భువనగిరి, ఫిబ్రవరి 15(మనం న్యూస్): భువనగిరి పట్టణంలోని ఆర్కే హాస్పిటల్ మరియు చావా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్కే హాస్పిటల్ అధినేత డా.రాజ్‌కుమార్ కుమారుడు చావా తారక్ నంద మూడవ పుట్టినరోజు సంధర్భంగా యాదగిరిగుట్టలో గల వేద పాఠశాలలో 60మంది వేద పాఠశాల విద్యార్థులకు ధోతిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత డా.రాజ్‌కుమార్, వారి సతీమణి డా.చావా అశ్లేష, కుమార్తె చావ ఆకృతి, మరియు తారక్ నంద, హాస్పిటల్ సిబ్బంది తదితరులు ఉన్నారు. విద్యార్థులకు వస్త్రదానం అనంతరం పుట్టినరోజు సంధర్బంగా స్వీట్లు పంచిపెట్టారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ బీమా అందజేసిన ఎమ్మెల్యే

వలిగొండ, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): మండల కేంద్రానికి చెందిన గొలుసుల సమ్మయ్య కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మూసీవాగులో పడి మరణించాడు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ భీమా ద్వారా సమ్మయ్య భార్య గొలుసుల అంజమ్మకు రెండు లక్షలరూపాయల చెక్కును భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బుధవారం హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఐటిపాముల రవీందర్, పట్టణ అధ్యక్షులు ఎమ్మె లింగస్వామి, మాజీ సర్పంచ్ గుండు శేఖర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు గొలుసుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మబిక్షం ఆశయ సాధనకై సంఘటితంగా పోరాటం చేద్దాం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ 101వ జయంతి సంధర్బంగా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్బంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ హేమేందర్‌గౌడ్ మాట్లాడుతూ ధర్మబిక్షం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషిచేశారని, వారి అడుగుజాడల్లో ప్రతిఒక్కరు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కీసరి బాల్‌రాజ్‌గౌడ్, మండల కమిటీ నాయకులు గుండ్లపల్లి లింగంగౌడ్, ఆరె లక్ష్మయ్యగౌడ్, గడ్డం చంద్రగౌడ్, గుండ్లపల్లి శ్రీరామ్‌గౌడ్, మల్లేశం, శాగంటి శ్రీరాములు గౌడ్, బబ్బూరి వెంకటేశంగౌడ్, గడ్డమీది రాజులుగౌడ్, గౌడసంఘం డైరెక్టర్ పచ్చిమట్ల నరేష్‌గౌడ్, బుడిగె సత్తయ్యగౌడ్, బాలయ్యగౌడ్, సత్యంగౌడ్, శ్రీకాంత్, ప్రసాద్, జిల్లా, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శించిన మహిళా కళాశాల హిస్టరీ విద్యార్థులు



నాగార్జునసాగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): నాగార్జునసాగర్‌లోని బుద్దవనాన్ని బుధవారం హైద్రాబాద్‌కు చెందిన రాజ్‌బహదూర్ వెంకట్‌రామరెడ్డి మహిళా కళాశాల హిస్టరీ విభాగానికి చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్ డాక్టర్ హేమ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సందర్శించారు. బుద్దవనం చేరుకున్న వీరికి బుద్దవనం డిజైన్ ఇంచార్జీ శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. వీరు బుద్దుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ద చరితవనం, జాతకవనం, స్థూపవనం, ధ్యానవనం సంధర్శించిన తర్వాత మహాస్థూపంలోని సమావేశ మందిరంలో కొద్దిచేపు ధ్యానం చేశారు. కమిటీ సభ్యులు శ్యాంసుందర్‌రావు, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్దవనం విశేషాలను వివరించారు. ఈ సంధర్బంగా హేమ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంత అద్భుతంగా బుద్దవనంను అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన తెలంగాణ టూరిజాన్ని, బుద్దవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్యకు అభినందనలు తెలిపారు. అనంతరం వీరు నాగార్జునకొండ మ్యూజియంను సందర్శించారు. వీరితో పాటు కళాశాల ఫ్యాకల్టీ అనూష తదితరుల ఉన్నారు.

# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

**- బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి**

**- ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు**




బీబీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే ప్రజా గోస, బీజేపీ భరోసా శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో బుధవారం నిర్వహించారు. గూడూరు శక్తి కేంద్ర ఇంచార్జీ బోయపల్లి గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం, దళిత బంధు పథకాలు అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని, అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానన్న ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. రైతు బంధు పథకం పేరుతో రైతులకు వచ్చే సబ్సిడీ పథకాలను తీసేసి ప్రజలను మోసం చేస్తుందని, అరకొర ఉద్యోగ నోటిఫికషన్లు వేస్తూ నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని, రాష్ట్రంలో బస్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యులను నిరుపేదలుగా మారుస్తూ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందేమీ లేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల తెలంగాణగా మార్చి ప్రజలను మోసం చేస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కాంట్రాక్టర్లకు కేసిఆర్ న్యాయం చేశాడే తప్ప ప్రజలకు న్యాయం జరగలేదని గుర్తు చేశారు. ఇక భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. బస్వాపూర్ ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలంటే ఇప్పటినుండే ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి జంగారెడ్డి, భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ముష్కె సత్యనారాయణ రెడ్డి, నక్కిర్తి మురళి, బండిరాల అశోక్, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, గడ్డం జంగారెడ్డి, తరుణ్ రెడ్డి, ధర్మ బస్వారెడ్డి, ముష్కె సుధాకర్ రెడ్డి, యాదిరెడ్డి, మట్ట గణేష్, నరురి బిక్షపతి, బాబు, బోయపల్లి దర్మేందర్ రెడ్డి, యాదిరెడ్డి, బాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, మల్లేష్, యాదమ్మ, వెంకటమ్మ, రాజమణి, వెంకటమ్మ, అండాలు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

**- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ రమణాచారి**



నల్లగొండ, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని పానగల్ లో ఛాయా, పచ్చల సోమేశ్వరాలయం దేవాలయాల వద్ద పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మహాశివరాత్రి పండగ ఉన్నందున మున్సిపల్ సిబ్బందితో కలిసి అక్కడ చేపట్టిన పనులను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పానగల్ సెంటర్ నుండి ఛాయా, పచ్చల సోమేశ్వరాలయం వరకు వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, వాటితోపాటు పానగల్ కట్టపైన వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విధిగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.పానగల్ సెంటర్ నుండి దేవాలయాల వరకు ఉన్న నాలుగు పార్కింగ్ ప్రాంతాలను శుభ్రం చేస్తూ అక్కడ కూడా వీధిలైట్లలో ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని బస్ టాయిలెట్ తో పాటు అదనంగా మరో రెండు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోనేరు, దేవాలయాల లోపల కార్పెట్లు, టెంట్లు, త్రాగునీరు ఏర్పాటు చేయాలని 50 మంది సిబ్బందితో ఎప్పటికప్పుడు దేవాలయాల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. బారికేట్ల ఏర్పాటు విఐపి ల పార్కింగ్ సంబంధిత విషయాలపై దేవాలయ చైర్మన్ జి అనంతరెడ్డి తో చర్చించారు. ఈ కార్యక్రమంలో డి ఈ లు వెంకన్న, నరసింహారెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, ఏసీపీ నాగిరెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్లు మూర్తుజా, శంకర్, హరితహారం, సానిటరీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి నాభిశిల ప్రతిష్టాపనకు విరాళం

ఆత్మకూర్(ఎం), ఫిబ్రవరి 15(మనం న్యూస్) : ఆత్మకూర్(ఎం) మండలంలోని గ్రామ బొడ్రాయి పునఃప్రతిష్టాపన కార్యక్రమానికి ఆత్మకూరు పట్టణ వైశ్య సంఘం వారు రూ.26,016 బుధవారం విరాళంగా ఆ సంఘం అధ్యక్షుడు మురారిశెట్టి మల్లేశం, మండల వైశ్య సంఘం అధ్యక్షులు పోలిశెట్టి నర్సయ్యలు గ్రామ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీటీసీ కాయ కవిత ఇంద్రారెడ్డి, ఉపసర్పంచ్ దొంతరబోయిన నవ్య భాస్కర్‌ల చేతులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వైశ్య సంఘం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బీసు చందర్‌గౌడ్, యాస లక్ష్మారెడ్డి, అఖిలపక్ష నాయకులు కోరె వెంకన్న, లోడి వెంకటయ్య, రాచమల్ల సత్తయ్య, పోతగాని మల్లేషం, నేతాజీ యువజనసంఘం అధ్యక్షులు ప్రతికంఠం శంతన్‌రాజు, సంఘం సభ్యులు దారం ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, తడక హరినాధం, గందె సత్యనారాయణ, దాచ రమేష్, మేడిశెట్టి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయింపు



బీబీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): డబుల్ బెడ్ రూమ్ పథకంలో భాగంగా మండల కేంద్రంలో నిర్మించిన 11 ఇండ్లకు ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు తహసీల్దార్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో బుధవారం కేటాయించారు. ఇందులో ఎస్సీ కోటాలో నలుగురికి కేటాయించగా దండు బురాన్, ముక్కెర్ల అంజమ్మ, మూల యాదిలక్ష్మి, కావలి అరుణకు అవకాశం దక్కగా ఎస్టీ కోటాలో ఇద్దరు కుంభం పోచమ్మ, అంగడి ఎల్లమ్మ, మైనార్టీ కోటా ఒక్కరిలో సలీమా సుల్తానా, జనరల్ కోటా నలుగురిలో కూయ రాజెందర్, కొకసి శోభ, పలుసం అరుణ, సుచి స్మితాకర్ ల పేర్లు ఖరారయ్యాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గోళి ప్రణీతాపింగల్ రెడ్డి, సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, టంటం భార్గవ్, ఉపసర్పంచ్ దస్తగిరి, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.రోడ్డుపై బైఠాయించిన మహిళలు..డబుల్ బెడ్ రూమ్ లు 11 ఉండగా 157 మంది ధరఖాస్తు చేసుకున్నారు. దీంతో ధరఖాస్తు చేసుకున్న తమకు దక్కలేదన్న ఆవేదనతో మనస్తాపానికి గురైన మహిళలు అర్హులైన పేదవారందరికీ ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు.



## అంగన్‌వాడీ సెంటర్ ప్రారంభించిన ఎంపీపీ అనుముల పాండమ్మా

త్రిపురారం, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): త్రిపురారం మండలం ఇందిరమ్మ కాలనీ 2 అంగన్వాడీ సెంటర్ ఓపెన్ చేస్తున్న ఎంపీపీ అనుముల పాండమ్మా మేడం, జడ్పీటీసీ భారతి మేడం, ఎంపీపీ గౌరవ సలహాదారులు శ్రీనివాస్ రెడ్డి సార్, త్రిపురారం హెడ్ క్వార్టర్ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి సార్, అంగన్వాడీ సూపర్ వైసర్ ఫరీదా మేడం, అంగన్వాడీ టీచర్స్ మహిళలు పాల్గొన్నారు.

## కళ్యాణం.. కమనీయం

బీబీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): మండలంలోని పడమటి సోమారం గ్రామంలోని శ్రీ లింగబస్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామి వారికి తన సొంత ఖర్చులతో చేయించిన రూ. 3 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వామి, అమ్మవారి విగ్రహాలకు తన చేతుల మీదుగా అలంకరించారు. ఈ సందర్బంగా ఆలయ చైర్మన్ వాకిటి బస్వారెడ్డి, స్థానిక సర్పంచ్ తలబోయిన గణేష్ యాదవ్ లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన పల్లకి సేవలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి పల్లకిని మోస్తు ఆలయ ప్రాంగణంలో కలియతిరిగారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భూపాల్ రెడ్డి, ఆలయ ఈవో నరెందర్ రెడ్డి, ధర్మకర్తలు, తదితర నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్

మాడుగులపల్లి, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని గోపాలపురం గ్రామంలో స్థానిక సర్పంచ్ మణెమ్మయాదయ్య, ఎంపీపీ సలహాదారుడు పోకల రాజు, ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు శిబిరాలన్నీ ప్రతి ఒక్కరు వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయం చేసుకొని కంటి వెలుగు శిబిరానికి వచ్చే ప్రజలకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి అందులు కంటి అద్దాలు అందజేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారుడు పోకల రాజు, ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి, డాక్టర్ రజిత, సూపర్వైజర్ సోమయ్య, ఎంఎల్ హెచ్పి జోసఫ్, ఏఎన్ ఏమ్స్ నాగలక్ష్మి,రోజా,ఆశ వర్కర్లు మల్లేశ్వరి, సైదమ్మ, మంజుల,మంగమ్మ, మహేశ్వరి,లక్ష్మి, గోవిందమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

నల్లగొండ, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియం లో పోలీస్ కానిస్టేబుల్/యస్.ఐ దేహదారుఢ్య పరీక్షలను జిల్లా యస్.పి కె. అపూర్వ రావు ఆద్వర్యంలో ప్రత్యేక అధికారి డాక్టర్ పి. శబరీష్ పర్యవేక్షణలో బుధవారం సాంకేతిక పరిజ్ఞానం తో పారదర్శకంగా అభ్యర్థులకు దేహదారిడ్య పరిక్షలు నిర్వహించారు. 600 మంది అభ్యర్థులకు 468 అభ్యర్థులు హాజరు అయినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 106 మంది అభ్యర్థులు (ఫిజికల్ టెస్టు) దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారని అన్నారు.132 మంది అభ్యర్థులు గైరాజరైనారని అన్నారు. గ్రౌండ్లో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తూ, అత్యవసర సమయంలో అంబులెన్స్,మెడికల్ బృందం, మున్సిపాలిటీ మొబైల్ టాయిలెట్ వెహికిల్ ను, అభ్యర్థులకు మంచినీటి తదితర సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

## విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ లతారాజేష్ బాబు

బీబీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): పదవ తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని బుధవారం కొండమడుగు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కడెం లతారాజేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా పరీక్షలకు సిద్దమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజ మల్లేష్, ఉపాధ్యాయులు చందా రమేష్, శ్రీధర్, బాలరాజు, ప్రణీత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి

● జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్



గోదావరిఖని, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): గతంలో డ్రా ద్వారా ఎంపికైన లబ్దిదారులకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా బుధవారం రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 33,34వ డివిజన్ అధ్యక్షులు ఎర్ర మధు, దొంతుల లింగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డిజిల్ గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి, వాటిపై అదనంగా జీఎస్టీ విధిస్తూ, చిన్న, మధ్య తరగతి వ్యాపారుల బతుకులు చిన్నా భిన్నం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను కేవలం 5వందల రూపాయలకే అందించడంతో పాటు, సొంత జాగా ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5లక్షల రూపాయలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో డ్రా ద్వారా ఎంపికైన లబ్దిదారులకే మొదటగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాకే, అర్హులైన మిగతా లబ్దిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రులలోని పరికరాలను ప్రభుత్వం నుండే నేరుగా కొనుగోలు చేయాలే తప్ప మద్యవర్తుల ద్వారా చేయకూడదని, ఇక్కడి శాసనసభ్యుడి అండదండలతోనే ఈవ్యవహారమంతా జరుగుతుందని, ఇప్పటికైనా ఇలాంటి అవినీతి పనులు మానుకొని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు హితవు పలికారు. కాంగ్రెస్‌పార్టీ అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. కావున మీరందరూ రానున్న రోజుల్లో కాంగ్రెస్‌పార్టీనీ ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు.

## ప్రమాదాలు జరిగినా స్పందించరా...?

● రోడ్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

వీణవంక, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): మండలంలోని వల్బాపూర్ గ్రామం నుండి మామిడాలపల్లి గ్రామం వరకు కరీంనగర్‌కు వెళ్లే ప్రధానరహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు లేనందున రోడ్డు మూల మలుపుల వద్ద అనేకసార్లు ప్రమాదాలు జరుగడమేకాక పలువురు మత్యువాతపడిన ఘటనలు ఉన్నాయి. అలాగే రెడ్డిపల్లినుండికల్లుపల్లి వరకు హెచ్చరికబోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు లేక చాలా సార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలెన్నోన్నాయి. కనపర్తి గ్రామం నుండి వీణవంకకు వచ్చే ప్రధాన రహదారిపై అనేక మూలమలుపుల ఉన్నా కూడా ఒక్క హెచ్చరిక బోర్డు లేకపోవడం విడ్డూరంగా ఉంది. అలాగే ఘన్ముక్ల గ్రామం నుండి గంగారం వరకు రహదారిప్రక్కన ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోకుండా వేగంతో వెళ్తున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా రహదారులు భవనాలశాఖ అధికారులు నిద్రమత్తును వీడి ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే రోడ్ల పక్కన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## డెక్కన్ సిమెంట్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



పాలకీడు, ఫిబ్రవరి 15, మనం న్యూస్: మండల పరిధిలోని భవానిపురం గ్రామంలో డెక్కన్ సిమెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం బాలాజీ హాస్పిటల్ మిర్యాలగూడ వారి చే నిర్వహించిన ఉచిత వైద్యశిభిరంకు విశేష స్పందన లభించింది. సిమెంట్ పరిశ్రమ పరిధిలోని రావిపహడ్, మహంకాళిగూడెం, కల్మెట్‌తండా, జాన్‌పహడ్, శూన్యపహడ్, కొత్తతండాల నుండి సుమారు 350మంది ఈ శిభిరంలో వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. డెక్కన్ సిమెంట్ పరిశ్రమ ద్వారా ఆయా గ్రామాల నుండి ప్రజలను ఉచితంగా శిభిరంకు తీసుకొచ్చారు. ఈ శిభిరాన్ని సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాస్‌రాజు ప్రారంభించి మాట్లాడుతూ.... ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా డెక్కన్ సిమెంట్స్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం నాగమల్లేశ్వర్‌రావు, సూర్యనారాయణ, ఎండీ. మస్తాన్, పీఎస్‌రావు, జగన్, నర్సింహరెడ్డి, రమణ, ప్రవీన్, సీవిఎల్ శ్రీరాజ్, రమేష్, డా. సునీత, శ్రీనివాస్, శేషిధర్‌రెడ్డి, గోపినాథ్, సంతోష్, అక్షిత, రోహితప్రకాష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వధువుకు పెళ్లి కానుక అందజేసిన సర్పంచ్



వీణవంక, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో పత్రి అనిత సారయ్య ల కుమార్తె మౌనిక వివాహ వేడుకలకు గ్రామ సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్‌రెడ్డి హాజరై వధువుకు పెళ్లి కానుకగా ఐదువేల పదహార్లు రూపాయలను అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

● సేవాలాల్ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా చంద్రమౌళి




హుజూర్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: 22న జరిగే గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ 284వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఎమ్మెలే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన నియోజకవర్గ ముఖ్యనాయకులతో నిర్వహించి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన గిరిజన భవనం ఈ నెల 22న గిరిజన శాఖ మాత్యులు సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నదని తెలిపారు. గిరిజన భవనంలో నిర్వహించనున్న సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా పట్టణానికి చెందిన భూక్య చంద్రమౌళిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లి ఎంపీపీ ముడావత్ పార్వతికొండానాయక్, జెడ్పీటీసీ బానోత్ జగన్‌నాయక్, సేవాలాల్ ఉత్సవాల కన్వీనర్ భూక్య చంద్రమౌళి, గిరిజన సంఘం నాయకులు నగేష్‌రాథోడ్, వెంకటేశ్వర్లు నాయక్, నవీన్‌నాయక్, రవీందర్‌నాయక్, తులసిరాం నాయక్, నాగునాయక్, వీటినాయక్, సైదా, శోభన్, పాండు, అశోక్, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు ఒకే గూటి పక్షులు

● బీజేపీని తట్టుకోలేక ఏకమవుతున్నారు

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ఎస్.ప్రభాకర్



కరీంనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): బిఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఎంఐఎం పార్టీలు ఒకే గూటి పక్షులని, రాష్ట్రంలో బిజెపిని తట్టుకోలేని పరిస్థితుల్లో ఆ పార్టీలన్నీ ఏకమయ్యేందుకు అడుగులు వేస్తున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన శక్తిగా అవతరించిన బిజెపిని ఎదుర్కోవడానికి ఈ పార్టీలన్నీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయ న్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వ్యవహరించిన తీరు, శాసనమండలి ఎన్నికల సందర్భంగా వ్యవహరిస్తున్న తీరును చూసి రాజకీయాలు ఏ విధంగా నడుస్తున్నాయో అందరూ గ్రహించారన్నారు. లోపాయికారి ఒప్పందాలతో కెసిఆర్, ఇతర పార్టీలు అనుసరిస్తున్న తీరు వారి బంధం తెలంగాణ సమాజానికి నేడు అర్థమవుతుందన్నారు. శాసన సభలో కెటిఆర్, ఓవైసిల కుస్తీలు, బయట దోస్తానాలు ఏంటో అందరికీ తెలిసిన విషయమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కెసిఆర్ సర్కార్ అన్ని పార్టీలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, బిజెపితో పోరాటం చేయాలని చూస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ రాజకీయ అవసరాల లక్ష్యంగా కెసిఆర్ రాజకీయ వ్యవహారాలుంటు న్నాయని తెలిపారు. రాష్ట్రంలో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి , ప్రజల్లోకి విస్తృతంగా పార్టీని తీసుకు వెళ్లడానికి, కెసిఆర్ ప్రభుత్వ వైఫల్యాలను, బిజెపి మోడీ ప్రభుత్వం పనితీరును, పథకాలను విజయాలను ప్రజలకు వివరించడానికి తలపెట్టిన శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని శక్తి కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బిజెపి శ్రేణులందరూ సమిష్టి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొరటాల శివరామకృష్ణయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు మేకల ప్రభాకర్ యాదవ్, ఎర్రబెల్లి సంపత్ రావు, మాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ మాడుగుల ప్రవీణ్, నాయకులు పుప్పాల రఘు, జాడి బాలరెడ్డి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, దుబాల శ్రీనివాస్, ముత్యాల జగన్, వరాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి రూ. 78వేల ఆర్థికసాయం



హుజూర్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: 1998-99 విద్యసంవత్సరంలో తమతో పాటు 10వ తరగతి చదువుకున్న గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు శివ ఇటీవల మృతి చెందగా ఆ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు బుధవారం బాధిత కుటుంబానికి రూ. 78వేల ఆర్థికసహాయాన్ని చైతన్య పాఠశాల కరస్పాండెంట్ మేరెడ్డి యల్లారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. శివ కుటుంబానికి మిత్రులు సహాయం చేయడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

## ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి



మల్లాపూర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామంలో బుధవారం సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా మల్లాపూర్ జడ్‌పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,ఎంపిటిసి రాజ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతు సేవాలా ఎస్టీల ఆరాధ్య దైవం అని కొని యాడారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జీవన్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, గ్రామ గిరిజన సంఘాలనాయకులు నునావత్ పెద్దరాజు, బాదావత్ రాము, భూక్య తిరుపతి, నునావత్ రాజు ,టీచర్ సభావట్ లింబ, నునావత్ నవీన్, సభావట్ మల్లేష్, భూక్య అర్జున్, భీమ్ రాజ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు అద్దాలు పంపిణీ చేసిన ఎంపీపీ



కొత్తపల్లి ,ఫిబ్రవరి 15( మనం న్యూస్).కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్ నగర్ గ్రామంలో కంటి వెలుగు ప్రోగ్రాంలో భాగంగా కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కంటి వెలుగు ప్రోగ్రాం అని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని తెలంగాణ రాష్ట్రాన్ని అంధత్వ రహిత రాష్ట్రంగా ముందంజలో ఉంచాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడారి శాంత శ్రీనివాస్, ఎంపీటీసీ దావా కమల మనోహర్ ,జెడ్పి కోఆప్షన్ సాబీర్ ,డాక్టర్ మౌనిక ఏఎన్ఎం శ్వేత, వార్డు సభ్యులు దూలం సుధాకర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అవగాహన సదస్సు



శంకరపట్నం, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట ఆధ్వర్యంలో బుధవారం రైతులకు డ్రోన్ ద్వారా ఫర్టిలైజర్స్ స్ప్రే చేయడం ఎలాగో డెమోన్‌స్ట్రేషన్ చేసి చూపించారు. దీనిద్వారా రైతులకి కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుందని కెవికె శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, మహేష్ , మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు గ్రామ కో ఆర్డినేటర్ రమేష్, ఏఈఓ శ్రావణి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సీఐని రమేష్ కలిసిన ఎస్ఐలు



తిమ్మాపూర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సిఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పర్ష రమేష్‌ను ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్ రెడ్డి, గన్నేరువరం ఎస్ఐ మామిడాల సురేందర్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## టోల్ గేటు వద్ద మార్చి 31 నుంచి ఫాస్ట్ ట్రాక్ సేవలు




తిమ్మాపూర్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్ గేట్ వద్ద మార్చి 31వ తేదీ నుంచి స్మార్ట్ కార్డు సేవలను నిలిపివే సి, ఫాస్ట్ ట్రాక్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు హెచ్‌కెఆర్ టోల్ గేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలు టోల్ గేట్ కు 20 కిలోమీటర్ల లోపు ఉన్న వారికే వర్తించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్రీ ఫాస్ట్ ట్రాక్ కొరకు ఆర్‌సి బుక్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను జత చేసి టోల్ గేట్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు దంపతులు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్నకు ఎంతో ప్రీతిదాయకమైన కోడె మొక్కును చెల్లించుకున్నారు. రాజన్న దర్శనం అనంతరం ఎమ్మెల్యే దంపతులకు కళ్యాణమండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్ లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, శ్రీరాములు పాల్గొన్నారు.

# కరీంనగర్ పెద్దపల్లి

## సీతారామాంజనేయ స్వామి దేవాలయం ప్రారంభం

● శ్రీరామున్ని ఆదర్శంగా తీసుకోవాలి

● కేసీఆర్ సేవాదళం ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్



పెద్దపల్లి, ఫిబ్రవరి 15, (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా జూలపల్లి గ్రామంలోని తెలుకుంట గ్రామంలో శ్రీసీతారావూంజనేయ స్వామి దేవాలయాన్ని నిర్మించిన 1991-92వ,10వ తరగతి చెందిన వారిని జూలపల్లి జెడ్పిటీసీ బొద్దుల లక్ష్మణ్ అభినందించారు. బుదవారం శ్రీసీతారామాంజనేయ దేవాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో తనను కూడా భాగస్వామిని చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి తనవంతుగా తండ్రి కీ.బొద్దుల నారాయణ జ్ఞాపకార్థం రూ.1,00,116 నిర్మాణానికి విరాళం అందించడం జరిగిందని తెలిపారు. 7వేల సంవత్సరాల నాటి త్రేతాయుగంలో జరిగినటవంటి రామాయణ గాథను ఇప్పటికి కూడా ఆదర్శంగా తీసుకుంటున్నామని, శ్రీరాముడినీ ఆదర్శంగా తీసుకొని మన జీవితం గడపాలని అన్నారు. రామాయణంలో తండ్రి మాట జవదాటని కొడుకుగా, భర్త తోడువీడని సీతమ్మతల్లి, అన్నదమ్ముల అనుబంధం రామలక్ష్మణులు, రామాయణ గాధ నేటికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొల్లు పద్మశ్యాం, ఉపసర్పంచ్ చొప్పరి నర్సింగం, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు చాతల్ల కాంతయ్య,ఎంపిటీసీల ఫోరం మండలాధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, చిప్ప శ్రీకాంత్,నీవూరి మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవం



హుజూర్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఉత్సవ మూర్తుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాతసేవ, పుణ్యాహవచనం, నిత్య హోమం, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృ తిక కార్యక్రమాలు అహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వూరె రాధాకష్ణారావు, పెద్దారపు శంకర్, జోజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 8 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాఫన



పాలకీడు, ఫిబ్రవరి 15, మనం న్యూస్: మండల పరిధిలోని దేవ్లాతండాలో ఎన్ఆర్ఈజీఎస్ నుండి మంజూరైన రూ. 8లక్షల రూపాయలతో సీసీరోడ్డు పనులకు బుధవారం ఎంపీపీ భూక్య గోపాలనాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండలంలో పలు తండాల్లో ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ ఫండ్ ద్వారా సీసీ రోడ్లు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్లాతండా, బెట్టేతండా సర్పంచ్‌లు మాలోత్ సుమన్‌నాయక్, మాలోత్ మోతీలాల్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, ఉపసర్పంచ్ బానోత్ సైదా, నర్సింహరావు, కోట్యనాయక్, భాస్కర్, శంకర్, నర్సింహ, బాలు, రవిలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించిన చైర్మన్ రుద్ర రాజు



కొత్తపల్లి, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): కొత్తపల్లి మున్సిపాలిటీ లోని రెండవ వార్డులోకంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రజల కు ఎలాంటి ఇబ్బంది కాకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 2376 మందికి రిజిస్ట్రేషన్ చేపించి స్క్రీనింగ్ టెస్ట్ కూడా చేయడం జరిగిందన్నారు. 757 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ వినత, కంటి వెలుగు క్యాంప్ కోఆర్డినేటర్ శంకర్ , డాక్టర్ నౌశిబ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అంజుమ్, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్
### నారాయణపేట-వనపర్తి

### కేవీపీఎస్ ఆధ్వర్యంలో..
## 'మనుస్మృతి' ఆవిష్కరణకు వ్యతిరేకంగా నిరసన

అలంపూర్, ఫిబ్రవరి 15 (మనం. న్యూస్) : మనుస్మృతి గ్రంథ ఆవిష్కరణకు వ్యతిరేకంగా జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర కెవిపిఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి. నర్సింహ్మ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మను రాసిన స్మృతులను ఆర్య వీర్ దల్, సమరసతా సంయుక్త ఆధ్వర్యంలో స్వామి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా మాడుగుల ఫణిశర్మతో మనుస్మృతిని గ్రంథంగా ఆవిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. ఇది భారత దేశాన్ని మళ్లీ అనాగరికంలోకి తీసుకెళ్లడానికే తప్పా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఇటు వంటి అనాగరిక ఆలోచనలతో ప్రజల మధ్య ఐక్యతను చెడ గొడుతుందన్నారు. మను శాస్త్రం ప్రకారం స్త్రీలు చదువుకు దూరం చేస్తారని, ఇటువంటి ఎత్తుగడలతో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. మళ్లీ ఈ దేశంలో కుల వ్యవస్థను తీసుకురావడానికి ఇటువంటివి పునాది రాళ్లుగా నిలుస్తాయన్నారు. ప్రజలు వీటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని లేనదంటే దేశ అభివృద్ధి నాశనం అవుతుందని తెలిపారు. దేశానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా బిజెపి మను ధర్మ శాస్త్రంను ముందుకు తీసుకొస్తుందని, బిజెపి ఎత్తుగడలను ప్రజలు అంగీకరించరని అన్నారు. సైన్స్ ద్వారా ప్రపంచం ముందుకు పోతుంటే శాస్త్రాల ద్వారా నేడు బిజెపి ప్రభుత్వం భారత దేశాన్ని వెనక్కి లాగుతుందన్నారు. ఫలితంగా ప్రజలను బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతుందని, ప్రజలు గమనించాలని తెలిపారు. వీటిని తిప్పి కొట్టేందుకు కెవిపిఎస్ సంఘం ఎప్పుడూ ముందుంటుందని ఆయన హెచ్చరించారు. అలాగే మానవపాడు, ఉండవెల్లి మండలాల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి ప్లకార్డులను ప్రదర్శిస్తూ డాక్టర్ బిఆర్ అబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి. రాజు, కెవిపిఎస్ మండల అధ్యక్షులు కె. వెంకటస్వామి, మండల కార్యదర్శి కె. నాగరాజు, టౌన్ కార్యదర్శి అయ్యప్ప, శరత్, ప్రభుదాసు, వెంకటేశ్వర్లు, రమేష్, బసవ రాజు, ఉండవెల్లి మండల అధ్యక్షులు పి. ప్రభాకర్, కార్యదర్శి ఇ. మహేష్, రాంబాబు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం విస్తీర్ణ పథకంలో భాగంగా జిల్లాలో 818 మంది రైతులకు సంబంధించిన 2008 39 ఎకరాలలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం జరిగింది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నాటబడిన ఆయిల్ ఫామ్ తోటలు మూడవ సంవత్సరంలోకి ప్రవహిస్తున్న క్రమంలో పరపరాగా ఫలదీకరణ సహకారి వీల్స్‌ను తెలంగాణ రాష్ట్రంలోని మొదటిసారిగా శ్రీరంగపురం మండలంలోని కంబలపురం గ్రామంలో ఆనంద రెడ్డి తోటలో మగ పుష్పాలపై వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ విడిచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి కే సురేష్, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ రామ్మోహన్రావు, ఉద్యానవనాధికారులు ఆర్ కృష్ణయ్య, ఎం సురేష్, ఆయిల్ ఫామ్ ఏరియా మేనేజర్ సుమంత్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ జిల్లా సమన్వయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ రైతులకు నష్టం చేకూర్చే పనులకు చెక్

– వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్

వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: వనపర్తి వ్యవసాయ మార్కెట్లో కూలీలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న చేట కూలీలు కాంటా చేసినప్పుడు అడుగుధాన్యం చాట కూలీలు తీసుకోవడం వల్ల రైతులకు నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో అడుగుదాన్ని చాటకూలీలు తీసుకోకుండా డబ్బులనే తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ మార్కెట్లోని తన ఛాంబర్ లో చాట కూలీలు సిబ్బందితో చర్చించి ఇకమీదట పాత విధానాన్ని విడనాడి కూలీలు డబ్బులు తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలిపురం బానేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు గందం పరంజ్యోతి, శివశంకర్, నందు సబ్బు, శంకరమ్మ, బస్సుల బాలకృష్ణ, మార్కెట్ సెక్రటరీ లక్ష్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: వాసవి వనితా క్లబ్ రాయచూర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో వాసవియన్ కెసిజియప్ విద్యాసంకల్ప జూలురి రమేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ వనితా క్లబ్ ఉత్సాహాన్ని చూస్తుంటే ఈ సంవత్సరం రాయిచూర్ వనితా క్లబ్ ఇంటర్నేషనల్‌లో మంచి గుర్తింపు సాధిస్తారని హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితోనే ముందుకు సాగుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. 108 డిస్ట్రిక్ట్ గవర్నర్ మెడిశెట్టి రామకృష్ణ గారు నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి ఈ సంవత్సరం నూతన కార్యవర్గం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఈవెంట్స్ కార్యక్రమాలన్ని నిర్వహించి వాసవి క్లబ్ సేవలను విస్తృతం చేయాలని సూచిస్తూ వాసవి క్లబ్ నిర్వహించే ప్రతి సమావేశంలో పాల్గొని ఇంటర్నేషనల్ మంచి గుర్తింపు తీసుకురావాలని కొరారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు విద్యా మాట్లాడుతూ ఈ సంవత్సరం పదవి బాధ్యతలు నా ఇష్టం పూర్వకంగా స్వీకరిస్తున్ననంటు ఈ సంవత్సరం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఈవెంట్స్ అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి వాసవి క్లబ్ సేవలను ఇంకా విస్తృతం చేసి వాసవి సేవలను ముందుకు తీసుకెలతనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రెటరీ జిపి ప్రవీణ్ కుమార్, వైస్ గవర్నర్ బిలకంటి జగదీష్ గుప్తా, ఇంటర్ నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కలిమిచర్ల రమేష్, ప్రశాంత్ కొంపల్, రాజులు బండి శ్రీనాథ్, రిజియన్ ఛైర్మెన్ స్వాతి కొంపల్, రిజియన్ సెక్రెటరీ స్వాతి , జోన్ చైర్మన్ అరుణ్ జ్యోతి, వెంకటేష్ మణివికర్, నిలకంటి, వాసవి వనితా క్యాన్ క్లబ్ సెక్రెటరీ పి.అను, ట్రెజరర్ పి.విజయశ్రీ పలువురు పాల్గొన్నారు.

## 20 నుండి తపాలా ప్రత్యేక ఖాతాల మేళా

జడ్చర్ల, ఫిబ్రవరి 15, మనం న్యూస్: దేశ వ్యాప్తంగా ఈ ఏడాది తపాలా శాఖలోని అన్ని తపాలా కార్యాలయాలలో ఈ నెల 20 నుంచి 24 వరకు ప్రత్యేకంగా చేపడుతున్న ఖాతాల మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్చర్ల బ్రాంచ్ అసిస్టెంట్ సూపర్ వైజర్ రవికుమార్ బుధవారం పేర్కొన్నారు. జడ్చర్ల ప్రధాన తపాలా కార్యాలయం, కావేరమ్మపేట, మిడ్జిల్, కల్వకుర్తి, బాలానగర్, మార్చాల, బిజినేపల్లి, నాగర్ కర్నూల్ తపాలా కార్యాలయాలో కూడ ఖాతాలు పొందవచ్చని, సేవింగ్ రికరింగ్ డిపాజిట్, టైం డిపాజిట్ అకౌంట్, మంత్లీ ఇన్కమ్ స్కీమ్ అకౌంట్, నేషనల్ సేవింగ్ అకౌంట్, సీనియర్ సిటిజన్ సేవింగ్ అకౌంట్, సుకన్య సమృద్ధి యోజన అంటే ఎన్నో ఉపయోగకరమైన ఖాతాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సోమశిల బ్రిడ్జి, నేషనల్ హైవే సాధించాను

- విద్యాభివృద్ధికి కృషి చేస్తా
- పెద్దకొత్తపల్లి హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయిస్తా
- పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా
- కొల్లాపూర్ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: కొల్లాపూర్ నియోజకవర్గంలో తాను సంకల్పించిన లక్ష్యాన్ని సాధించానని సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జినీ, నేషనల్ హైవేను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానించి అనుమతి తీసుకువచ్చి సాధించానని కొల్లాపూర్ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి చెప్పారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్నత పాఠశాలలో వార్సికోత్సవ సభకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదిలేటి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తన లక్ష్యం సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఉండేదని అదే విధంగా, నేషనల్ హైవే చేయాలనే లక్ష్యంతో ఉండేదని ఆ లక్ష్య సాధనకు ఈ నాలుగు సంవత్సరాలలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి ఇంజనీరింగ్, ఇరిగేషన్ శాఖతో మాట్లాడి, అదే విధంగా ఆంధ్ర ప్రదేశ్ ఉన్నప్పుడు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రికి లేటర్ రాయించి కేంద్ర ప్రభుత్వంతో ఇతర అధికారులతో అనుమతి తెప్పించి టెండర్లు చేయించానని అదే విధంగా నేషనల్ హైవేను కూడా జయించానని వివరించారు. అదే విధంగా కొల్లాపూర్‌కు హైవే తేవాలని ఈ ప్రాంతానికి చెందిన జాతీయ రహదారుల శాఖలో ఉన్న గిరిధర్ అనే ఉన్నతాధికారితో మాట్లాడి అనుమతి తీసుకురావడం జరిగిందని దానికి నిధులు కూడా కేటాయించేలా కృషి చేయడం జరిగిందని, ఈ రెండు ప్రాజెక్టుల విషయాన్ని వివరించారు. ఒక లక్ష్య సాధన కోసం విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, తాను ఎమ్మెల్యే అయినప్పుడు పై లక్ష్యాలను అనుకొని సాధించానని విద్యార్థులకు వివరించారు.ఈ ప్రాంతంలో హైవే రావడం వల్ల ఈ నియోజకవర్గం అంత అభివృద్ధి చెందుతుందని నీరు రావడం వల్ల సస్యశ్యామలం అయ్యిందని బ్రిడ్జి నిర్మాణం వల్ల దూర ప్రాంతానికి కిలోమీటర్లు తగ్గుతాయని ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి సాధిస్తున్నామని సభలో ఎమ్మెల్యే వివరించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి జూనియర్ కళాశాల సూత్రప్రాయంగా ప్రభుత్వం అంగీకరించిందని ఈ హై స్కూల్‌లోనే జూనియర్ కళాశాల నిర్మించడానికి పాఠశాల వారు అనుమతి ఇచ్చారని, వచ్చే విద్యాసంవత్సరం వరకు కొత్త జూనియర్ కళాశాల వస్తుందని ఈ ప్రాంత విద్యార్థులు ఇంటర్ విద్య చదువుకోవడానికి వీలవుతుందని దీనిని ఉపయోగించుకోవాలని అన్నారు. హెడ్‌మాస్టర్ మద్దిలేటి ప్రస్తావించిన హిందీ పండితుల పోస్టులు, పాఠశాల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తానని, అవసరం అయితే డిజిటల్ క్లాస్‌కూడా ఏర్పాటు చేయిస్తానని ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తానని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్య బుద్దులు నేర్చుకొని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని మంచిగా చదువుకొని డాక్టర్లు, లాయర్లుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆ విధమైన కృషి చేయాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా విద్యార్థులకు ఇంగ్లీష్ నేర్పించే విషయంలో అందరినీ అభినందించారు. విద్యాభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని అన్నారు. కరాటేలో జాతీయ స్థాయిలో వెళ్లిన విద్యార్థిని అభినందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో కరాటే పోటీలకు తన వంతు సహాయాన్ని అందిస్తానని ఆ అబ్బాయికి కావాల్సిన సౌకర్యాలు తనకు తెలియజేస్తే సహకారం అందిస్తానని తెలిపారు. విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. జనరల్ కోషన్స్ అడిగిన సందర్భంగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతిగా డిక్షనరీలను కొనుక్కునేందుకు కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి జడ్పీటీసీ మేకల గౌరమ్మ, స్థానిక ఎంపీటీసీ చంద్రమ్మ, రైతు సంఘం అధ్యక్షులు నాగరాజు, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య, పెద్దకొత్తపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రాము, ప్రముఖ కవి ఎదిరపల్లి కాశన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, సాయిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిలో చిన్నారెడ్డి కృషి మరువలేనిది

వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: వన పర్తి జిల్లా అభివృద్ధికి చిన్నారెడ్డి అడ్డగిస్తున్నా రన్నడం విడ్డూరమని వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిలో మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి పాత్ర మరువలేనిదని ఏనాడు కూడా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించలేని నాయకుడని, వనపర్తి జిల్లా ఏర్పాటు కోసం మరియు జిల్లాలో పీజీ నుంచి అనేక స్థాపనలో చిన్నారెడ్డి కృషి ఉందని తెలిపారు. చిన్నారెడ్డి గాని ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త అయిన ఎక్కడైనా అభివృద్ధి పనులను అడ్డుకున్నారా అని బి. అర్ ఎస్ నాయకులను ప్రశ్నించారు. వనపర్తిలో అభివృద్ధి పనుల పేరుతొ పేద జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కొరకని వనపర్తి జిల్లా కేంద్రనికి తలమానికమైన పీర్లగుట్ట నుండి మట్టి తరలించడం సరికాదన్నారు. జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఆమోదయోగ్యమైన మంచి స్థలం కేటాయించాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార జిల్లా అధ్యక్షులు యాదయ్య,, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, వనపర్తి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు జాన్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇర్షాద్, వనపర్తి టౌన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి చిన్నారెడ్డి అడ్డగిస్తున్నారన్నడం విడ్డూరమని వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్.అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిలో మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి పాత్ర మరువలేనిదని ఏనాడు కూడా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించలేని నాయకుడని, వరపర్తి జిల్లా ఏర్పాటు కోసం మరియు జిల్లాలో పీజీ నుంచి అనేక స్థాపనలో చిన్నారెడ్డి కృషి ఉందని తెలిపారు. చిన్నారెడ్డి గాని ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త అయిన ఎక్కడైనా అభివృద్ధి పనులను అడ్డుకున్నారా అని బి. అర్ ఎస్ నాయకులను ప్రశ్నించారు. వనపర్తి లో అభివృద్ధి పనుల పేరుతొ పేద జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కొరకని వనపర్తి జిల్లా కేంద్రనికి తలమానికమైన పీర్లగుట్ట నుండి మట్టి తరలించడం సరికాదన్నారు. జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఆమోదయోగ్యమైన మంచి స్థలం కేటాయించాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార జిల్లా అధ్యక్షులు యాదయ్య, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, వనపర్తి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు జాన్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇర్షాద్, వనపర్తి టౌన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



### ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా
# పి.మాణిక్ రెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: మార్చి 13న జరిగే మహబుబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యుటిఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అధ్యాపకులకు పిలుపునిచ్చారు. బుధవారం రోజున టియస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్, కల్వకుర్తి పట్టణాల్లో డిగ్రీ కళాశాలలు విద్యాసంస్థల్లో పర్యటించిన ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ప్రైవేటు పరమైనదని జూనియర్ కళాశాలలు మొదలుకుని యూనివర్సిటీల దాకా అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉండటం చేత ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ ఉన్నత విద్యారంగం కుచించుకు పోయే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలలో 2004 తరువాత నియామకమైన అధ్యాపకులకు పాత పెన్షన్ గానీ సిపిఎస్ పెన్షన్ కానీ లేదని వారికి పెన్షన్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలకు గ్రాంట్లు ఇస్తూ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలి. అధ్యాపకులకు పదోన్నతులు కల్పించి ఖాళీ పోస్టులకోసం కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలిలో ఇట్టి సమస్యల పరిష్కారానికి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వత్తిడి పెంచడానికి టియస్ యుటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డిని మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్సీ వెంట టియస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.కృష్ణ, డా.యం.శ్రీధర్ శర్మ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.చిన్నయ్య, కె.శంకర్, జిల్లా ఉపాధ్యక్షురాలు యం.ఉమాదేవి, జిల్లా కోశాధికారి జె.బాల్ రాజు, జిల్లా కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్,పి.మహేశ్ బాబు, కె.శంకర్, పి.రామేశ్వరయ్య,యం.శ్రీనివాసులు సోషల్ మీడియా కన్వీనర్ ఎన్.నెహ్రూప్రసాద్, సి.తిరుపతయ్య ఎన్.చంద్రమోహన్ రెడ్డి ఖాజా సలీం టి.కురుమయ్య బి.పరమేశ్వర్ డి.శేషగిరి రాజు వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్
### గద్వాల-కల్వకుర్తి

## పెబ్బేరులో ఘనంగా అయ్యప్ప స్వామి ఇంటింటి భజన మన ఇంటి భజన కార్యక్రమం

పెబ్బేరు, ఫిబ్రవరి 15, మనం న్యూస్: పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం 200 వారం ఇంటింట భజన కార్యక్రమం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం 6 గంటలకు భక్తులు పాల్గొని స్వామివారికి పాలాభిషేకం చేశారు. భజన పోటీలకు ఏపీ తెలంగాణ నుండి పాట పోటీగా భజన పాటలు పాడారు. మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు వేణుగోపాల్ స్వామి గుడి నుండి అయ్యప్ప స్వామిని వీధులలో పల్లకి సేవ అంగరంగ వైభవంగా ఊరేగిస్తూ అయ్యప్ప స్వామి ఆలయానికి తీసుకొచ్చారు సాయంత్రం 7 గంటలకు మహా పడిపూజ కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి ముత్తు కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, శ్రీనివాస్ గౌడ్, సహదేవుడు, కిషోర్, మిర్చి వెంకటేష్, మోతెట రాములు, బాలవర్ధన్, పరశురాముడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తూడుకుర్తి గ్రామ ప్రజలకు పెన్షన్స్ సకాలంలో అందజేయాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: తూడుకుర్తి గ్రామ ప్రజలకు పెన్షన్స్ సకాలంలో అందజేయకపోతే నిన్న ఎస్పీఎమ్ నారాయణను, పెన్షనర్స్ పోస్ట్ ఆఫీస్ లో తాళం వేసి దాదాపు 8 గంటలు బంధించారు. ఈ సంఘటనపై స్పందించిన బిఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు పృథ్వీరాజ్, ఇన్స్పెక్టర్ పోస్ట్(ఐపీ) విక్రమ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ కరెంటు సమస్య, మేషిన్ సమస్య సాకుగా చెప్పినా గ్రామస్తులకు పెన్షన్స్ సకాలంలో అందజేయక పోతే, ఆ పెన్షన్స్ అన్నీ రిటర్న్ వెళ్లిపోయాయని తెలిపారు. దీంతో వచ్చే నెల రోజుల వరకు పెన్షనర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటారని, అందుకే ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పెన్షన్ ఇచ్చే మేషిన్స్ పీఓడిటీ లు తూడుకుర్తి పోస్ట్ ఆఫీస్ కు 2లేదా3 అందజేయాలనీ అడిగారు. తూడుకుర్తి గ్రామ వాసులైన ఎంపీపీ, ఎమ్మెల్సీలు ఇ విషయంలో చొరవ చూపి – సమస్యను సత్వరమే పరిష్కరించాలని చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ పట్టణ అధ్యక్షులు కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన ధర్మరాజు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంతటి గ్రామానికి చెందిన బీసీ బిడ్డ ఆవంచ శ్రీశైలంను ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జట్టి ధర్మరాజు హాస్పిటల్‌లో ఉన్న శ్రీశైలం ను సందర్శించి ఆయన యొక్క బాగోగులను తెలుసుకుంటూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటారంటూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పెద్దమనస్సుతో ఎంతోమందికి సేవ చేస్తూ సేవతోపాటు ఆర్థిక సాయం 5000 రూపాయలు చేశాడు మీలాంటి అన్ని వర్గాల పేద అండగా ఉంటానంటూ ఇలాంటివి మన జిల్లాలో ఎంతోమందికి పేద ప్రజలకు చేదోడుగా ఉంటూ వారందరికీ సామాజిక సేవ చేస్తూ దానితోపాటు ఆర్థిక సహాయం కూడా అందజేస్తూ గొప్ప మనసున్న మారాజుల అన్ని వర్గాల ప్రజల నుండి కీర్తి ప్రతిష్టలు పొందుతున్న అన్నకు పేద ప్రజల ఆశీస్సులు ఉండాలని మంతటి గ్రామం తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

## జిల్లాలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి కుమార్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: ఈ నెల 9వ తేదీ నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న, జిల్లా అధికారులకు ఇదేమి పట్టడం లేదని బిఎస్పీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ మెయిన్ రోడ్లపై బిఆర్ఎస్ ఫ్లెక్సీలు పుట్ట గొడుగుల్లా ఉన్న, జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించ్చారు. నిన్న జరిగిన ఎన్నికల సమావేశంలో బిఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు ఫ్లెక్సీల తీసివేత అంశాన్ని కలెక్టర్ దగ్గర ప్రస్తావిస్తే, ఈ రోజు తీసివేయిస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఆ మాట కూడా నెరవేరలేదని చెప్పారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా కేంద్రంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించి, ఎన్నికల కోడ్ ను కఠినంగా అమలు చేయాలనీ ఒక ప్రకటనలో కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సేవాలాల్ జయంతి

వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వనపర్తి ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి శేఖర్ నాయక్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి ఆలోచన విధానం మరియు ఆచరణ చాల గొప్పదని గిరిజన సమాజమే కాకుండా ఇతర నిమ్న వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరి శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించిన అధ్యాత్మిక గురువు సేవలాల్ మహారాజ్ అని కొనియాడారు. నేటి సమాజం స్వేచ్ఛకు మూల కారణం నాటి తరాల మహనీయుల శ్రమ ఫలమని తెలియజేశారు. విద్యార్థి దశ నుంచి సత్ప్రవర్తన కలిగి మంచి సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు.జాత్రునాయక్ గిరిజన సేవ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలేతో పాటు సేవలాల్ కృషి చేశారన్నారు. ఆ తదరుపరి గిరిజన ఉద్యోగ సంఘం జనరల్ సెక్రెటరీ అర్జున్ నాయక్ మాట్లాడుతూ జీవహింస చేయరాదని, అంబేద్కర్, సేవలాల్ గారి యొక్క ఆశయ సాధన ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు జాత్రు నాయక్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: వనపర్తి జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారి నిలయంలో మహాశివరాత్రి దినోత్సవ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఐశ్వర్య నిలయం ఆధ్వర్యంలో చేపట్టినశివరాత్రి వారోత్సవాలను బుధవారం వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ ధ్వజారోహణ చేసి శివలింగానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉమ్మడి జిల్లా రాజయోగిని బికే మహాదేవి మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాల స్థాపన శివరాత్రి ఉత్సవాల్లో వనపర్తి కేంద్రంలో ఏర్పాటు చేశామని ప్రజలందరూ పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని కోరారు. నిరాకార రూపుడని పరమేశ్వర ఈశ్వర చంద్రశేఖర అనేక నామములతో పిలిచేటటువంటి ఈశ్వర మీకీ రూపం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ఉంగుళం తిరుమల్, ఆవుల రమేష్, వనపర్తి సంచాలికా బీ కే శోభ సహసంచాలికా, బి కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికడదాం

- **సీడీపీఓ కృష్ణకుమారి**
- **ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణా తరగతులు**

కల్లూరు, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): అడ్డమైన దారిలో అక్రమ సంపాదనకు కొంతమంది దుర్మార్గులు మానవ అక్రమ రవాణనే మార్గంగా ఎంచుకున్నారని, ముఖ్యంగా మహిళలనే లక్ష్యంగా జరుగుతుందని, మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని సిడిపిఓ కృష్ణకుమారి అన్నారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ కల్లూరు ప్రాజెక్ట్ నందు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా శిక్షణను స్థానిక స్త్రీ శక్తి భవన్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా స్థానిక సీడీపీఓ కృష్ణ కుమారి హాజరై శిక్షణను జ్యోతి ప్రజ్వలన ద్వారా ప్రారంభించడం జరిగింది.అనంతరం ఆమె మాట్లా డుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద నేరంగా ఉందని అన్నారు.సెల్ ఫోన్ వాడడం ద్వారా చాలా నష్టాలు ఉన్నాయని, కొంతమంది అక్రమ మార్గంలో డబ్బు సంపాదన కోసం ఆడపిల్లలను అమ్ముతున్నారని, ఆడపిల్లల అమాయ కత్వాన్ని ఆసరాగా తీసుకొని ప్రేమవ్యామోహంతో పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సామజిక ఆర్థిక స్థితి గతులపై అవగాహనా పెంచుకొని అందరిని అప్రమత్తం చేయా లనీ అన్నారు. అక్రమరవాణ,లైంగిక వేధింపులకు, వారి తో చేయిస్తున్న వ్యాపారానికి వ్యతిరేకంగా గత 27 సంవత్సరాలుగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచే స్తుందని తెలిపారు. పద్మ శ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసిడిఎస్, పోలీస్, జ్యూడిషల్ డిపార్ట్మెంట్ సమన్వయంతో ఇప్పటి వరకు 26,500 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికీ పునరా వాసం కల్పించడం జరిగిందని తెలిపారు. నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలనీ అన్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అంగన్వాడీ టీచర్లకు అవగాహనా కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్య వంతం చేస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణలో టీచర్లకు లఘుచిత్రాల ద్వారా, బృంద చర్చల ద్వారా, స్కిట్ ప్లే ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగు తుందని అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ లు 1098, 100, 181, 1930 ల గురించి తెలుసుకొని అనుసరించాలని కోరారు. తెలంగాణ ఉమెన్ అండ్ చైల్ వెల్ఫేర్ కమిషనర్ అనుమతితోనే శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ ముక్కెర సురేష్ కుమార్, ఏసిడిపిఓటి రత్న, ప్రజ్వల ప్రతినిధులు శ్రావ్య, చెన్నయ్య, సూపర్ వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, హ్యాబిమున్నుసా, రోజా, పాల్గొన్నారు.




## ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్రకు కొత్తగూడెం నుండీ భారీ జన సమీకరణ

- **డీసీసీ అధ్యక్షుడు పోదెం వీరయ్య అధ్యక్షతన యాత్ర**
- **విజయవంతం చేసిన పీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి**



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మంగళవారం రాత్రి జరిగిన హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేస్తున్న యాత్రకు డిసిసి అధ్యక్షులు పొదెమ్ వీరయ్య పిలుపు మేరకు కొత్తగూడెం నియోజకవర్గం నుండి భారీ జన సమీకరణతో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమములో ఎడవల్లి మాట్లాడుతూ, రాష్ట్రం,కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తో అభివృద్ధి జరుగుతుందని, రేవంత్ రెడ్డి చేస్తున్న మహోత్తర యాత్రకు ప్రజలు అభిమానులు తండోప తండాలుగా భారీ జన సందోహంతో పాల్గొనడం చూస్తుంటే, రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పాలనకు ఎదురు చూస్తున్నారనే సంకేతానికి ఇది నిదర్శనం అని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని, భద్రాచలం లో జరుగుతున్న యాత్ర కు కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఒకే ఒక పిలుపుతో 1200 నుండి 1500 వందల మంది హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని,ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎడవల్లి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, చుంచుపల్లి మండల అధ్యక్షులు అంతోటి పాల్,జిల్లా మాజీ యస్సీ సెల్ అధ్యక్షులు గిన్నరావు నాగేందర్, కొత్తగూడెం బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, పాల్వంచ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చారి ఐఎన్ టియుసి నాయకులు జలీల్, బొజ్జ వెంకట స్వామి, కాలం నాగభూషణం,సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరయ్య చౌదరి, సుబ్బా రెడ్డి, దన్ బాద్ సునీల్, మరియు వారి మిత్ర కాంగ్రెస్ బృందం, లక్ష్మీదేవిపల్లి యస్సీ సెల్ మండల అధ్యక్షులు కొప్పుల రమేష్, పాల్వంచ పట్టణ బీసీ సెల్ నాయకులు లోగనీ మురళి, పాల్వంచ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు చాంద్ పాషా,పాల్వంచ పట్టణ యస్సీ సెల్ అధ్యక్షులు పెంకి శ్రీను,కొండ వెంకన్న గౌడ్,బత్తుల వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మైనార్టీ నాయకులు అక్బర్,రఘు, రామమూర్తి పాత కొత్తగూడెం రాజు, వీరాస్వామి, చంద్రగిరి సత్యనారాయణ, రాములు నాయక్,మహిళ నాయకురాలు వాలి, జేరిన, చంద్రకళ, రాజ్యలక్ష్మి, శనగ లక్ష్మణ్, భూక్యా శ్రీనివాస్, మాలోత్ లక్ష్మణ్, జక్కుల శ్రీనివాస్, పక్రొద్దిన్, గద్దిగుట్ట నరేష్, వసంత్, మొద్దు శ్రీను, పవన్, భారీగా నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని బైండోవర్ చేసిన ఎక్సైజ్ పోలీసులు



కొత్తగూడెం/ జూలూరు పాడు, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో జూలూరుపాడు మండలంలో పలువురుని బైండోవర్ చేశారు. బుధవారం జూలూరుపాడు మండలం సూరారం గ్రామానికి చెందిన బానోత్ అరుణ బానోతు వెంకటేశ్వర్లు కొర్ర వీరు కొర్ర పద్మ అనే వ్యక్తులను జూలూరుపాడు తహసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

## సత్తెమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సండ్ర



సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): సత్తుపల్లి మండలం, రేజర్ల గ్రామంలో గత మూడు రోజులుగా గ్రామ ఇలవేల్పుగా భావించే సత్తమ్మ తల్లి తిరుణాల మహోత్సవలు వైభవోపేతంగా జరుగుతుండగా మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏడాది గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో సత్తెమ్మ తల్లి అమ్మవారిని ఆరాధిస్తూ మహోత్సవం నిర్వహించుకోవడం అభినందనీయ విషయం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ అందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. మహోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణములో నిర్మించినా ఫంక్షన్ హాల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్డ శంకరరావు, సత్తుపల్లి టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, సత్తుపల్లి టౌన్ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లూరి అంకమరాజు, మండల బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా భిమిరెడ్డి గోపాల రెడ్డి, చింతల సురేంద్ర రెడ్డి, ఎర్ర బాబూ గొర్ల వెంకట రెడ్డి, గుర్రాల సురేష్, దేసిరెడ్డి భూమా నాగిరెడ్డి, నద్యాల వెంకట రెడ్డి, చెప్పనా సోములు, మడ్డికుంట్ల శ్రీనివాసరావు, ఖామ్మంపాటి రాంబాబు, కమనమతి రెడ్డీ సత్యనారయణ రెడ్డి, సీత రామిరెడ్డి, జక్కుల ప్రభాకర్ బొందల కోటేశ్వరరావు, కదరి శ్రీనివాసరావు, కనమతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖంమంపాటి శివయ్య, దేసిరెడ్డి శ్రీనివాస రెడ్డి, చింతల బాలకృష్ణ రెడ్డి, ఖమ్మంపాటీ చెన్నరావు, యేసు బాబూ, పాదిలి సర్వేశ్వరరావు, చెప్పాల కృష్ణ, కనమతి రెడ్డి కరుణాకర్ రెడ్డి, దేసిరెడ్డు పెద్ద నాగిరెడ్డి, నాయుడు శ్రీను, పాలకుర్తి శ్రీను తదితులున్నారు.

## కార్పొరేషన్‌లకు బడ్జెట్ కోట్లలో.... వినియోగం మాత్రం వేలల్లో

- **ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





వైరా టౌన్, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): వైరా మండల కేంద్రములో నియోజక వర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన వర్గీయులతో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ మేము ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటామని, మమ్ములను బి ఆర్ ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసినా మీరు మా వెంట ఉన్నారనే ధైర్యం మాకు ఉందని అన్నారు. మీ కోసం ఎటువంటి త్యాగమైనా చేస్తామని అందుకు మేమంతా సిద్దంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమం లో పొంగులేటి మాట్లాడుతూ ఎస్ సి, ఎస్ టి, బి సి, మైనారిటీ కార్పొరేషన్ లకు బడ్జెట్ ను లక్షల కోట్లలో కేటాయిస్తున్నారు కాని, వాటిని వినియోగించడం మాత్రం వేల కోట్లేనని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి యాప్ ద్వారా రైతులు ఇబ్బందులకు గురి అయ్యారని, రైతుల రుణమాఫీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురై అప్పుల బాధతో మరణిస్తుంటే సెక్రటేరియట్ నిర్మాణం కోసం కోట్ల రూపాయల ఖర్చు పెట్టడం అవసరమా అని ప్రశ్నించారు.15 సంవత్సరాలు అయినా గాని సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వగలుగుతారా అంటూ.. తెలంగాణ ప్రభుత్వం 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తే రైతులు పంటలు పండగ ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేసారు.

వైద్యరంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నప్పుడు కంటే రెండు శాతం పెరిగింది అని లెక్కలు చెప్పుకోవడం తప్ప మెరుగైన వైద్యం అందించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. విద్యారంగాలు మోడల్ స్కూల్లో ఏర్పాటుచేసి విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నారు కానీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంలో విఫలమయ్యారని, వీటన్నిటికీ ప్రభుత్వం సమాదానం చెప్పాలని కోరారు.అన్ని నియోజకవర్గాల కంటే వైరా నియోజకవర్గంలోనే నాకు ఎక్కువ మంది కుటుంబం ఉన్నదని అన్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఈ ఆత్మీయ సమ్మేళ్ళనానికి హాజరైన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కారిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమం లో బానోత్ విజయభాయి, బొర్రా రాజశేఖర్, సూతకాని జయపాల్, ధార్నా రాజశేఖర్, గోసు మధు, మిట్టపల్లి నాగి, గుమ్మా రోశయ్య, పరికపల్లి శ్రీనివాస్, రాయల పుల్లయ్య, సురేష్, వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఆకట్టుకోలేక పోయిన బానోత్ విజయభాయి ప్రసంగం.వైరా కేంద్రంగా పొంగులేటి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళ్ళనంలో పొంగులేటి వర్గం తరపున ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ విజయభాయి ప్రసంగం జనాలని ఆకట్టుకోలేకపోయిందనే వార్తలు వినబడటం గమనార్హం.

## మతతత్వ బీజేపీ విధానాలను తిప్పికొట్టండి

- **సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్**



తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవనంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం వెగి నాటి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది ఈ యొక్క సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ పాల్గొని ప్రసంగించారు రమేష్ మాట్లాడుతూ ఈ దేశంలో సమైక్య జీవనం కొనసాగిస్తున్న ప్రజల మధ్యలో కుల మతాలు చిచ్చులేపి ప్రజల మధ్యలో సృష్టిస్తుందని అట్లాంటి బిజెపి పార్టీని తెలంగాణ నుంచి తరిమికొట్టాలని మతతత్వ చర్యలను సామాజిక ఉద్యమకారులు మేధావులు అందరూ యొక్క చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దేశంలో బిజెపి పాలిస్తున్న రాష్ట్రాలలో దళితులు గిరిజనులు మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని దేవుడు పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ప్రజల సమస్యలు పరిష్కరించడంలో బిజెపి రాష్ట్రాలలో వెనుకబ ఆయన అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పద్మ నాభుల సుధాకర్ తుళ్లూరు నాగేశ్వరరావు అంగిరేకుల నరసయ్య వశపొంగు వీరన్న బింగి రమేష్ కొత్తపల్లి వెంకన్న దాసరి మహేందర్ తంగేళ్ల రమేస్ కోట ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు

## మంత్రి పువ్వాడను కలిసిన దమ్మపేట సొసైటీ చైర్మన్



దమ్మపేట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్) : దమ్మపేట సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు బుధవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో ముషిబండ గ్రామ పంచాయితీ సర్పంచ్ బత్తిన తిరుపతిరావు, వేపురి సురేష్, కేవీ, కుకలకుంట రవి, బండారుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

# సేవాలాల్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- **దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం**
- **ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో డాక్టర్ పాపాలాల్**





ఖమ్మం, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): బంజారాల్లో సామాజిక, సాంస్క ృతిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని, దేశ భక్తిని నింపిన సంత్ సేవాలాల్ మహరాజ్ సేవలు మనందరికీ ఆదర్శనీయం..స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఖమ్మం నగర మాజీ మేయర్ డాక్టర్ పాపాలాల్ పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి సందర్భంగా ఖమ్మం ఎంపీ నామ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సేవాలాల్ కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపాలాల్ మాట్లాడుతూ ఆయనలోని పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బ్రహ్మ చర్య దీక్షలో ఉంటూ బంధాలకు దూరంగా ఉంటూ జాతి జనుల కోసం తన జీవితాన్ని అర్పించి, దేశానికి చేసిన సేవలు ఎంతో చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సేవాలాల్ కలలు గన్న తండా రాజ్యాన్ని సీఎం కేసీఆర్ నిజం చేశారన్నారు. తండాలను పంచాయతీలుగా మార్చి, తండాల అభివృద్ధికి, వారి సంస్క ృతిని పరిరక్షించడం జరిగిందని తెలిపారు. బంజారాల ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు లభించిందనడానికి ప్రభుత్వమే జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఉదాహరణగా పేర్కొన్నారు. బంజారాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బ్రిటీష్ అరాచకాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా బంజారా జాతినంతటిని ఏకం చేసిన గొప్ప పోరాట పటిమ గల నాయకుడు సేవాలాల్ అని పాపాలాల్ కొనియాడారు. పరాయి పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరుడిగా, సంఘ సంస్కర్తగా ప్రజల హృదయాల్లో సజీవంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. బంజారాలందర్నీ ఒక్క తాటిమీదకు తీసుకొచ్చి, ఉద్యమించారన్నారు. బంజారా సమాజాన్ని గురు వ్యవస్థ ద్వారా దేశ భక్తులుగా, సంస్క ృతి పరిరక్షకులుగా తయారు చేసిన ఘనత సంత్ సేవాలాల్ కు దక్కుతుందని డాక్టర్ పాపాలాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఎంపీ క్యాంప్ కార్యాలయం ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, పార్టీ వైరా, తిరుమలాయపాలెం మండలాల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, బాశబోయిన వీరన్న, ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య కొణిజర్ల సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, పార్టీ నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్, ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ ఎం. శ్రీనివాసరావు, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు మంకెన రమేష్, రావినూతల సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్,చింతకాని మండలం కోమట్లగూడెం మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి బాబురెడ్డి, పార్టీ నాగులవంచ గ్రామ శాఖ అధ్యక్షులు శిలివేరు సైదులు, పెద్దబీరవల్లి గ్రామ శాఖ కార్యదర్శి రెడ్డిబోయిన ఉద్దండు, రఘునాథపాలెం మండల నాయకులు ప్రొద్దుటూరు కోటిరెడ్డి, సోషల్ మీడియా మధిర నియోజకవర్గ ఇన్చార్జి తాళ్ళూరి హరీశ్, నామ సేవా సమితి నాయకులు రేగళ్ల కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం కొత్తగూడెం

### ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన అశ్వారావుపేట తహసీల్దార్ విల్సన్



దమ్మపేట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): అశ్వారావుపేట తహసీల్దార్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన విల్సన్ బుధవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మండలంలోని పలు విషయాలపై ఇరువురు చర్చించారు. అలాగే గుర్రాలచెరువు గ్రామ ప్రజలు రేషన్ తీసుకోవడం కోసం అశ్వారావుపేట రావాల్సి వస్తుండటంతో గుర్రాలచెరువులో రేషన్ అందించేలా ఏర్పాటు చేయాలని సూచించారు.

### ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ



దమ్మపేట, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): అశ్వారావుపేట నియో జకవర్గం అన్నపురెడి ్డపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శాహీన బుధవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎస్ఐ శాహీన బొకే అందజేశారు.

### ఘనంగా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం



దమ్మపేట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేటలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈరోజు ఐ.సి.డి.ఎస్ దమ్మపేట ప్రాజెక్ట్ పరిధిలోని కొత్తపేట1 సెంటరు నందు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమం సందర్భంగా సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను పిల్లల ఎదుగుదలకు వారిలో రోగనిరోధక శక్తి పెరగడానికి తల్లిపాలు ఏ విధంగా ఉపయోగపడతాయి ఆమె తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బి. శ్రీదేవి డాక్టర్ మాధురి హెల్త్ సూపర్వైజర్ రామారావు అంగన్వాడీ టీచర్లు మరియు తల్లులు హాజరైనారు

### ప్రతి గ్రామపంచాయతీకి 50 మంది కూలీలు తగ్గకుండా వచ్చేలా చూడాలి

- **డీఆర్డీఓ మధుసూదన్ రాజు**



పాల్వంచ టౌన్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): ప్రతి గ్రామ పంచాయతీకి 50 మంది కూలీలు తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని డిఆర్డిఓ మధుసూదన్ రాజు గారు కోరారు.ఈరోజు పాల్వంచ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది,గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబ వంద రోజులు పూర్తి చేసుకునేలా చూడాలని,కూలీలు కనీసం 6 గంటలు పని చేసి 257 రూపాయలు వేతనం అందేలా పని చేయించాలని,ఉదయం మధ్యాహ్నం ఆన్లైన్లో హాజరు పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, ఎంపీఓ నారాయణ,ఏపీవో ఫోరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య,గ్రామపంచాయతీ కార్యదర్శులు,క్షేత్ర సహాయకులు,సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన కొత్తపేట కాలనీ యువకులు



దమ్మపేట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): అశ్వారావుపేట (నియోజకవర్గం), దమ్మపేట మండల కేంద్రంలోని కొత్తపేట కాలనీ యువకులు అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును వారి నివాసమైన తాటిసుబ్బన్నగూడెం(గ్రామం),లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వీధిలో ఉన్న పలు సమస్యలు పై ఎమ్మెల్యేకు వివరించారు. కొత్తపేట కాలనీలో డ్రైనేజీలు లేక వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుండి వరద నీరు వస్తున్నాడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీధిలో డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కి వినతి అందజేయగా ,వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అదే సమయంలో అక్కడే ఉన్న పంచాయతీరాజ్ అధికారులను కొత్తపేట డ్రైన్స్ ఎస్టిమేషన్ వేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోపికృష్ణ, యార్లగడ్డ హరిబాబు, బొమ్మగాని చెన్నారావు, ఎడవల్లి సాయి, కేత వెంకన్న, సిద్దు, దండి వేణు, తొంటెపు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలిగా మారిన అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



ఇల్లందకుంట, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఉపాధ్యాయురాలిగా అవతారమెత్తి విద్యార్థులకు బోధన చేశారు. బుధవారం జిల్లాలోని ఇల్లందకుంట మండలం మల్యాల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమ పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆమె విద్యార్థులతో ముచ్చటించి, సమయపాలనపై విద్యార్థిని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో కూలంకషంగా బోధించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న వివిధ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలనికాంట్రాక్టరునుఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.గ్రామసర్పంచ్గురుకుంట్ల సాంబయ్య, కాంట్రాక్టర్ స్వామి, గ్రామ ప్రజా ప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్.జనార్ధన్ రావు, ఎంపివో వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, జిల్లా సెక్టోరల్ అధికారి ఆంజనేయులు, అసిస్టెంట్ ఇంజనీర్ రాంబాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజేందర్ రెడ్డి, రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టార్ కల్చరల్ -2023 కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల భయం పోయి మరింత పై స్థాయి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు క్రమశిక్షణ ఉంటుందని, రంగోలి, క్విజ్, ఉపన్యాస, గ్రూప్ డాన్స్, సోలో డాన్స్ ఇతర క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. స్టార్ కల్చరల్ కార్యక్రమంలో జిల్లాలోని 16 ఆశ్రమ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, డిసిడిఓ శకుంతల, ఏటిడిఓ క్షేత్రయ్య, ఆశ్రమపాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,సంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనం కథనానికి స్పందన
## కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు







మెట్ పల్లి, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): ' ఈ కారు కథేంటి..?' శీర్షికన ఇటీవల మనం దినపత్రిక ప్రచురించిన కథనానికి పోలీసుల నుంచి స్పందన వచ్చింది. నేషనల్ హ్యూమన్ రైట్ కమిషన్ స్టిక్కర్‌తో మెట్ పల్లి పట్టణంలో తిరుగుతోన్న కారు విషయమై మనం కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. దీనికి స్పందించిన పోలీసులు విచారణ చేపట్టి కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్యామ్‌రాజ్ 'మనం'తో మాట్లాడుతూ మనం దినపత్రికలో ప్రచురించిన కథనాన్ని చూసిన అనంతరం కారు పూర్వాపరాలు తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు నేషనల్ హ్యూమన్ రైట్ కమిషన్ స్టిక్కర్‌తో ఉన్న ఎపి29 బికె 7593 నంబరు గల కారును బస్టాండ్ సమీపంలో స్వాధీనం చేసుకుని విచారణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కారు గతంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులదని, వారి స్వాధీనంలో ఉన్న సమయంలో హ్యూమన్ రైట్స్ స్టిక్కర్‌తో కారును వినియోగించారని తెలిపారు. అనంతరం ఈ కారును తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వారికి విక్రయించగా, వారి వద్ద నుండి మాజీ హోంగార్డు గంగా దాస్ వాడుకుంటున్నట్లు తెలిపారు. కారుకు సంబంధించిన సరైన రిజిస్ట్రేషన్ పేపర్లు చూపకపోవడంతో కారు వివరాల కోసం కోరుట్ల ఎంవిఐని సంప్రదించినట్లు ఎస్సై వివరించారు. రవాణా శాఖ నుంచి వచ్చే సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్....

- జిల్లా కలెక్టర్ కె.శశాంక



మహబూబాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి) : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ అని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు.బుధవారంనాడు జిల్లా కలెక్టరేట్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను కలెక్టర్ శశాంక ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ 284 జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 283 సంవత్సరాల నుండి వ్యక్తి జయంతిని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామంటే ఆ వ్యక్తి యొక్క విశిష్టతను తెలియజేస్తుందని, ఒక ఊరి నుండి మరొక ఊరుకు బంజారా జాతి ఊర్లు వలస వెళ్లే పరిస్థితుల్లో వారి జీవన శైలిని క్రమపద్ధతిలో పెట్టిన మహోన్నత వ్యక్తి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ అని, ప్రభుత్వం గుర్తించి అధికారికంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించుకోవడం ఆయన జీవిత సారాంశాన్ని ఎక్కువ మందికి వారి విలువలు, స్ఫూర్తిని అందించడం, ఇతరులకు తెలియజెప్పాలని ఏ జాతి అయిన విలువల కోసం తపించే మహనీయులను స్మరించుకుని ఆవశ్యకత ఉందని కలెక్టర్ అన్నారు.

## పచ్చని మొక్కలతో ఆహ్లాద వాతావరణంలో
# నూతన కలెక్టరేట్ ప్రాంగణం ఉండాలి

- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: నాగర్‌కర్నూల్ జిల్లా నూతన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్లో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం చుట్టూ పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపించేలా పండ్లు, పూలు మరియు ఆహ్లాదంగా కనిపించే మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రారంభం నుండి దారులకు ఇరువైపులా ఎక్కడా గ్యాప్ లేకుండా బ్రహ్మాండంగా మొక్కలు నాటాలని చెప్పారు. మీడియన్ ప్లాంటేషన్లో అందమైన మల్టీపర్పస్ మొక్కలను నాటాలని వారంలో ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని చెప్పారు. ఆరు అడుగులు ఎత్తున్న మొక్కలు నాటడం వల్ల. మొక్కల సంరక్షణ బావుంటుందని, మంచి ఏపుగా పెరుగుతాయని చెప్పారు. జిల్లాకు కలెక్టరేట్ ఐకాన్ కావాలని ఆయన స్పష్టం చేశారు. ప్రాంగణంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన రహదారి నుండి కలెక్టరేట్ చుట్టుపక్కల మూడు విడతల వరుసల్లో మొక్కలు నాటాలని చెప్పారు. కలెక్టరేట్ మొత్తం పచ్చదనంతో కళకళలాడాలని, ఆదర్శంగా నిలవాలని చెప్పారు. మొక్కల విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. మొక్కలను సంరక్షించేందుకు కలెక్టరేట్ చుట్టూ డ్రిప్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. ఏ రకమైన మొక్కలను ఎక్కడ నాటాలో చూడాలని ఆయనను ఆదేశించారు. ఇదివరకే నాటిన మొక్కల్లో కొన్ని మొక్కలు చనిపోయాయని వాటి స్థానంలో నూతనంగా పెద్ద మొక్కలను నాటాలని ఆదేశించారు. భవన ప్రారంభం నాటి రోజుకు పచ్చదనం ఆహ్లాదకరంగా కనిపించేలా రకరకాల మొక్కలు కనబడాలన్నారు. కార్యాలయ గ్రౌండ్ ఫ్లోర్ లో కలెక్టరేట్ చాంబర్, మొదటి అంతస్తులో మంత్రి చాంబర్ మూడవ ఫ్లోర్లు భవనంలోని శాఖల అధికారుల చాంబర్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. శాఖల వారిగా చాంబర్లను కేటాయించేందుకు ఆయా శాఖల ఉద్యోగస్తుల సంఖ్యను ఇదివరకే అడిగినట్లు చెప్పారు. హెలిపాడ్ పక్కలా ఉన్న ఖాళీ స్థలంలో పండ్ల మొక్కలను నాటాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి ఎస్సి నర్సింగమ్, ఆర్ అండ్ బి ఈఈ భాస్కర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర రావు, ఈఈపీఆర్ దామోదర్ రావు, ఆర్ అండ్ బి డిఈ రమాదేవి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి...

- కలెక్టర్ శశాంక



మహబూబాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): ఇంటర్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి అధ్యక్షతన కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల పరీక్షలకు 19 థియరీ, 44 ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 3745 మంది జనరల్ కాగా, 8230 ప్రాక్టికల్స్ కు హాజరవుతున్నట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి కలెక్టర్ కు వివరించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుండి ప్రాక్టికల్స్ ఉదయం 9గంటలనుండి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుండి 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కు ఇంటర్ విద్యాధికారి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మార్చ్ 15వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీవరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలకు అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు.ఆర్టీసీ అధికారులు బస్ లను సకాలంలో నడపాలని, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు శానిటేషన్ చేపట్టాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. వైద్య శాఖ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షిస్తుంద న్నారు.12 పోలీస్ స్టేషన్ పరిధిలో 12 రూట్ లకు పోలీస్ శాఖ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా సిబ్బందితో ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు అందించడం, జవాబుపత్రాలు ప్యాకింగ్ పటిష్టంగా సిసి కెమెరాల పర్యవేక్షణలో చేపట్టాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని, ఇన్విజిలేటర్స్ అదనంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్ ఇంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ విద్యాశాఖ అధికారి రామారావు విద్యుత్ శాఖ అధికారి నరేష్ పంచాయతీ అధికారి ధన్ సింగ్ పోస్టల్ సూపర్డెంట్ రామచందర్ ఆర్టీసీ సూపర్డెంట్ ఎండి అజీముద్దిన్, పోలీస్ శాఖ వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు కలిగిన నియంత్రిత సంస్థల నుండి మాత్రమే ప్రజలు రుణాలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి) : ప్రజలు గుర్తింపు కలిగిన నియంత్రిత సంస్థల నుండి మాత్రమే రుణాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడివోసీ, కలెక్టర్ చాంబర్ లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారిచే ప్రజాహితం కోసం జారీ చేయబడిన వాల్ పోస్టర్ లను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పొదుపు పాటించాలని, ఏవైనా కొనుగోలు చేసే ముందు ప్రణాళిక అవసరమని చెప్పారు. అవసరం మేరకు మాత్రమే ఖర్చు చేయాలని, పొదుపు చేసే అలవాటు చేసుకోవడం వల్ల ఆర్థిక ఇబ్బందుల బారిన పడకుండా ఉండగలమని చెప్పారు. ప్రతి ఒక్కరు సంపాదనలో కొంత భాగాన్ని భవిష్యత్ అవసరాలకు కేటాయించాలని తెలిపారు. ప్రస్తుతం అధికమవుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆన్లైన్లో ఋణాలు అందించే మొబైల్ యాప్ ల తో అప్రమత్తంగా ఉండాలని ఉండాలని చెప్పారు. సమాచారం కోసం వినియోగించే నంబర్ ను బ్యాంక్ అధికారిక వెబ్సైట్ నుండి పొందాలని, ఓ.టి.పి., సి.వి.వి., పాస్వర్డ్, పిన్, బ్యాంక్ ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని చెప్పారు. గోప్యత పాటించాలని చెప్పారు. డిజిటల్ సేవలు సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉన్నా కూడా వాటి వినియోగంలో మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని నియంత్రిత ఋణ సంస్థల నుండి మాత్రమే ఋణాలు తీసుకోవాలని, ఋణం తీసుకునే ముందు నియమ, నిబంధనలపై సమగ్ర అవగాహన ఉండాలని చెప్పారు. చెల్లించాల్సిన వడ్డీ, ఇతర వివరాలను తెలుసుకోవాలని, మొబైల్లో వ్యక్తిగత సమాచారాన్ని ఎవరైనా వాడేందుకు అనుమతించే ముందు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డీయం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు దిగ్విజయంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



భువనగిరి, ఫిబ్రవరి 15(మనం న్యూస్): శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను దిగ్విజయంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కాన్ఫరెన్సుహాలులో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల నిర్వహణకు గాను సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ బోధించిన ధర్మ బోధనలు, ఆశయాలు ప్రజలందరికి తెలియాలని, రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నదని, దానిలో భాగంగానే జయంతి వేడుకల నిర్వహణకు సంబంధజంచి శాసనసభ్యులు చైర్మన్‌లుగా నియోజకవర్గస్థాయి కమిటీలను నియమించడం జరిగిందని, భువనగిరి నియోజకవర్గానికి జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి మాన్యానాయక్, ఆలేరు నియోజకవర్గానికి జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, కన్వీనర్‌లుగా నియమించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి వేడుకల ద్వారా సంత్ సేవాలాల్ బోధించిన ఆలోచనలు, ఆశయాలు, ప్రభోదాలు ప్రజలందరికి తెలియాలని అందుకోసం సేవాలాల్ కమిటీలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వేడుకలు దిగ్విజయంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సిహెచ్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ఇంచార్జీ గిరిజన సంక్షేమ అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి భుక్యామాన్యా, జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, ఎస్‌సి కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, జిల్లా ఎస్‌సి అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, తహశీల్ధార్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి, మోతీలాల్ స్థపతి అధికారులు పాల్గొన్నారు.

# వైకుంఠధామాల పనులను పరిశీలించిన కలెక్టర్



సూర్యాపేట, ఫిబ్రవరి 15 మనం ప్రతినిధి: అత్యాధునిక వసతులతో పట్టణంలోని సద్దల చెరువు సమీపంలో నిర్మిస్తున్న వైకుంఠ దామ పనులను బుధవారం కలెక్టర్ ఎస్ వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... దీనిలో మొక్కలను పెంచి ప్రజలకు ఆహ్లాద వాతావరణం కల్పించాలని సూచించారు. వైకుంఠ దామం ఎంట్రెన్స్ ప్లాజా సుందరంగా ఉండాలని, దీనిలో నిర్మిస్తున్న శివుని విగ్రహాన్ని, కోల్డ్‌స్టోరేజ్, టాయిలెట్స్, దింపుడుగాలం, పూజా మండపం, అంతర్గత రోడ్లు, విద్యుత్, క్రిమిటోరియం పనులను ఆయన పరిశీలించి త్వరతగతిన పూర్తి చేయాలని కమిషనర్ రామాంజుల రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ హేమంత్ కేశవ్, మున్సిపల్ డీఈ దుర్గ ప్రసాద్, సంపత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



వనపర్తి, ఫిబ్రవరి 15, మనం ప్రతినిధి: వనపర్తి జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఎన్నికల నియమావళి అమలుపై నోడల్ అధికారులు, ఎంసీఎంసీ టీమ్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, అకౌంటింగ్ టీం, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలియన్స్, స్టాటస్థికల్ సర్వైలియన్స్, మీడియా మేనేజింగ్ బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలియన్స్, స్టాటస్థికల్ సర్వైలియన్స్ ప్రధాన భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలో పోటీచేసే అభ్యర్థులు కానీ వారి ప్రతినిధులు నిర్వహించే సమావేశాలను నిశితంగా పరిశీలించాలని సంబందించిన వీడియోలు క్లిప్పింగ్ లు అకౌంట్ టీములకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రలోభాలకు గురిచేసే పరిస్థితులను గుర్తించాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలియన్స్, స్టాటస్థికల్ సర్వైలియన్స్ టీములు సమన్వయంతో పనిచేయాలని షాడో టీమ్‌ల మాదిరి సమాచార సేకరణ ఉండాలని సూచించారు. సి-విజిల్‌ద్వారాఅందే పిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాకు సంబంధించిన అన్ని చెక్ పోస్టుల వద్ద 24 గంటల తనిఖీ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని, డబ్బు రవాణా, లిక్కర్, ఇతర బహుమతులు వంటి వాటికి లేకుండా పటిష్టంగా నిఘా ఉంచాలని ఆదేశించారు. మండల స్థాయి ఎంసీసీ టీములు నివేదికలు ఎప్పటికప్పుడు అందించాలని అలాగే ఎన్నికల విధుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్‌శాఖ అక్రమ మద్యం రవాణా తనిఖీలు చేయాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 1 వరకు రిపోర్టు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేయబడినవి 08545 233525. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్‌డీవో పద్మావతీ, నోడల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువ నీరు వదులక రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు

- సాగునీరు కోసం రెండు గ్రామాల మధ్య పోరు...
- దేవుడు వరమిస్తే పూజారి అడ్డుకున్నటుంది.. అధికారుల తీరు ....



వీణవంక,ఫిబ్రవరి 15 (మనంన్యూస్) : మండలంలోని ఎలుబాక గ్రామంనుండి డిబిఎం-6 ఉప కాలువ ద్వారా కిష్టంపేట గ్రామం మీదుగా రెండు పాయలుగా దేశాయిపల్లి,కోర్కల్,నర్సింహులపల్లి గ్రామాలకు , మరో కాలువ ద్వారా సాగునీరు అచ్చంపల్లి,హిమ్మత్‌నగర్, శ్రీరాములపేట, కొండపాక గ్రామాల వరకు రైతులకు అందుతుంది. ప్రతి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నీరుగారుస్తున్నారు. లక్షలాది రూపాయలు వేతనాలు పొందుతూ సకాలంలో సాగునీరు ఇవ్వక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము వేసిన పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి దాపురించిందని వాపోయారు. మంగళవారం కోర్కల్ గ్రామ రైతులు తాము వేసిన పంటలకు నీరు అందాలనే ఉద్దేశ్యంతో అచ్చంపల్లి వైపు వెళ్లే కాలువకు అడ్డుకట్ట వేయడంతో అక్కడే ఉన్న కిష్టంపేట గ్రామ రైతులు అడ్డుకోవడంతో ఇరుగ్రామాల రైతుల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇదంతా తెలిసిన కూడా కాలువలపై పర్యవేక్షించే అధికారులు ,పర్యవేక్షకుడు పొన్నాల లక్ష్మయ్య మాకెందుకులే అనే ధోరణిలో విధులు నిర్వర్తించకుండా కాలయాపన చేస్తున్నారు . సాగునీరు విడుదల చేయాలని రైతులు అడిగినందుకు లక్ష్మయ్య రైతులపై ఆగ్రహం వ్యక్తం చేశారని రైతులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

## రవి చిన్న పిల్లల ప్రైవేట్ హాస్పిటల్ దోపిడీలో మరోక గిరిజన బాలిక బలి...?..!



మహబూబ్ నగర్, ఫిబ్రవరి 15, మనం న్యూస్: అత్యాధునిక పరికరా లు, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణ లోనే అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రవి చిన్న పిల్లల హాస్పిటల్‌లో నిరుపేద ఎరుకల, గిరిజన కుటుంబానికి చెందిన జగన్ మోహన్ కూతురు మైత్రి (13) తల నొప్పితో హాస్పిటల్ కు వెళ్ళగా నిమిత్తం ఐసీయులో చేర్చుకుని ట్రీట్ మెంట్ చేయడం జరిగింది. గతంలో కూడా ఈదే ప్రాబ్లం ఉంటే వేరే హాస్పిటల్ లో ఐసీయులో చేర్చుకోకుండా జనరల్ వార్డ్‌లో ట్రీట్‌మెంట్ చేయడం జరిగింది. మంచిగా అయ్యింది కానీ ఈ రవి చిన్న పిల్లల హాస్పిటల్ ధనార్జన కోసం ఐసీయులో చేర్చుకుని, సరిగా చూడకుండా, నిండు పసి ప్రాణాన్ని నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు పొన్నకల్ ఎల్సారి కృష్ణయ్య ఏకలవ్య అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్లనే మన ఎస్ సి/ఎస్ టి, అణగారిన వర్గాల ప్రజలు చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ, రాజకీయంగా ఎదుగుతూ, హాస్పిటల్ లు పెట్టుకుని, ఆర్థికంగా ఎదిగి తిరిగి మన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించే పని చేయకుండా వచ్చిన రోగుల దగ్గర అందిన కాడికి దోచుకుని వారి నిర్లక్ష్యం వల్ల ప్రాణాల మీదకు వచ్చే సరికి తీసుకుపోమ్మన్ని చెప్పి ప్రాణాలు హారించడం ఎంత వరకు సమంజసం అని ప్రతి ఒక్క మనిషి ఆలోచించ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దాదాపు రెండు లక్షల రూపాయలు నిరుపేద ఎరుకల గిరిజన కుటుంబానికి చెందిన మైత్రి కుటుంబం దగ్గర వసూలు చేసి పాప ప్రాణం పోవడానికి కారణం అయిన రవి చిన్న పిల్లల హాస్పిటల్ పైన వెంటనే కేసు నమోదు చేసి హాస్పిటల్ యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం జరిగే మానవ హక్కుల కమిషన్ కు, జిల్లా మంత్రి వర్యులు వి శ్రీనివాస్ గౌడ్ కు, జిల్లా కలెక్టర్, డి ఎం ఎచ్ ఓ లకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా సేవాలాల్ 284వ జయంతి వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): సంత్ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శనిగపురం ఆలయ కమిటీ వారు బుధవారం శనిగపురం సేవాలాల్ గుడి వద్ద ఘనంగా సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు కార్యక్రమం నిర్వహించారు సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని అలాగే జయంతి నిధులు దుర్వినియోగం కాకుండా అందరికీ చేరేలా వెంటనే విడుదల చేయాలని, సేవాలాల్ మహారాజ్ కారణజన్ముడని జాతిని ఏకం చేయాలని తపన బోనిన గొప్ప మహానుభావుడని కొనియాడారు నూతనంగా నిర్మిస్తున్న గుడికి అందరూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినందుకు వారికి పేరుపేరునా వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు అలాగే వచ్చే సంవత్సరం నాటికి గుడి పూర్తి చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు అలాగే సేవాలాల్ జయంతిని ప్రతి తండాలో ప్రతి బంజారా బిడ్డ ఇంటి ముందు అందరు కూడా జయంతి వేడుకలు నిర్వహించి జాతి



ఔన్నత్యాన్ని ఉన్నతిని చాటాలని పిలుపునిచ్చారు ప్రభుత్వం కోటి రూపాయలు నిధులు కాకుండా ఐదు కోట్లు నిధులు కేటాయించాలని జయంతిని సెలవుదినంగా ప్రకటించకపోతే దశలవారీగా ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన హరినాయక్ 50 వేలు, నెహ్రూ నాయక్ 50 వేలు, శనిగపురం గ్రామ పెద్దలు కమ్లు నాయక్ 1,16000 తమ వంతు విరాళంగా గుడిని అభివృద్ధి చేయడానికి ప్రకటించారు ఈ కార్యక్రమంలో మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ నెహ్రూ, డాక్టర్ మురళి, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతిలాల్, శనిగాపురం మాజీ సర్పంచ్ గుగులోతు రాజు, తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ హరి సింగ్ ,పదో వార్డ్ కౌన్సిలర్ శీను, మాజీ సర్పంచ్ ఎలదండి వెంకటరెడ్డి, తోట మల్లయ్య,బొమ్మ రాజ్ కుమార్ స్వామి, బిక్షం, రాము, బావసింగ్, కరుణావత్ వెంకన్న, వీరన్న మాజీ కౌన్సిలర్ లక్ష్మీ, దేవి, మురళీధర్ రెడ్డి, మారని వెంకన్న, చిట్టి మల్ల శీను వెంకటాద్రి రవీందర్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు హనుమ నాయక్ జిల్లా అధ్యక్షులు గుగులోతునందులాల్ నాయక్ నాయకులు సురేష్ నాయక్ రాంబాబు నాయక్ దిలీప్ నాయక్ రెడ్డి నాయక్ పద్మాబాయి గ్రామ పెద్దలు తండా పెద్దలు మహిళలు చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొని మహారాజ్ ఆశీస్సులు పొందారు.

## అంగరంగ వైభవంగా వేట వెంకటేశ్వర స్వామి ముఖద్వారం మండపంల ప్రారంభోత్సవం

గార్ల, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): మండల పరిధిలోని మర్రిగూడెం సమీపంలో వెలసిన వేట వెంకటేశ్వర స్వామి ఆలయ పున నిర్మాణంలో భాగంగా నిర్మించిన ఆలయ ముఖ ద్వారం మండపాలను ఇల్లందు శాసన సభ్యురాలు భాను హరిప్రియ హరి సింగ్ నాయక్ ఘనంగా ప్రారంభించారు మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పులి గోపాల్ రెడ్డి ప్రమీల రెడ్డి దంపతులు ఆలయ పునరుద్ధరణకు ఒక కోటి 25 లక్షలు ఇచ్చినందుకు ఎమ్మెల్యే హరిప్రియ అభినందించారు అనంతరం ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి కళ్యాణ మహోత్సవాన్ని కండ్లరా తిలకించారు అక్కడికి వచ్చిన భక్తుల కు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా మహబాద్ జిల్లా జడ్పీ చైర్పర్సన్ ఆంగోత్ బిందు,ఎంపిపి మూడు శివాజీ చౌహాన్, జడ్పిటిసి జాటోత్ ఝాన్సీ లక్ష్మీబాయి, దేవాదయ శాఖ ఇన్స్పెక్టర్ నందనపు కవిత, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, రైతుబంధు సమితి అధ్యక్షులు పానుగంటి రాధాకృష్ణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు శీలంశెట్టి రమేష్, సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య మోతిలాల్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండి ఖదీర్ బాబా, శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బానోత్ అమర్ చంద్, మరియు కమిటీ సభ్యులు, రమేష్ బాబు, జిత్తు అగర్వాల్, శ్రీనివాస్ గుప్తా, మర్రిగూడెం సర్పంచ్ భూక్య బుజ్జి, గార్ల సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, పుల్లూరు సర్పంచ్ మాలోత్ జ్యోతి శంకర్ నాయక్, శేరిపురం సర్పంచ్ ధరావత్ సక్రు నాయక్, బాలాజీ తండా సర్పంచ్ రత్నావత్ శంకర్, మండల ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

గార్ల, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): మండల పరిధిలోకి పలు గ్రామాలలో ఇల్లందు శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియా హరిసింగ్ నాయక్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. బుధవారంనాడు ఉపాధి హామీ పథకం క్రింద పూసల తండ, మూడు తండ ,రాంపురం గ్రామాలలో మంజూరు అయిన సిసి రోడ్లకు ఎమ్మెల్యే హరిప్రియా జడ్పి చైర్ పర్సన్ ఆంగోత్ బిందులు శంకుస్థాపన చేశారు.అనంతరం పులిగుట్ట తండా వార్డు సభ్యులు బాదావత్ రజిత భర్త రామారావు ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికెళ్లి పరామర్శించే ఆర్థిక సహాయం అందజేశారు.టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, రైతుబంధు సమితి అధ్యక్షులు పానుగంటి రాధాకృష్ణ, ఎంపిటీసీల ఫోరం మండల అధ్యక్షులు శీలంశెట్టి రమేష్, సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య మోతిలాల్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండి ఖదీర్ బాబా, శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బానోత్ అమర్ చంద్, మర్రిగూడెం సర్పంచ్ భూక్య బుజ్జి, గార్ల సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, పుల్లూరు సర్పంచ్ మాలోత్ జ్యోతి శంకర్ నాయక్, శేరిపురం సర్పంచ్ ధరావత్ సక్రు నాయక్, బాలాజీ తండా సర్పంచ్ రత్నావత్ శంకర్, మండల ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతిని పురస్కరించుకొని గిరిజన సాధువులు బోగ్ బండారో ను అంగరంగ వైభవంగా నిర్వహించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.ఎద్దుల బండితో ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ గిరిజనులతో కలసి భారీ ఉరేగింపుగా శోభా యాత్ర నిర్వహించారు. జై సేవాలాల్ నామ స్మరణతో పట్టణ ప్రాంతాన్ని గిరిజనులు మారుమ్రోగించారు.ఈ ఊరేగింపులో గిరిజన సంప్రదాయ పాటలకు ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ దంపతులు నృత్యాలు చేసి ఆహూతులను విశేషంగా అలరించారు.ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ మాట్లాడుతూ... గిరిజనుల హృదయాల్లో కొలువుదీరిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజన సంస్కృతి సంప్రదాయాల తోపాటు తన తాత్విక చింతనతో సన్మార్గంలో నడవాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. దురాలవాట్లు మాని అహింసా మార్గంలో ధర్మంగా సత్ప్రవర్తనతో జీవించాలని బోధించిరన్నారు. వన్యప్రాణుల పట్ల కరుణ చూపి తోటి వారిపట్ల స్నేహపూర్వకంగా ఉండాలన్నారు.ఎమ్మెల్యే శంకర్ నాయక్ సతీమణి సీతమహాలక్ష్మి, ఎంపీపీ లు మౌనిక,చాంప్ల నాయక్ తదితరులు పాల్గొన్నారు

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడ, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ అంబరీష్ అన్నారు మండలంలోని పొగుళ్లపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు కంటి వెలుగు కార్యక్రమ తీరు తెన్నులపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పరీక్షల కోసం వచ్చేవారికి సరైన అవగాహన కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారుఈ కార్యక్రమంలో కంటి ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ కుసుమ సరిత పీహెచ్ సీ డాక్టర్ శివప్రసాద్ సూపర్ వైజర్ బోయిని బోయిని ఆంజనేయులు ఆప్తోమెట్రిస్ట్ దేవర శ్యామ్ డిఈఓ స్వామి హెల్త్ అసిస్టెంట్ శ్రవణ్ కుమార్ అరుణ విజయ ఏఎన్ఎం ప్రియాంక స్టాఫ్ నర్స్ ప్రీతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి సమస్యలకు త్వరలోనే పరిష్కారం

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 15, మనం న్యూస్ః దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో త్వరలోనే 24 గంటల పాటు మరిన్ని వైద్యసేవలు అందుబా టులోకి రానున్నాయని ఎమ్మెల్యే రఘునంద న్రావు పేర్కొన్నారు. బుధవారం రోజున ఆయన ప్రభుత్వాసుపత్రిని సందర్శించి ఆసుపత్రి వైద్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక ప్రభుత్వాసు పత్రిలో 24 గంటల పాటు సేవలందించడానికి గైనిక్, అనస్తీషియా వైద్యులు అందుబాటులో ఉన్నారని, త్వరలోనే మరింతమంది వైద్యులు, వైద్య సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య సదుపాయాలు, వైద్య సిబ్బంది నియామకం, వారి జీతాలు తదితర అంశాలపై పరిశీలించడానికి వైద్య విధాన పరిషత్ కమీషనర్ను ఆహ్వానించడం జరిగిందని, త్వరలోనే వారు ఆసుపత్రిని సంద ర్శించి ఆయా సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. అదేవిధంగా 30 పడకల ఆసుపత్రి నుండి 100 పడకల ఆసుపత్రిగా మారినందున ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులపై కూడా కమీషనర్తో చర్చించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో పెండింగ్లో ఉన్న ఎక్స్రే యూనిట్ సమస్యను డిసిహెచ్ పరిష్కరించారని తెలిపారు. త్వరలోనే ఆసుప త్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభించాల్సి ందిగా మంత్రిని కోరడం జరిగిందని, అతి త్వరలోనే దుబ్బాక ప్రాంత ప్రజలకు డయాలసిస్ సేవలు సైతం అందుబాటులో రానున్నాయని ఆయన తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో మందుల నిలువలను జాగ్రత్తగా కాపాడడానికి కేఎన్ఆర్ ట్రస్టు తరుపున కిష్టమ్మగారి సుభాష్రెడ్డి ముందుకు వచ్చి రిఫ్రిజరేటర్ అందించడం అభినందనీయమ న్నారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ ట్రస్టును, వారి సేవలను ఆసుపత్రి తరుపున అభినందిస్తున్నామన్నారు. అనంతరం దుబ్బాక మండల పరిధిలోని వెంకటగిరి తండాలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



## బంజారా ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్

గార్ల, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): బంజార జాతి ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియా అన్నారు. బుధవారంనాడు స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను ఎంపిపి మూడు శివాజీ చౌహాన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగ్ బండారు కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియా మాట్లాడుతూ ఏక్ జాత్, ఏక్ సాత్, ఏక్ గోర్, ఏక్ వాత్ అని సేవలాల్ మహారాజ్ నినాదమని, జనులందరూ ఒక్కటే, అందరం మనుషులమే, నీతి నిజాయితీగా, ద్వేషాలు లేకుండా, మనుషుల మధ్య తేడాలు వద్దు ప్రేమానురాగాలతో మెలగాలి, అందరికీ జ్ఞానాన్ని ప్రసాదించారు, మనుషుల మధ్య తారతమ్యాలు లేకుండా అందరూ కలిసిమెలిసి సోదర భావంతో జీవించాలి అని సేవలాల్ మహారాజ్ బోధించారన్నారని అన్నారు. ప్రజలు సిరి సంపదలతో పాడి పశువులు మరియు పంటలు బాగా పండాలని మహారాజ్ చెప్పేవారని ఇదే సేవాలాల్ మహారాజ్ గొప్పతనమని అని ఆమె అన్నారు.అనంతరం మహబూబాబాద్ జిల్లా జడ్పి చైర్ పర్సన్ ఆంగోత్ బిందు మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ బంజారా జాతి శ్రేయస్సు కొరకై పుట్టిన వారని వారి బోధనలు ఒక్క బంజారా జాతికే కాకుండా హిందూ సమాజ శ్రేయస్సుకు ఎంతో దోహదపడ్డాయని వారు చూపిన శాంతి, అహింస మార్గం అందరికి ఆదర్శనీయం అని వారి మార్గదర్శకత్వంలో నడచుకొని గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ ఆశయాల మేరకు గిరిజన జాతి ఔన్నత్యానికి తన వంతు కృషి చేస్తానన్నారు .సేవాలాల్ మహారాజ్ చెప్పినట్లుగా మగ, ఆడ అని తేడా లేకుండా బిడ్డలను చదివించి వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలని, మద్యం, మత్తు పదార్థలను వీడి, మూఢ నమ్మకాలను విడనాడాలని బంజారా జాతిని కాపాడుకోవాలని ఇది మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో గార్ల ఎంపీపీ శ్రీ మూడ్ శివాజీ చౌహాన్, గార్ల మండల భారత్ రాష్ట్ర సమితి అద్యక్షులు గంగవత్ లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ అజ్మీర బన్సిలాల్, ఎంపిటీసి శీలంశెట్టి రమేష్, తహశీల్దారు రాము, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు మోతిలాల్, బంజారా పూజారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గార్ల కమ్యూనిటీ ఆస్పత్రిపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

గార్ల, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిపై తప్పుడు ప్రచారం మానుకోవాలని ఓ పత్రికలో వచ్చిన తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక ఆసుపత్రిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న ఆర్ పద్మ తన ఎడమ తొంటిపై చీము గడ్డ కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిదని డాక్టర్ మహిరాజ్ చిన్నపాటి శాస్త్ర చికిత్స చేసి చీముగడ్డను తొలగించగా శాస్త్ర చికిత్స నిమిత్తం 5 రోజులపాటు ఐవి యాంటీబయటి ఇంజక్షన్ టెక్సీంమ్ తో పాటు డైక్లోఫినాక్ పెయిన్ కిల్లర్ ఇంజక్షన్, ఎసిడిటీకి ఫాంటాక్రోజోన్ ఇస్తూ డ్రస్సింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 14న డాక్టర్ హనుమంతరావును సంప్రదించగా బీపీ చూసి డ్రస్సింగ్ తో పాటు రోజు వేయాల్సిన ఇంజక్షన్లు వేయమని నర్స్ కు సిఫార్సు చేయగా ఇంజక్షన్ వేసిన కొద్దీ సేపటికి పద్మ స్పృహ తప్పినట్టు గ్రహించి బీపీ చూడగా 197/123 ఉండగా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఎండి శ్రీనివాస్, కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ లు పరీక్షించి నాలుక కింద నిప్రోగ్లిసెలిమ్ మాత్ర పెట్టి లాసిక్స్ ఇంజక్షన్ ఇవ్వగా ఆమె స్పృహలోకి వచ్చిందని మెరుగైన వైద్యం నిమిత్తం అంబులెన్స్ సహాయంతో ఆక్సిజన్ అందిస్తూ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. ఐతే విషయం తెలుసుకోకుండా ఓ పత్రికలో అసత్య ప్రచారాలు చేయడంపై సూపరింటెండెంట్ రాజేష్, డాక్టర్ హనుమంతరావు, నర్స్ రమలు మండిపడ్డారు. అసత్య ప్రచారాన్ని వారు ఖండించారు. పేషంట్ పద్మకు అసలు మత్తుమందు ఇవ్వనేలేదని, అమెతోపాటు మరో ముగ్గురికి మత్తుమందు ఇచ్చినట్టు అసత్య ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మత్తుమందు కేవలం ఆపరేషన్ కు మాత్రమే ఉపయోగిస్తారని ఆమెకు కేవలం పెయిన్ కిల్లర్, యాంటీబైటిక్, యాసిడిటి కి సంబంధించిన ఇంజక్షన్లు మాత్రమే ఇచ్చామని డాక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. పేషంట్ వయస్సు రిత్యా, నొప్పి కారణంగానే ఆమెకు బీపీ పెరిగిందని దాని కారణంగా ఆమెకు మైకం కమ్మి స్పృహ కోల్పోయిందని తెలిపారు. పేషంట్ కోమాలోకి వెళ్లలేదని ఆమె పరిస్థితి ప్రస్తుతం క్షేమంగానే ఉందని తెలిపారు.



# సిద్దిపేట

## రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం

- పరామర్శించిన మంత్రి హరీష్‌రావు



చిన్నకోడూరు, ఫిబ్రవరి 15, మనం న్యూస్ః కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని సింగరేణిలో ఉద్యోగం నిర్వహిస్తున్న అరవింద్ (31) హైదరాబాద్‌లో గృహప్రవేశం నిర్వహించుకొని మంచిర్యాలకు పయనమ్యాడు. ఇదే క్రమంలో ఇబ్రహీంనగర్ గ్రామ శివారులోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. కారు నడుపుతున్న అరవింద్ మృతి చెందగా తల్లి కవిత, భార్య నవ్య, అత్తమ్మ భారతి, పిల్లలు ఇమ్మాన్య, కవితాశ్రీలకు గాయాలయ్యాయి. ఇది గమనించిన గ్రామస్తులు క్షతగాత్రులను కారులో నుండి బయటకు తీస్తున్న తరుణంలో చిన్నకోడూరు నుండి ఇబ్రహీంనగర్ పాఠశాలకు వెళ్తున్న ఆటోను సిద్దిపేట నుండి కరీంనగర్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న విద్యార్థులు భానుప్రకాష్, అశోక్‌రెడ్డి, అంబికలకు తీవ్ర గాయాలయ్యాయి.

– మంత్రి పరామర్శ.. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను మంత్రి హరీష్‌రావు సిద్దిపేట జిల్లా ఆసుపత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, మంచి వైద్యాన్ని అందిస్తామని, అన్నింటికీ అండగా నేనుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

## సమాచార హక్కు చట్టం సామాన్యులకు వరం

కొండపాక, ఫిబ్రవరి 15, మనం న్యూస్ః సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఒక వరమని సిసిఆర్ సంస్థ సెంట్రల్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గుండ్ల శివచంద్రం, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ సాజిద్ పాషాలు తెలిపారు. బుధవారం కొండపాక మండల రెవెన్యూ కార్యాలయంలో వారు రికార్డులను పరిశీలించారు. సమాచారం హక్కు చట్టం ప్రకారం సంస్థ కోరిన సమాచారం మేరకు కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల తనిఖీలకు సిసిఆర్ సంస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్నామని, రికార్డుల తనిఖీకి అధికారులు బుధవారం అనుమతిచ్చినట్లు తెలిపారు. రికార్డులకు సంబంధించిన విషయాలను ఉన్నతాధికారులకు అందించనున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు గ్రామపంచాయతీలలో సంస్థ తరుపున రికార్డులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. పారదర్శక పాలనకోసమే సిసిఆర్ సంస్థ పాటుపడుతుందని, సమాచార హక్కు చట్టం సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజు, సురేందర్‌రెడ్డి, ఇల్యాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొన్నాల జన్మదిన వేడుకలు

చేర్యాల, ఫిబ్రవరి 15, మనం న్యూస్ః మాజీ టిపిసిసి అధ్యక్షులు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మ్య జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంగడి బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి స్వీట్లు పంచుకొని అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల అధ్యక్షులు ఆది శ్రీనివాస్, పార్టీ జిల్లా నాయకులు వకులాభరణం నర్సయ్య పంతులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో పొన్నాల లక్ష్మయ్య నేతృత్వంలో జనగామ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జనగామ నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కార్యకర్తలంతా ఇందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు, మున్సిపల్ కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేష్, ముస్త్యాల తార యాదగిరి, పిఏసిఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, కాటం శ్రీనివాస్, వెలుగల దుర్గయ్య, దాసరి శ్రీకాంత్, రమేష్, సుతారి రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్

దుబ్బాక, ఫిబ్రవరి 15, మనం న్యూస్ః దుబ్బాక ప్రభుత్వాసుపత్రి వైద్యులు మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించి ఔరా అనిపించుకున్నారు. దుబ్బాక పట్టణానికి చెందిన 97 ఏళ్ల వృద్ధుడు అమీర్ అలీ హైడ్రోసిల్, హెర్నియా వ్యాధితో కొద్ది సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాడు. చికిత్స కోసం ఎన్నో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినప్పటికీ వైద్యులు చికిత్స చేయడానికి విముఖత చూపారు. దీంతో దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించగా ఆసుపత్రి సూపరిండెంట్ డా. హేమరాజ్‌సింగ్ చికిత్స నిర్వహించడానికి ముందుకు వచ్చారు. బుధవారం రోజున డా. హేమరాజ్‌సింగ్ వైద్య బృందంతో కలిసి సుమారు గంట పాటు శ్రమించి 97 ఏళ్ల వృద్ధుడు అమీర్ అలీకి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. వృద్ధుడి కుటుంబీకులు వైద్య బృందాన్ని ప్రశంసించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గర్భిణీ స్త్రీలు ఆరోగ్యవంతంగా ఉండాలి

మరిపెడ, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): గర్భిణీ స్త్రీలు పండ్లు పాలు గుడ్లు ఇతర న్యూట్రిన్స్ పదార్థాలు తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని జిల్లా ప్రజా పరిషత్ ఉప నిర్వాణ అధికారి పూల నర్మద సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపీపీ గూగులోత్ అరుణ రాంబాబు, జెడ్పిటిసి సభ్యురాలు తేజవత్ శారద రవీందర్, డి డబ్ల్యు ఓ నర్మద లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేతుల మీదుగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ స్పాన్సర్ తో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిన్, పండ్లు పంపిణీ చేశారు. సమాజంలో స్త్రీలకు ఎదురవుతున్న సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. పుట్టబోయే బిడ్డ రక్తహీనత లోపంతో కాకుండా బలంగా ఉండాలని గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు పాటించాలని వారికి సూచించారు. మరిపెడ ఐసిడిఎస్ సి డి పి ఓ శిరీష, బాలవికాస సంస్థ ప్రోగ్రాం మేనేజర్ మంజుల రెడ్డి, మండల కోఆర్డినేటర్ అండ్ మరిపెడ మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ గంధసిరి ఉపేంద్ర లింగమూర్తి, మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు ఎం శ్రీలత, ఎల్ కవిత, జి రాణి, ఆర్ సుధా, ఎం విజయ, ఆర్ విజయ, విజయలక్ష్మి, నీరజ, పద్మ, అంగనవాడి టీచర్లు, గర్భిణీ స్త్రీలు, తదితరులు ఉన్నారు.

# సత్తా చాటిన భారత అమ్మాయిలు

- **టీ20 ప్రపంచ కప్‌లో వెస్టిండీస్‌పై విజయం**



న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో మన భారత అమ్మాయిలు అదరగొట్టేశారు. గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. వెస్టిండీస్ నిర్దేశించిన 119 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో భారత అమ్మాయిలు ఛేధించారు. షెఫాలీ వర్మ (28), హర్మన్ ప్రీత్ కౌర్ (33), రిచా ఘోష్ (44) పరుగులతో రాణించారు. తొలుత వెస్టిండీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ వేయడంతో.. భారత్ ఆశలు సన్నగిల్లాయి. కానీ, మన అమ్మాయిలు అంత సులభంగా ఓటమిని అంగీకరించలేదు. విండీస్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ.. ఫైనల్‌గా జట్టుని గెలిపించారు.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకున్న వెస్టిండీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. తొలుత కెప్టెన్ హేలీ మాథ్యూస్ వెంటనే ఔట్ అవ్వడంతో.. విండీస్‌కి గట్టి దెబ్బ తగిలినట్టయ్యింది. అయితే.. ఆ తర్వాత వచ్చిన క్యాంప్‌బెల్(30)తో కలిసి స్టెఫనీ టేలర్ జట్టుని ముందుకు నడిపించింది. వెంటనే మరో వికెట్ పడకుండా వీళ్లిద్దరూ ఆచితూచి ఆడుతూ.. స్కోర్ బోర్డుని ముందుకు తీసుకెళ్లారు. రెండో వికెట్‌కి ఈ ఇద్దరు 73 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. ఇక చివర్లో చెడియన్ (21), షబికా (15) పర్వాలేదనిపించడంతో.. వెస్టిండీస్ జట్టు గౌరవ ప్రదమైన స్కోరు చేయగలిగింది. భారత బౌలర్ల విషయానికొస్తే.. దీప్తి శర్మ మూడు వికెట్లు తీయగా, రేణుక సింగ్ పూజా వస్త్రాకర్ చెరో వికెట్ తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లలో దీప్తి శర్మ మూడు వికెట్లు తీయడంతో, అంతర్జాతీయ టీ20ల్లో వంద వికెట్ల మైలురాయిని అందుకుంది.

ఇక 119 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ శుభారంభమే చేసింది. షెఫాలి, స్మృతి కలిసి తొలి వికెట్‌కి 32 పరుగుల భాగస్వామ్యం జోడించారు. అయితే.. ఆ వెంటనే రెండు ఝలక్‌లు తగిలాయి. స్మృతి(10) ఔటైనా కాసేపటికే జెమిమా రోడ్రిగ్స్ (1) పెవిలియన్ చేరింది. దీంతో.. టీమిండియాపై ఒత్తిడి పెరిగింది. అప్పుడు హర్మన్ ప్రీత్ కౌర్ (33) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టుని ఆదుకోగా.. రిచా ఘోష్ (44) దుమ్ముదులిపేసి జట్టుని గెలుపు దిశగా పరుగులు పెట్టించింది. బ్యాటింగ్‌లో ఈ ఇద్దరు సమర్థవంతంగా రాణించడం వల్లే.. భారత్ విజయకేతనం ఎగరవేయగలిగింది. ఈ టోర్నీలో భారత్‌కి ఇది రెండో విజయం. ఇదివరకే పాకిస్తాన్‌పై టీమిండియా గెలుపొందిన విషయం తెలిసిందే!

## ఐసీసీ తప్పిదంతో అగ్రస్థానానికి టీమిండియా..

- **తప్పును సరిదిద్దడంతో తిరిగి నంబర్ 1కు ఆసీస్**



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో 6 గంటల పాటు టీమిండియా అగ్రస్థానం ప్రస్థానం కొనసాగింది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పొరపాటు కారణంగా భారత్ మూడు ఫార్మట్లలో నంబర్ వన్‌గా నిలిచింది. తప్పి దాన్ని సరిద్దిద్దిన ఐసీసీ.. తిరిగి ఆస్ట్రేలియాను అగ్రస్థానంలోకి తీసుకొచ్చి తమ అధికారిక వెబ్‌సెట్‌లో పేర్కొన్నది. బుధవారం ఐసీసీ తన వెబ్‌సైట్‌లో టెస్టుల్లో భారత్‌ను అత్యుత్తమ జట్టుగా చూపించింది. దాంతో అన్ని ఫార్మట్లలో టీమిండియా నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నది. అయితే, జరిగిన పొరపాటును గ్రహించిన ఐసీసీ.. 6 గంటల తర్వాత మళ్లీ కొత్త ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. దీనిలో టీమిండియా మళ్లీ రెండవ స్థానంలోని వచ్చింది. ఈ పొరపాటు ఎలా జరిగింది..? ఎందుకు జరిగింది..? ఎవరు చేశారు..? అనే విషయాలపై ఐసీసీ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. భారత్ ప్రస్తుతం టీ 20, వన్డేల్లో నంబర్ 1గా ఉన్నది. టెస్టుల్లో నంబర్ 2 స్థానంలో ఉన్నది. ర్యాంకింగ్‌లో ఆస్ట్రేలియా 126 పాయింట్లతో అగ్రస్థానంలో టీమిండియా 115 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ తదుపరి మ్యాచ్ ఎల్లుండి ఢిల్లీలో జరుగనున్నది. ఈ మ్యాచ్‌లో ఇండియా గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంటే.. అప్పుడు టీమిండియా నంబర్ 1గా మారుతుంది. అప్పుడు భారత్‌కు 121 పాయింట్లు, ఆస్ట్రేలియాకు 120 పాయింట్లు ఉంటాయి. ఈ ఏడాది జనవరి 18న కూడా ర్యాంకింగ్స్‌లో ఇదే పెద్ద తప్పు ఐసీసీ చేసింది. అయితే, ర్యాంకింగ్స్‌లో జరిగిన ప్రధాన లోపంపై ఐసీసీ అధికారిక ప్రకటన ఏదీ విడుదల చేయలేదు.

## ఆర్సీబీ కీలక నిర్ణయం..
## మహిళా జట్టుకు మెంటార్‌గా సానియా మీర్జా



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ తొలి టోర్నీకి రంగం సిద్ధమైపోయింది. ఇప్పటికే ఫ్రాంచైజీలు, ఆటగాళ్ల వేలం, ప్రసార హక్కుల బిడ్లు అన్నీ ముగిశాయి. ఇక మార్చి 4వ తేదీ నుంచి పోటీల సందడి మొదలు కానుంది. ఈ క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకొంది. తమ మహిళల జట్టుకు మెంటార్గా భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జాను నియమించింది. ఈ మేరకు ఆర్సీబీ తన ట్విటర్ ఖాతాలో ప్రకటించింది. ఇటీవలే సానియా తన ప్రొఫెషనల్ టెన్నిస్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.సానియాను మెంటార్‌గా నియమించడంపై ఆర్సీబీ హెడ్, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ వి మేనన్ స్పందించారు. ''ఆర్సీబీ మహిళా జట్టుకు సానియా మీర్జాను మెంటార్‌గా నియమించడం గర్వంగానూ, ఆనందంగానూ ఉంది. కష్టపడేతత్వంతో ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఆమె సరైన వ్యక్తిగా మేం భావించాం. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని మరీ ఈ స్థాయికి చేరింది. యువ తరానికి మార్గదర్శకంగా నిలిచే ఆమె మరింత మందిలో స్ఫూర్తిని రగిలించగలదు. కఠిన పరిస్థితుల్లో ఎలా రాణించాలనే విషయాలను యువ క్రికెటర్లకు మార్గనిర్దేశం చేయగలదు. అద్భుతమైన వ్యక్తిత్వం కలిగిన సానియా మీర్జా తప్పకుండా జట్టును ఉత్తమ పద్ధతిలో నడిపిస్తుందనే నమ్మకం ఉంది'' అని తెలిపారు.ఆర్సీబీకి మెంటార్‌గా నియమించడంపై సానియా మీర్జా ఆనందం వ్యక్తం చేసింది. ''ఆర్సీబీ మహిళా జట్టుతో కలవడం సంతోషంగా ఉంది. మహిళల ప్రీమియర్ లీగ్‌తో ఉమెన్స్ క్రికెట్ ఉన్నత శిఖరాలకు చేరడం ఖాయం. ఇలాంటి మెగా లీగ్‌ల వల్ల చిన్నారులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడానికి మార్గమవుతుంది. మెంటార్‌గా బాధ్యతలు చేపట్టేందుకు ఉత్సాహంతో ఉన్నా. చాలా ఏళ్లుగా ఐపీఎల్‌లో ఆర్సీబీ క్రేజ్ ఉన్న జట్టు'' అని సానియా వ్యాఖ్యానించింది. భారత టాప్ మహిళా క్రికెటర్ స్మృతీ మంధానను రూ. 3.4 కోట్లు పెట్టి మరీ ఆర్సీబీ సొంతం చేసుకొంది. తమకు కేటాయించిన నిధుల్లో మూడో వంతు స్మృతీ కోసమే కేటాయించడం విశేషం. ఆర్సీబీ మహిళా జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆసీస్‌కు చెందిన బెన్ స్వేయర్‌ను నియమించింది. ప్రస్తుతం స్వేయర్ న్యూజిలాండ్ మహిళా క్రికెట్ జట్టుకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు.

## క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలని షమీ అప్పుడు అనుకున్నాడు.. కానీ

**మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్**



న్యూఢిల్లీ: జహీర్ ఖాన్, ఇర్ఫాన్ పఠాన్, ఆశిశ్ నెహ్రా.. వంటి ఫాస్ట్ బౌలర్ల తర్వాత భారత జట్టులో కీలకంగా మారిన పేసర్ మహమ్మద్ షమీ. జస్ప్రీత్ బుమ్రా వెలుగులోకి వచ్చేంతవరకు షమీదే అగ్రస్థానం. కుటుంబ సమస్యలతో పాటు ఫిట్‌నెస్, గాయాలు ఇబ్బంది పెట్టినా తన బౌలింగ్‌లో వాడి మాత్రం తగ్గలేదు. ఇలాంటి షమీ ఒకానొక దశలో క్రికెట్‌కు గుడ్బై చెప్పేద్దామని భావించాడట. కానీ, టీమ్‌ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కలగజేసుకొని మద్దతుగా నిలవడంతో తన కెరీర్‌ను షమీ కొనసాగిస్తున్నాడని మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ వెల్లడించాడు.''ఐదేళ్ల కిందట 2018లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించాం. అయితే షమీ అందులో విఫలమయ్యాడు. నా గదికి రమ్మని ఆహ్వానించా. వ్యక్తిగతంగా ఇబ్బందులు పడ్డాడు. ఫిట్‌నెస్ పరంగానూ ప్రభావితుడయ్యాడు. మానసికంగా కాస్త కుంగుబాటుకు గురైనట్లు అనిపించింది. నేను వెంటనే అతడిని అప్పుడు కోచ్‌గా ఉన్న రవిశాస్త్రి దగ్గరకు తీసుకెళ్లా. 'రవి.. షమీ ఏదో చెప్పాలని అనుకుంటున్నాడు' అని అన్నా. అప్పుడు ఏంటని రవి అడగగానే.. నాతో షమీ ఏం చెప్పాడో అదే మళ్లీ చెప్పేశాడు. 'మరి నువ్వేం చేస్తావు? బౌలింగ్ చేయడం తప్ప నీకేం తెలుసు..?' అని మేం అన్నాం'' ''నువ్వు కోపంగా ఉండటంలో అర్థముంది. నీ చేతిలో బంతి ఉన్నప్పుడు ఇదే విధంగా ప్రవర్తించాలి. నువ్వు ఫిట్‌నెస్‌లో పూర్. ఇప్పుడు నీ దగ్గర ఉన్న కోపాన్ని నీ శరీరంలో నుంచి తీసేయ్. నిన్ను జాతీయ క్రికెట్ అకాడమీకి పంపుతాం. అక్కడే నాలుగు వారాలు ఉండు. ఇంటికి వెళ్లొద్దు' అని రవిశాస్త్రి చెప్పడంతో షమీ ఎన్సీఏకి వెళ్లిపోయాడు. దాదాపు ఐదు వారాల తర్వాత వచ్చిన షమీ 'సర్, నేను గుర్రం మాదిరిగా తిరిగి వచ్చా. ఇప్పుడు మీరు ఎంత దూరం పరుగెత్తమంటే అంత దూరం రన్ చేస్తా' అని నమ్మకంగా చెప్పాడు. ఫిట్‌నెస్‌పై దృష్టిసారించడంతోనే ఇదంతా సాధ్యమైంది'' అని భరత్ అరుణ్ గుర్తు చేసుకున్నాడు. ప్రస్తుతం బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో ఆసీస్‌పై తొలి టెస్టు మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి షమీ అబ్బురపరిచాడు. స్పిన్ పిచ్‌పై వికెట్లు తీయడం సులువైన విషయం కాదు.

## చాలా రోజుల తర్వాత 'లాంగ్ డ్రైవ్': విరాట్



న్యూఢిల్లీ: బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ టీమ్‌ఇండియా అగ్రస్థానానికి దూసుకెళ్లింది. శుక్రవారం నుంచి ఢిల్లీ వేదికగా రెండో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ప్రత్యేకంగా స్పందించాడు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఢిల్లీలో టెస్టు మ్యాచ్ జరగబోతోంది. తాను పుట్టిన గడ్డపై టెస్టు ఆడనుండటం ఆనందంగా ఉందని కోహ్లీ పేర్కొన్నాడు.''చాలాకాలం తర్వాత ఢిల్లీ స్టేడియం వైపు లాంగ్ డ్రైవ్ (సుదీర్ఘ ఫార్మాట్) వెళ్తున్నా. ఇది మాటల్లో వర్ణించలేని అనుభూతి. ఢిల్లీ పట్ల వ్యామోహ భావన కనిపిస్తోంది'' అని విరాట్ రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా కారు డ్రైవ్ చేస్తున్న ఇమేజ్‌ను పోస్టు చేశాడు. నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (12) రాణించలేకపోయాడు. కొత్త బౌలర్ మర్ఫీ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. సొంత మైదానంలో సెంచరీ సాధించి టెస్టుల్లో తన శతక నిరీక్షణకు తెరదించాలని భావిస్తున్నాడు.

## అప్పుడు సచిన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నాడు..

**టీమ్‌ఇండియా మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టన్**



న్యూఢిల్లీ: దాదాపు 28 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియా ఖాతాలో రెండో వన్డే ప్రపంచకప్ టైటిల్ పడింది. మిస్టర్ కెప్టెన్ కూల్ ఎంఎస్ ధోనీ నాయకత్వం వహించగా.. ప్రముఖ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ మార్గదర్శకత్వంలోనే 2011లో ఆ ఘనతను భారత్ సాధించింది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు ఇదే చివరి వరల్డ్ కప్ కావడం విశేషం. ఆరో ప్రపంచకప్‌లో సచిన్ చిరకాల వాంఛ తీరింది. 2003లో ఫైనల్‌కు దూసుకెళ్లినప్పటికీ.. ఆసీస్ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచింది. 2007లో ఘోరపరభావంతో భారత్ తీవ్ర విమర్శలపాలైంది. దీంతో 2008లో కోచింగ్ బాధ్యతలను చేపట్టిన గ్యారీ కిర్‌స్టన్ కేవలం మూడేళ్ల వ్యవధిలోనే ప్రపంచకప్ సాధించేలా జట్టును సిద్ధం చేయడం గమనార్హం. కానీ, కోచ్‌గా తాను రావడం పట్ల సచిన్ మొదట్లో అసంతృప్తిగా ఉన్నట్లు గ్యారీ గుర్తు చేసుకొన్నాడు. సచిన్‌ను ఫామ్‌లోకి తీసుకురావడమే అతిపెద్ద సవాల్‌గా మారిందని కిర్‌స్టన్ వెల్లడించాడు.''అత్యుత్తమ ఆటగాళ్లు కలిగిన జట్టుకు కోచింగ్ బాధ్యతలు ఎలా నిర్వహించాలనే దానిపై తర్జనభర్జన పడ్డాను. అంతకుముందు జరిగిన ప్రపంచకప్‌లో ఘోర పరాభవంతో ఇబ్బంది పడిన జట్టును గాడిలో పెట్టడం సవాల్‌తో కూడుకున్నదే. నేను కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో జట్టులో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఆనందంగా లేని ఆటగాళ్లలో మనోస్థైర్యం నింపాల్సిన బాధ్యత నాపై ఉంది. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ అర్థం చేసుకోవాలి. ప్లేయర్ల ఫిట్‌నెస్‌ను కాపాడుతూనే ఉత్సాహంగా బరిలోకి దిగేందుకు సాయమందించాలి''''సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజ ఆటగాడికి శిక్షణ ఇవ్వడం అంత సులువేం కాదు. ఒత్తిడి కూడా అధికంగానే ఉంటుంది. అయితే, నేను కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో సచిన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లుగా అనిపించింది. అప్పటికే సచిన్ తనదైన శైలిలో క్రికెట్‌నుఆస్వాదించలేకపోతున్నాడు. అలాగే త్వరలోనే ఆటకు వీడ్కోలు పలకాలని భావించాడు. అందుకే అతడితో కనెక్ట్ కావడం చాలా ముఖ్యం. ఇప్పటికే జట్టు విజయాల్లో సచిన్ కీలక పాత్ర పోషించాడు. అందువల్లే జట్టు ఇంతటి ఉన్నతస్థాయిలో ఉందనే విషయాన్ని సచిన్‌కు తెలియజేసేలా చేయాలని భావించా. దీంతో సచిన్ క్రికెట్‌ను ఆస్వాదించడం మళ్లీ ప్రారంభించాడు. అందుకు నేను సక్సెస్ అయినట్లే. ఎందుకంటే నేను కోచ్‌గా వచ్చిన తర్వాత జరిగిన తొలి వన్డే ప్రపంచకప్‌నే టీమ్‌ఇండియా సొంతం చేసుకొంది. ధోనీ వంటి కెప్టెన్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. భారత క్రికెట్ ఉన్నత శిఖరాలకు చేరడంలో అతడిదీ కీలక పాత్రే'' అని గ్యారీ కిర్‌స్టన్ తెలిపాడు.

## అది గొప్ప విజయం..
## సుమన్‌ను కొనియాడిన చిరంజీవి



ప్రముఖ నటుడు సుమన్ కమిట్‌మెంట్ ఏంటో ఆయన నటించిన చిత్రాలే చెబుతాయని చిరంజీవి కొనియాడారు. 10 భాషల్లో దాదాపు 500కిపైగా చిత్రాల్లో నటించడం గొప్ప విజయమని పేర్కొన్నారు. సుమన్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 45 సంవత్సరాలైంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో ద్వారా సుమన్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ''మై డియర్ బ్రదర్ సుమన్.. నటుడిగా నువ్వు 45 ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. నీ కమిట్‌మెంట్ ఏంటో నువ్వు నటించిన సినిమాలే చెబుతాయి. ఇంకా మరిన్ని సంవత్సరాలు లక్షలాది అభిమానులు, ప్రేక్షకులను ఇలానే అలరిస్తావని ఆశిస్తున్నా. ఈ నెల 16న బెంగళూరు వేదికగా జరగబోయే నీ ఈవెంట్ (సుమన్ 45 ఏళ్ల ప్రస్థానం పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న వేడుక) విజయవంతంకావాలని కోరుకుంటున్నా'' అని చిరంజీవి అన్నారు. 'నీచల్ కులమ్' (తమిళ్) సినిమాతో తెరంగేట్రం చేసిన సుమన్ 'ఇద్దరు కిలాడీలు'తో తొలిసారి తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చారు. 'నేటి భారతం', 'సితార', 'బావ బావమరిది' తదితర విభిన్న కథా చిత్రాలతో 90ల్లో తిరుగులేని హీరోగా రాణించారు. కథానాయకుడిగా కొనసాగుతూనే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గాను తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా 'అన్నమయ్య', 'శ్రీ రామదాసు' లాంటి సినిమాల్లోని భక్తి ప్రధాన పాత్రలతో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

## ఆమె కనిపిస్తే కళ్లార్పకుండా చూస్తుంటా..
## తన మొదటి క్రష్ గురించి చెప్పిన చరణ్



టాలీవుడ్‌లో ఎప్పుడూ అభిమానులతో టచ్‌లో ఉండే హీరోల్లో రామ్ చరణ్ ముందుంటాడు. తన వ్యక్తిగత విషయాలు, సినిమాకు సంబంధించిన విషయాలను ఫ్యాన్స్‌కు షేర్ చేస్తుంటాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో భాగంగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాడు. ఈ ఇంటర్వ్యూలో చరణ్ తన మొదటి క్రష్ గురించి మాట్లాడుతూ.. ''నాకు జూలియా రాబర్ట్స్ అంటే చాలా ఇష్టం. ఆమెను టీవీలో చూసినా, బిగ్ స్క్రీన్‌పై చూసినా అలా కళ్లు ఆర్పకుండా చూస్తూ ఉండిపోతాను. ఆమె నన్ను అంతగా ఆకర్షిస్తుంది. 'ప్రెట్టీ ఉమెన్' సినిమా నుంచి నేను ఆమెకు పెద్ద అభిమానిని అయ్యాను. అలాగే కేథరిన్ జెటా జోన్స్ కూడా ఇష్టం. ఆమె నటించిన సినిమాల్లో నేను మొదట చూసింది 'మార్క్ ఆఫ్ జోరో'. ఆ సినిమాలో తన నటన చూసి చాలా ఎంజాయ్ చేశాను'' అన్నారు.ఇక 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబుతో రామ్ చరణ్ సినిమా తీయనున్న సంగతి తెలిసిందే. ఈ రోజు ఈ టాలెంటెడ్ డైరెక్టర్ పుట్టినరోజు సందర్భంగా చరణ్ ఆయన్ని కలిసి విషెస్ చెప్పాడు. ఆ ఫొటోను అభిమానులతో పంచుకుంటూ.. ''నా అభిమాన దర్శకుల్లో ఒకరైన బుచ్చిబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. మీరెప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలోనే సెట్‌లో మళ్లీ కలుద్దాం'' అని రాశారు.



## మనం సినిమా

### ఈ డార్లింగ్ అసలైన కింగ్..
### ప్రభాస్‌పై తమన్నా పొగడ్తలు



ఆతిథ్యమివ్వడంలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్. సినీ ప్రముఖుల నుంచి అభిమానుల వరకూ అందరికీ తన ఇంటి వంటకాలు రుచి చూపించడం ఆయనకు అలవాటు. తాజాగా మిల్కీ బ్యూటీ తమన్నా ఈ డార్లింగ్ ఆతిథ్యానికి ఫిదా అయ్యింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌ను పొగడ్తలతో ముంచెత్తింది. ''ప్రభాస్‌కు చాలా మంది అభిమానులు ఉన్నారు. అతడు తన ఇంటికి వచ్చిన అతిథులను ఎలా చూసుకుంటారో దేశమంతా తెలుసు. ఆయన భోజనానికి పిలిస్తే అందులో కనీసం 30 రకాల వంటకాలు ఉంటాయి. డబ్బు గురించి ఆలోచించే వ్యక్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే నిజంగా ఒక రాజు ఎలా ఉంటాడో ప్రభాస్‌ను చూస్తే తెలుస్తుంది. ఆయన్ని అభిమానులు ఎంతగా ఇష్టపడతారో అతడికి తెలియదు. అతడు అంత పెద్ద స్టార్ అయినా.. చాలా సాధారణంగా ఉంటాడు'' అంటూ ప్రభాస్‌పై ప్రశంసలు కురిపించింది తమన్నా. ఇప్పటికే ప్రభాస్ అతిథి మర్యాదలను పలువురు సినీతారలు మెచ్చుకున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, సూర్య, పూజా హెగ్డే, శ్రుతి హాసన్, శ్రద్ధా కపూర్ ఇలా చాలా మంది ప్రభాస్ ఇంటి వంటకాలు రుచి చూసి ఫిదా అయ్యారు. ఇక ప్రస్తుతం ఈ బాహుబలి స్టార్ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఓం రౌత్ దర్శకత్వంలో 'ఆదిపురుష్', ప్రశాంత్ నీల్‌తో 'సలార్' సినిమాలు చేస్తున్నాడు. షూటింగ్ తుది దశలో ఉన్న ఈ చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

### రాజమౌళి నంబర్స్ దాకా వెళ్తాం..
### మహేశ్ మూవీపై అంచనాలు పెంచేసిన నిర్మాత



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా (ఎస్ఎస్ఎంబీ28) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాపై నిర్మాత సూర్యదేవర నాగ వంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చెప్పారు.''ఈ సినిమా అభిమానులు పెట్టుకున్న అంచనాలకు 'అల వైకుంఠపురములో' సినిమా అప్పుడు కూడా రాజమౌళి నంబర్స్ దాకా వెళ్లాం. ఇక మహేశ్ – త్రివిక్రమ్‌ల సినిమా మా అంచనాలను చేరుకుంటుందని ఆశిస్తున్నా'' అని చెప్పి నాగవంశీ ఈ సినిమాపై హైప్‌ను మరోసారి పెంచేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రానున్న ఈ సినిమా కోసం మహేశ్ బాబు అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇందులో మహేశ్ సరసనపూజాహెగ్డే, శ్రీలీల నటిస్తున్నారు. పవర్‌ఫుల్ కథాంశంతో రూపొందుతోన్న ఈ సినిమాకు తమన్ స్వరాలు అందిస్తున్నారు.

## ఆ సినిమా పోతుందని నాకు, త్రివిక్రమ్‌కు ముందే తెలుసు..



సాధారణంగా నిర్మాతలు అనే కాదు.. సినిమాలో పనిచేసినవారు ఎవరైనా తాము చేసిన సినిమా ఫ్లాప్ అంటే ఒప్పుకోరు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న జనరేషన్‌లో అయితే అస్సలు చేయరు. రిలీజ్ అయ్యిన ఒక్కరోజుకే సక్సెస్ సెలబ్రేషన్స్ చేస్తూ మా సినిమా అన్ని రికార్డులు సాధించింది. ఇన్ని కలెక్షన్స్ రాబట్టింది అంటూ చెప్పే నిర్మాతలను చాలామందిని చూసాం. కానీ నిర్మాతలయందు నాగవంశీ వేరు.. ఏదైనా ముక్కుసూటిగా చెప్పడంలో సూర్యదేవర నాగవంశీ ముందు ఉంటాడు. భీమ్లా నాయక్ సినిమా రిలీజ్ సమయంలో మొహమాటం లేకుండా ఏపీ ప్రభుత్వం గురించి సంచలన వ్యాఖ్యలు చేసి షాక్ ఇచ్చాడు. ఇక తన సినిమాల విషయంలో ఖచ్చితంగా ఉండే ఈయన సినిమా హిట్ అయినా ఫ్లాప్ అయినా ఒకే రకంగా స్పందిస్తాడు. ఇక తాజగా నాగవంశీ నిర్మిస్తున్న చిత్రాలలో సార్ ఒకటి. ధనుష్ నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రమోషన్స్‌లో పాల్గొన్న నాగవంశీ తన సినిమాల గురించి నిర్మొహమాటంగా చెప్పుకొచ్చాడు.మీ సినిమాల్లో ఏ సినిమా చూసి మీరు ముందే ఫ్లాప్ అవుతుందని అనుకున్నారు అన్న ప్రశ్నకు నాగవంశీ తడుముకోకుండా బుట్టబొమ్మ అని చెప్పుకొచ్చేశాడు. స్క్రిప్ట్ విషయంలో ఎంత కేర్ తీసుకున్నా కానీ మేకింగ్ చూసాకా బుట్టబొమ్మ ఫ్లాప్ అవుతుందని నాకు, త్రివిక్రమ్‌కు ముందే తెలుసు. మూడేళ్ళ క్రితమే ఈ మూవీ రైట్స్ తీసుకొని మంచి కథగా తీర్చిదిద్ది ప్రేక్షకులకు చూపించాలనుకున్నాం. కానీ ఆ సినిమా బయటికి రావడానికి ఇంత సమయం పట్టింది. ఒక పదహారేళ్ళ కొత్త అమ్మాయి కథను థియేటర్‌కు వెళ్లి చూడాలని ప్రేక్షకులు ఎవరు కోరుకోరు. మేకింగ్ అంతా అయిపోయి.. సినిమా రిలీజ్‌కు పదిరోజులు ఉంది అనగా సినిమా చూసిన త్రివిక్రమ్, నేను సినిమా ఫ్లాప్ అయ్యిందనే అనుకున్నాం.. కానీ, రిలీజ్ డేట్ ప్రకటించేసి ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టేసరికి ఏమీ చేయలేక థియేటర్‌లోనే సినిమాను రిలీజ్ చేశాము అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం నాగవంశీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## రీ-ఎంట్రీలో 'విమానం' ఎక్కుతున్న అందాల భామ!




దాదాపు రెండు దశాబ్దాల క్రితం 'అమ్మాయి బాగుంది' అంటూ అందరితో అనిపించుకుంది మీరా జాస్మిన్. ఆ తర్వాత బాలకృష్ణ, పవన్ కళ్యాణ్, రాజశేఖర్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో చోటు దక్కించుకుంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ, పెర్ఫార్మెన్స్ క్యారెక్టర్స్ కు ప్రాధాన్యమిచ్చిన మీరా జాస్మిన్ టాలీవుడ్‌కు దూరమై దాదాపు దశాబ్దం అయిపోయింది. అయితే గత కొంత కాలంగా తన రీ-ఎంట్రీ గురించి హింట్స్ ఇస్తూ ఉంది. గ్లామరస్ స్టిల్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ సినిమారంగంలోని దర్శక నిర్మాతలకు తాను గ్లామర్ షోకూ రెడీ అని చెప్పకనే చెప్పింది. మొత్తానికి అమ్మడి పథకాలు ఫలించాయని తెలుస్తోంది.ఇవాళ మీరా జాస్మిన్ 40వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె 'విమానం' అనే సినిమాతో రీ-ఎంట్రీ చేస్తున్నట్టు జీ స్టూడియోస్ సంస్థ ఓ ప్రకటన చేసింది. ఆమె నాయికగా కె.కె. క్రియేటివ్ వర్క్స్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో సినిమా చేయబోతున్నట్టు తెలిపింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన సమాచారం ప్రకటించాల్సి ఉంది. మాధవన్ 'రన్' మూవీతో తమిళంలోనూ మీరా జాస్మిన్‌కు లక్షలాది అభిమానులు ఏర్పడ్డారు. అదే సమయంలో ఇటు తెలుగులోనూ 'గుడుంబా శంకర్, భద్ర' చిత్రాలలో నటించి పేరు తెచ్చుకుంది. నటిగా జాతీయ అవార్డునూ సొంతం చేసుకున్న మీరా జాస్మిన్ ఇప్పుడీ 'విమానం'తో ఇంకే హద్దులకు విహరిస్తుందో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.